ఆదివారం 'వార్త' మెయిన్‌లో

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 321 పేజీలు: 12 వెల: 6.50



నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం

KAPIL GROUP


కపిల్ చిట్స్

Visit Us: www.kapilchits.com

45

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


# మరింత సంక్షేమం.. మరికొంత వికాసం



## దేశవ్యాప్తంగా గ్రామీణులకు పనిదినాలు పెంచిన 'విబిజి రామ్‌జీ'

### కొత్త బిల్లుకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ముర్ము

### శాశ్వత మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

### వ్యవసాయం, జలసంరక్షణకు ప్రాధాన్యం

### సామాజిక భద్రతకు సరికొత్త వ్యూహం

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** గ్రామీణప్రాంత నిరుపేదలకు వ్యవసాయ కార్మికులకు నిరంతరపనిదినాలను కల్పించే లక్ష్యంతోమరింత సామాజిక భద్రతను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం అమలుకు తెచ్చిన వికసిత్‌భారత్ గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) పథకం ఇపుడు దేశవ్యాప్తంగా గ్రామీణులకు ఉపాధి దినాలను మరింత పెంచేదిగా ఉంది. ఇప్పటివరకూ ఉన్న 100 రోజుల పనిదినాలను విధిగా ఇపుడు 125 రోజులు పనిదినాలు కల్పించాలని దిశా నిర్దేశంచేస్తోంది. విబిజి రామ్‌జీ 2025 పేరిట కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన ఈ బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతోపాటు రాష్ట్రపతిసైతం ఆమోదించడంతో చట్టరూపంలో అమలు లోనికి వచ్చేసింది. గ్రామీణుకు ఉపాధి కల్పించడంతోపాటు >>2

# బడుగులకే పెద్దపీట

## టిడిపి లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

## మొత్తం 25 మందిలో 14 బడుగు, బలహీనవర్గాలకే

## విజయవాడకు గద్దె అనూరాధ, తిరుపతికి పనబాక లక్ష్మి

## పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు



**విజయవాడ, డిసెంబరు 21,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు దేశం పార్టీ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు, కార్యవర్గాన్ని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పోస్టులకు వచ్చిన ప్రతిపాదనలను వడపోసి, వివిధ సామాజిక సమీకరణాల్ని దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు జాబితాను ఖరారు చేశారు. మొత్తం 25 మంది అధ్యక్షుల్లో 14 బడుగు బలహీన వర్గాలకే కేటాయించడం విశేషం. మొత్తం 25 మంది పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల జాబితాలో బీసీలు 8, మైనార్టీ 1, ఎస్సీలు 4, ఎస్టీ 1, ఉండగా మిగిలిన 11మంది ఓసీలు ఉన్నారు. 5 గురు మహిళలకు చోటు కల్పించారు. జిల్లా పార్టీ అధ్యక్షులుగా పిలవబడే తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులను అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఆ జాబితా పరిశీలిస్తే, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులుగా మోదవలస రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పీరికట్ల విఠల్‌రావు నియమితులయ్యారు. విజయనగరానికి కిమిడి నాగార్జున, ప్రసాదుల వరప్రసాద్‌లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. అరకు(ఎస్టీ) పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులుగా మోజోరు తేజోవతి, ప్రధాన కార్యదర్శిగా దత్తి లక్ష్మణరావు ఎంపికయ్యారు. విశాఖపట్నం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా చోడే వెంకట పట్టాభిరాం, ప్రధాన కార్యదర్శిగా లొడగల కృష్ణకు బాధ్యతలు ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులుగా బత్తుల తాతయ్య బాబు, ప్రధాన కార్యదర్శిగా లాలం కాశి నాయుడు ఎంపికయ్యారు. అమలాపురం జిల్లా పార్టీ అధ్యక్షుడుగా గుత్తల సాయి, ప్రధాన కార్యదర్శిగా పాలం రాజు నియమితులయ్యారు. కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులుగా జ్యోతుల నవీన్, ప్రధాన కార్యదర్శిగా పెంకే శ్రీనివాస్ బాబా ఎంపికయ్యారు. రాజమండ్రి జిల్లా పార్టీ అధ్యక్షుడుగా బొడ్డు వెంకట రమణ చౌదరి, ప్రధాన కార్యదర్శిగా కాసి నవీన్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఏలూరుపార్టీ అధ్యక్షుడుగా బడేటి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ముత్తారెడ్డి జగ్గవరపు నియమితుల య్యారు. నర్సాపురం జిల్లా పార్టీ అధ్యక్షుడుగా మంతెన రామరాజు, ప్రధాన కార్యదర్శిగా పితాని మోహన్ రావు ఎంపికయ్యారు. విజయవాడ జిల్లా పార్టీ అధ్యక్షుడుగా గద్దె అనురాధ, ప్రధానకార్యదర్శిగా చెన్నుబోయిన చిట్టిబాబు లకు బాధ్యతలు అప్పగించారు. మచిలీపట్నం పార్టీ అధ్యక్షుడుగా వీరంకి గురుమూర్తి, ప్రధాన కార్యద >>2

# శాంతిభద్రతలో రాజీలేదు

## తప్పు చేసినవారికి శిక్ష తథ్యం..

## ఎవరిపైనా కక్ష సాధింపులుండవు..

## టిడిపి విధానాల వల్లే సీమ ఇప్పుడు ఫ్యాక్షన్ రహితం

## మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం చంద్రబాబు

**విజయవాడ డిసెంబర్ 21, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించాలని ప్రయత్నించే అరాచకశక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఏ ఒక్కరిపైన ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, అక్రమ కేసులు పెట్టడం జరగ దన్నారు.చట్టాన్ని అతిక్రమించి నేరాన్ని చేసిన వారెవ్వరైన ఉపేక్షించేది లేదన్నారు.ఈ విషయంలో మన,తన ఉండదన్నారు. గత పాలకుల అరాచకానికి ప్రజలతో పాటు నేనూ బాధితుడినేననిఅన్నారు. తప్పుడు కేసులతో వేధించడానికి అరెస్టు చేసి జైల్లో పెట్టారనీ... జైల్లో కూడా తన కదలికలు చూడ్డానికి డ్రోన్ ఎగరేశారనీ అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి పై ఇష్టాగోష్టి సమావేశంలో సిఎం చంద్రబాబు స్పందిస్తూ "గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపై అత్యాచారయత్నం కేసులు పెట్టారు. ప్రస్తుత స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన కేసుల బాధితులే. నాపై 17 కేసులు పెట్టి వేధించారు. ఇది అరాచకానికి పరాకాష్ట. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేష్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారు. అంగళ్లులో నాపై దాడి చేయించి మళ్లీ నా పైనే కేసులు పెట్టారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జెసి ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బిటెక్ రవి, కూన రవి ఇలా నేతలపై కేసులు పెట్టి వేధించారు. గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే. అమరావతి రైతులు, మహిళలు రాజధాని కోసం పోరాడుతుంటే బాత్ రూమ్‌లపై డ్రోన్లు ఎగరేశారు. అమరావతి రైతులు న్యాయస్థానం నుంచి దేవస్థానం పాదయాత్రకూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారు. గత పాలకుల అరాచకాలు భరించలేక పారిశ్రామికవేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారు. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారు. ఆఖరుకు సింగపూర్ లాంటి ప్రభుత్వంపైనా అభాండాలు వేసి ప్రాజెక్టు నుంచి వైదొలిగేలా చేశారు. 2019-24 వరకూ రాష్ట్రం తీవ్రస్థాయిలో అరాచకాలను భరించింది. గత పాలకులు టిడిపి కార్యాలయంపై కూడా దాడి చేశారు అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. బాధ్యత కలిగిన నాయకుడిని కాబట్టే ప్రజలు నన్ను నాలుగోసారి ఎన్నుకున్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అరెస్టు చేసి ఉండేవాళ్లం. గతంలో సిఎంగా ఉండగా అలిపిరి వద్ద నక్సల్స్ 23 క్లైమోర్ మైన్లు బ్లాస్ట్ చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడ్డాను. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సమస్యల గురించి నక్సల్స్ కు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తే నాపై క్లైమోర్ మైన్స్ పేల్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నా ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధపడ్డాను. రాయలసీమలోనూ కరడు గట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపాం. టిడిపి తీసుకున్న విధానాల వల్లే రాయలసీమలో ఇప్పుడు ఫ్యాక్షన్ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో మత విద్వేషాలనూ సమర్ధవంతంగా కట్టడి చేశాం. గత పాలకుల హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఎమ్మెల్యేల ఆవేశానికీ అర్థం ఉంది. అయితే వారు ప్రవర్తించిన విధంగానే మనం >>2

# ఆటోలు, క్యాబ్‌ల కోసం ప్రత్యేక యాప్

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రూపకల్పన

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** మెట్రో సిటీలు, పెద్ద నగరాల్లో ప్రయాణాలకు ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్‌లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వ ఆధీనంలో ఓ పోర్టల్/యాప్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రూపొందించారు. త్వరలోనే యాప్‌ను విడుదల చేస్తామని, ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. విజయవాడ దుర్గ గుడి, భవానీ ద్వీపం, కృష్ణా నది తీరం వెంబడి ఆలయాల సందర్శనకు వచ్చే పర్యాటకులకు చౌకగా, భద్రంగా రవాణా సేవలు అందించడానికి ఉపయోగపడేలా దీన్ని తయారు చేశారు. సందర్శకుల నుంచి స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎక్కువ రుసుము డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, ఆంధ్రా ట్యాక్సీ యాప్‌తో మోసాలకు చెక్ పెట్టనున్నట్లు చెబుతున్నారు. సందర్శకులను చౌకధరల్లో సౌకర్యంగా, భద్రంగా తిప్పడమే ఈ యాప్‌ఉద్దేశం. దీని ద్వారా పర్యాటకం వృద్ధి చెందుతుందని, వాహన దారులకు కచ్చితమైన ఉపాధి లభిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. >>2




# పోలీసులకు సంక్షేమ రుణాలు ఒక్క రోజులోనే

## పూర్తిగా డిజిటలైజ్ చేసిన ప్రక్రియ

**విజయవాడ.డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సిబ్బంది సంక్షేమం కోసం ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. సంక్షేమ రుణాల మంజూరు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేస్తూ 'అపోలిస్' (ఆటోమేటెడ్ పోలీస్ ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) అనే నూతన విధానాన్ని డిజిపి హరీశ్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ కొత్త విధానం ద్వారా గతంలో మూడు నెలల సమయం పట్టే సంక్షేమ రుణ మంజూరు ప్రక్రియ ఇప్పుడు కేవలం ఒక్క రోజులోనే పూర్తవుతుంది.

ఈ సందర్భంగా డిజిపి హరీశ్ కుమార్ గుప్తా ఒక పోలీస్ ఉద్యోగికి తన కుమార్తె వివాహం కోసం రూ.3 లక్షల సంక్షేమ రుణాన్ని కొత్త వ్యవస్థ ద్వారా తక్షణమే మంజూరు చేసి విడుదల చేశారు. అవసరమైన పత్రాలను పరిశీలించిన తర్వాత, దర ఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే రుణం అందించేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

పోలీసు శాఖలో పరిపాలనా విధులను సులభతరం చేసేందుకు, కాగిత రహిత పాలనను ప్రోత్సహించేందుకు 'అపోలిస్' ఇఆర్‌పి ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశారు. డిజిపి కార్యాలయం నుంచి బెటాలియన్లు, యూనిట్ కార్యాలయాల వరకు అన్ని విభాగాలను ఈ ప్లాట్‌ఫామ్ పరిధిలోకి తీసుకువస్తారు. భవిష్యత్తులో మెరుగైన నిర్ణయాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలను కూడా దీనికి అనుసంధానం చేయనున్నామని తెలిపారు. ఈ >>2



# రైలు టిక్కెట్లు పెంపు

## పెరిగిన ఛార్జీలు 26 నుంచి అమలు

### 215 కి.మీ దాకా మార్పు లేదు..

### ఆపై పైసా, రెండు పైసలు చొప్పున అదనపు ఛార్జీ

### నాన్ ఎసి రైలులో 500 కి.మీకి అదనంగా రూ. 10 పెంపు

### సబర్బన్ ఛార్జీలు యధాతథం

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** భారతీయ రైల్వే శాఖ టికెట్ ధరలను సవరించింది. ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం పొందడమే లక్ష్యంగా, టికెట్ ధరలను పెంచింది. పెంచిన ధరలు ఈనెల 26 నుంచి అమల్లోకి వస్తాయని రైల్వే తెలిపింది. తాజా ధరల సవరణలుచూస్తే 215 కిలోమీటర్ల వరకు జనరల్ టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అంతకుమించి ఎక్కువ దూరం ప్రయాణించే వారికి కిలోమీటరుకు 1 పైసా చొప్పున అదనపు చార్జీ పడుతుంది. అదే సమయంలో ఎక్స్ ప్రెస్, మెయిల్, నాన్ ఎసి రైళ్లలో కిలోమీటరుకు రెండు పైసలు చొప్పున పెరగనుంది. అటు, నాన్ ఎసి రైళ్లలో 500 కిలోమీటర్ల >>2

# తొలి టి20 మ్యాచ్‌లో భారత్ మహిళలు అదుర్స్

2లో

## ఎనిమిది వికెట్లతో శ్రీలంక మహిళా జట్టు ఓటమి

22-12pg2exHMNWJQE 2_22-12pg2exHMNWJQE.qxd 21/Dec/25 11:15 PM Page 1





# తొలి టి20 మ్యాచ్‌లో భారత్ మహిళలు అదుర్స్

## ఎనిమిది వికెట్లతో శ్రీలంక మహిళా జట్టు ఓటమి

**విశాఖపట్టణం, డిసెంబరు 22:** మహిళల ఐదు టి20 సిరీస్‌లో భాగంగా భారత జట్టు తొలి సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. విశాఖపట్టణంలో షురూ అయిన వన్‌డే ఛాంపియన్ టోర్నీలో తొలి మ్యాచ్‌లోనే భారత మహిళలు అదరగొట్టారు. జెమీమా రోడ్రిగ్స్ 69 నాటౌట్‌గా క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగి శ్రీలంకను చిత్తుగా ఓడించింది. స్మృతి మంధాన25తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేసింది. మంధాన ఔటైనా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 నాటౌట్‌తో కలిసి కూల్‌గా ఆడిన జెమీమా టీమిండియాను 8వికెట్లతో గెలిపించింది. మరో 5 ఓవర్లు మిగిలి ఉండగానే ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్ పట్టేసిన టీమిండియా టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధతను ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో విశాఖలో జరిగిన తొలి టీ20లో భారత్ భారీ విజయం సాధించింది. మొదట శ్రీ చరణి1-30, క్రాంతి గౌడ్1-23లు లంకను 121కే కట్టడి చేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో షఫాలీ వర్మ9 విఫలమైనా స్మృతి మంధాన 25 తన స్టయిల్లో రెచ్చిపోయింది. ఈ ఫార్మాట్లో 4 వేల క్లబ్‌లో చేరిన మంధాన కాసేపటికే రణవీర ఓవర్లో సిక్సర్‌కు యత్నించి వెనుదిరిగింది. దాంతో రెండో వికెట్‌కు జెమా రోడ్రిగ్స్ 69 నాటౌట్‌తో నెలకొల్పిన 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 నాటౌట్ తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించింది జెమీమా. గిమ్హాని వేసిన 12వ ఓవర్లో రెండు ఫోర్లతో అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఆమె చివరి రెండు బంతుల్ని బౌండరీకి తరలించింది. రణవీర వేసిన 15వ ఓవర్లో జెమీమా సింగిల్ తీయగా 8 వికెట్ల తేడాతో టీమిండియా గెలిచింది. సిరీస్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. ఓపెనర్లు విష్మీ గుణరత్నే39, చమరి ఆటపట్టు 15,శుభారంభమిచ్చిన ఆ తర్వాత బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు.

# శాంతిభద్రతలో రాజీలేదు

>> కూడా ప్రవర్తించకూడదు. తప్పు చేసిన ఎవరికైనా శిక్ష తథ్యం. చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరిస్తుంది. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలి. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం కట్టడికి చర్యలు..**

"సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. గత పాలకుల హయాంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారు. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నేరస్థులకు అండగా ఉండే రాజకీయాలను నేను ఇంతవరకూ చూడలేదు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలి. వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వరకూ జాగ్రత్తగా ఉండే నాపై కూడా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేటియం బ్యాచ్‌లను పెట్టి పెద్ద ఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేయిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం పోయాక మరోలా ప్రవర్తిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా తీవ్రస్థాయిలో వేధింపులు చేస్తున్నారు. వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేశాం.

ఫేక్ ప్రచారాలు చేసే నేరస్తులు ప్రపంచంలో ఎక్కడున్నా తీసుకువస్తాం. మహిళలపై కించపరిచేలా పోస్టులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ తరహా నేరాలపై సీరియస్‌గా వ్యవహరిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా నన్నూ ఏమార్చారు. అక్కడున్న రక్తాన్ని శుభ్రం చేశారు. ఏమీ తెలియని వారిలా అమాయకంగా వచ్చి స్టేట్ మెంట్ ఇచ్చారు. చివరకు గుండె పోటు కాదు గొడ్డలి పోటు అని తేలింది. ఫేక్ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయపరంగా చాలా మందిని ఎదుర్కొన్న నేను ఇప్పుడు నేరస్తుల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది". అని సీఎం అన్నారు.

**మహిళలపై నేరాలను కట్టడి చేశాం..**

మహిళలపై రాష్ట్రంలో నేరాలుతగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతం మేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43 శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15 తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 810 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలుచేపట్టాం.

శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసి మహిళల రక్షణపట్ల చర్యలు చేపడుతున్నాం.సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం, ఆన్ లైన్ లోనూ నేరస్తుల ఫోటోలు పెడతాం. రాష్ట్రంలో ఓ ఉద్యమంగా డ్రగ్స్ నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేస్తున్నాం. రాష్ట్రంలో గంజాయిని జీరో కల్టివేషన్ స్థాయికి తీసుకువచ్చాం. అయితే పొరుగు రాష్ట్రాల నుంచి కొంతమేర అక్రమంగా రవాణా అవుతోంది.

రాష్ట్రంలో సైబర్ ఫ్రాడ్స్ కోట్లలో నష్ట పోతున్నారు. బాగా చదువుకున్న వ్యక్తులు కూడా సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి డబ్బు నష్ట పోతున్నారు. సైబర్ క్రైమ్స్, ఫ్రాడ్స్ ఉచ్చులో పడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టాం. ఫోరెన్సిక్స్ ను కూడా బలోపేతం చేస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదు" అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



ఆదివారం హైదరాబాద్ సమీపంలోని కన్హా శాంతివనాన్ని సందర్శించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్. చిత్రంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

# క్యాబ్‌ల కోసం ప్రత్యేక యాప్

>> ఆంధ్రా ట్యాక్సీ పోర్టల్/ యాప్‌లో క్యాబ్, ఆటోలను వాట్సప్, ఫోన్‌కాల్, యాప్, క్యూఆర్ కోడ్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.ఏ ప్రాంతం నుంచి కావాలో యాప్‌లో ఎంటర్ చేస్తే, అక్కడ స్థానికంగా రిజిస్టర్ అయినవి డ్రైవర్ వివరాలతో సహా ఉంటాయి. రవాణా శాఖ అధికారుల ద్వారా పరీక్షించి, ఫిట్‌నెస్ ఉన్నవాటికే అనుమతి ఇస్తారు. మహిళల భద్రత దృష్ట్యా వాహనాల డేటా, బుకింగ్ సమాచారం స్థానిక పోలీస్ స్టేషన్లకు అందేలా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌లో నమోదైన వాహనాల సమాచారం రాష్ట్ర డేటా కేంద్రానికి చేరుతుంది. ప్రయాణికుల వ్యక్తిగత డేటా భద్రంగా ఉంటుంది. విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రవాణాతో పాటు హోటల్ గదులు బుక్ చేసుకునేందుకు ఆప్షన్స్ ఇచ్చారు. మొత్తం ప్యాకేజీగానూ ఎంచుకోవచ్చు. రైతుల అవసరాల మేరకు డ్రోన్ సేవలు కూడా అందించనున్నారు. కొందరు ఆటో డ్రైవర్‌లతో ప్రయాణికులకు ఎదురయ్యే సమస్యలకు చెక్ పెట్టేలా పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా ప్రతి ఆటో డ్రైవర్ సీటు వెనక క్యూఆర్ కోడ్ అతికిస్తున్నారు. దీని ద్వారా ఎవరైనా డ్రైవర్ దురుసుగా ప్రవర్తించినా, మద్యం తాగి వాహనం నడుపుతున్నా, విలువైన వస్తువులు ఆటోలో పోగొట్టుకున్నా సరే ప్రయాణికులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపితే చాలు వెంటనే ఆ ఆటో వివరాలతో సహా ఎక్కడుందనేది కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులకు సమాచారం త్వరితగతిన అందుతుంది. దాంతో పోలీసులు అప్రమత్తమై వెంటనే చర్యలు తీసుకుంటారు. మహిళల భద్రతకు అందుబాటులో ఉన్న 100, 112, 181 నంబర్లను సైతం ప్రతి ఆటోలో పొందుపరిచారు.

# రైలు టిక్కెట్లు పెంపు

>> దూరం ప్రయాణానికి టికెట్‌పై అదనంగా రూ.10 పెంచారు. గడచిన దశాబ్దకాలంలో రైల్వే శాఖ తన కార్యకలాపాలను మరింత విస్తృతం చేసిందని, అందుకు అనుగుణంగా మానవ వనరుల శక్తి పెంచుకోవాల్సి ఉందని, ఆదాయం కూడా అవసరమని రైల్వే శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2024-25లో జీతాలు, ఇతర ఖర్చుల రూపేణా రూ.1.15 లక్షల కోట్లు చెల్లించగా, రూ.60 వేలకోట్లతో పెన్షన్లు చెల్లించామని, మొత్తంగా రూ.2.63 లక్షలకోట్ల వ్యయం అయిందని రైల్వే శాఖ వివరించింది. ఆదాయ పెంపు మార్గాల్లో భాగంగా ప్రయాణికులపై చార్జీలు పెంచడంతో పాటు సరకు రవాణాను అధికం చేయడంపైనా దృష్టిసారిస్తున్నామని వివరించింది. ప్రతి 500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి నాన్ ఏసి టికెట్లపై రూ.10 అదనపు భారం పడుతుంది.పెరిగిన రైల్వే ఛార్జీలు డిసెంబర్ 26 నుంచి అమలులోకి వస్తాయి. సబర్బన్ రైలు ప్రయాణ ఛార్జీలను రైల్వే పెంచలేదు. ఎక్కువ దూరం ప్రయాణాలకు సంబంధించిన ఛార్జీలు పెరిగాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎయిర్ కండిషన్డ్ లేని (నాన్ ఏసీ) కోచ్‌ల్లో ప్రయాణాలకు కిలోమీటరుకు 2 పైసలు పెంచింది. ఎయిర్ కండిషన్డ్ (ఏసీ) కోచ్‌లలో ప్రయాణ ఖర్చు కూడా కిలోమీటరుకు 2 పైసలు పెరిగింది. దీంతో నాన్ ఏసీ, ఏసీ కోచ్‌ల్లో ప్రయాణాలకు ప్రతి 500 కిలోమీటర్ల దూరానికి రూ.10 అదనంగా ఖర్చు పెరుగుతుంది. మరోవైపు పెరిగిన కొత్త ఛార్జీలు ఈనెల 26 నుంచి అమలులోకి వస్తాయని రైల్వే తెలిపింది. ఛార్జీల పెంపు వల్ల రైల్వే ఆదాయం ఏటా రూ. 600 కోట్లు పెరుగుతుందని పేర్కొంది. రైల్వే ఉద్యోగుల వేతనాల ఖర్చు రూ.1,15,000 కోట్లకు, పెన్షన్ ఖర్చు రూ.60,000 కోట్లకు పెరిగిందని రైల్వే తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైల్వే కార్యకలాపాల మొత్తం ఖర్చు రూ.2.63 లక్షల కోట్లకు పెరిగినట్లు వివరించింది. ఈ నేపథ్యంలో కార్గో, ప్రయాణీకుల ఛార్జీల పెంపుపై దృష్టి సారించినట్లు రైల్వే వెల్లడించింది.

# మైనర్‌పై గ్యాంగ్‌రేప్

## నలుగురు నిందితుల అరెస్ట్

## కోర్టుకు తరలింపు, రిమాండ్

**విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో 13 ఏళ్ల మైనర్ బాలికను నలుగురు దుండగలు ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు స్పందించి, రక్షించారు. బాధితురాలు ఇంటికి చేరుకుని, తల్లికి జరిగిన ఘటన వివరించగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన ఈ నెల 18న రాత్రి 10 గంటల సమయంలో జరగ్గా, ఆలస్యంగా వెలుగుచూసింది. దర్యాప్తు చేస్తున్న పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. గుంటూరు నార్త్ డిఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నలుగురు నిందితులను మంగళగిరి టౌన్ సిఐ వీరాస్వామి తమ సిబ్బందితో నడిరోడ్డుపై నడిపిస్తూ, కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత, రక్షణకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను ఏ మాత్రం సహించబోమని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

# గవర్నర్ జస్టిస్ నజీర్, సిఎం చంద్రబాబు

## డిసిఎం పవన్, మంత్రి లోకేష్ కూడా ట్విట్టర్‌లో శుభాకాంక్షలు

## అన్నకు శుభాకాంక్షలు తెలిపిన పిసిసి అధ్యక్షురాలు షర్మిల



**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సిఎం జగన్‌కు పుట్టిరోజు సందర్భంగా ఎపి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు కేక్ కటింగ్, అన్నదానం చేస్తున్నారు.ఈ క్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో జగన్ సుదీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆయన ఆకాంక్షి ం చారు.ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.'వైఎస్ జగన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మంచి ఆరోగ్యంతో దీర్ఘా యువు పొందాలని కోరుకుంటున్నా" అంటూ సిఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. విజయ సాయిరెడ్డి సోషల్ మీడియా వేదికగా జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్ పుట్టినరోజు సంద ర్భంగా ఇరు తెలుగురాష్ట్రల్లో ఉన్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తు న్నారు. కేక్ కటింగ్ కార్యక్రమాలు, అన్నదానాలతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. జగన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు సంపూర్ణఆరోగ్యం, సుఖ సంతోషాలు అందించా లని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని డిప్యూటి సిఎం పవన్ పేర్కొన్నారు. వైఎస్సార్సీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నానని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. సంకల్పానికి మారుపేరు వైఎస్ జగన్.. విశ్వసనీయతకు నిలువుటద్దం.. మా ఆరాధ్యదైవం జగన్‌అన్నకు జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాక్షేత్రంలో మీరు మరిన్ని శిఖరాలు అధిరోహిం చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను." అని మాజీ మంత్రి ఆర్కే రోజా విషెస్ తెలిపారు. వైఎస్ఆర్సీ అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డికి మాజీ ఎంపి విజయసాయిరెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జగన్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని.. ప్రజా సేవలో వారికి మరింతశక్తి, విజయం లభించాలని కోరుకున్నారు. ఆటు పోట్లను అవలీలగా ఎదుర్కోగల 'ధీరుడికి' జన్మదిన శుభాకాంక్షలు అని మాజీ మంత్రి అంబటి రాంబాబు జగన్‌కు విషెస్ తెలిపారు.

# మరింత సంక్షేమం.. మరికొంత వికాసం

>> గ్రామీణప్రాంతాల్లో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ఈపథకం ప్రాధాన్యతనిస్తోంది. సృష్టించిన కొత్త వనరులన్నీ కూడా వికసిత్ భారత్ జాతీయ గ్రామీణ మౌలిక వనరుల వ్యవస్థలోకి వెళతాయి. ఏకీకృత సమన్వయంతోకూడిన జాతీయాభివృద్ధి వ్యూహంతో కొత్తపథకం అమలవుతుంది. పిఎం గతిశక్తి వంటి జాతీయ వ్యవస్థలతో అనుసంధానించిన ఈ ప్రణాళికలను పంచాయతీలే సిద్ధంచేస్తాయి. వ్యవసాయం, భూగర్భజలాలనున పెంపొందించడం, మిషన్ అమృత్ సరోవర్‌లో పునరుద్ధరించిన 68వేల జలాశయాలు ఆధారంగా చేసుకుని అలాంటి జలసంరక్షణ పథకాలకు ఎక్కువ ప్రాధానం ఉంటుంది. గ్రామీణప్రాంతాల్లో మెరుగైన రోడ్లు, అనుసంధానించడం, ప్రాథమికసేవలు మరింత మెరుగుపరచేలా పనులుంటాయి. వాతావరణముప్పు, పర్యావరణ పరిరక్షనతోకూడిన నీటిసంరక్షణ, వరద నియంత్రణ, భూసంరక్షణ పనుల్లో ఉపాధి హామీ అమలవుతుంది. ఈ కొత్తపథకంద్వారా వలసలను తగ్గించవచ్చని కేంద్రం విశ్వసిస్తోంది. డిజిటల్ వ్యవస్థల వినియోగంతో జవాబుదారీతనం పెరుగుతుందని, డిజటల్ హాజరు, ప్రత్యక్ష చెల్లింపులుఅంటే డిబిటి వ్యవస్థ, డేటా ఆధారిత ప్రణాళికలు అమలవుతున్నాయి.

గ్రామీణ రైతులకు కూలీలను చేరువచేస్తుంది. వ్యవసాయ మౌలికవనరులు పెంపొందిస్తుంది. విత్తనాలు నాటడం, కోతలసమయాల్లో కూలీలు అందుబాటులో ఉండేలాచూసుకోడం కోసం ముమ్మర వ్యవసాయ సీజన్ 60రోజుల్లోను ఈపనులు రాష్ట్రాలు నిలిపివేస్తాయి. అలాగే దినసరి కూలీల వేతనం కృత్రిమ పెరుగుదలను కూడా కట్టడిచేసే వీలు కలుగుతుంది. దీనివల్ల ఆహారోత్పత్తి వ్యయనియంత్రణకు వీలుకలుగుతుంది. పంటనష్టాలను తగ్గిచడం, మార్కెట్ అనుసంధానిత పెంచడం, నిల్వసౌకర్యాలు మరింత మెరుగుపరుస్తుందని అంచనా. అలాగే మురుగునీటిపారుదల, నీటిసంరక్షణ భూసంరక్షణ వంటి పనులు ఎక్కువ ఉంటాయి.

ప్రస్తుత విబిజిరామ్‌జీతో 25శాతంవరకూ అదనపు ఆదాయం పొందగలుగుతారు. వికసిత్‌గ్రామ పంచాయతీ ప్రణాళికలతో ఉపాధి లభ్యత మరింతగా డిజిటల్ వ్యవస్థల్లో తెలుసుకోవచ్చు. బయోమెట్రిక్; ఆధార్ ఆధారిత ధృవీకరణతో వేతన చెల్లింపుల్లో జాప్యం నివారిస్తారు. పూర్తిపారదర్శకంగా ఉంటుంది. 2024-25 నాటికి 99.94 శాతం డిజిటల్‌పద్ధతిలోనే జరుగుతున్నాయి. నిర్ణీత వ్యవదిలో ఉపాధి కల్పించనిపక్షంలో రాష్ట్రప్రభుత్వాలు నిరుద్యోగభృతిని కూడా చెల్లించాలి. మెరుగైన రోడ్లతోపాటు జీవనోపాధికి తోడ్పడే ఆస్తుల కల్పనలతో కూలీలకు నిత్యప్రయోజనం కలుగుతుంది. 20 ఏళ్లనాటి పరిస్థితులకు అనుగుణంగా ఆనాడు ఎంజినరేగాను రూపొందించారు. అప్పటినుంచి గణనీయమైన మార్పులు రావడంతో ఇపుడు విబిజిరామ్‌జీ2025 బిల్లును కేంద్రం తీసుకువచ్చి గ్రామీణప్రాంతాలకు ఎంతోమేలుచేసింది. పెరుగుతున్న రాబడులు, ఆర్థికసదుపాయాల తోడ్పాటుతో 2011.12లో 25.7శాతం ఉన్న పేదరికం 2023-24 నాటికి 4.86శాతానికి తగ్గింది. ఇదే



అంశాన్ని పలు సర్వేలుకూడా స్పష్టంచేసాయి. సామాజిక భద్రత వ్యవస్థలతోపాటు మెరుగైన కనెక్టివిటీ, విస్తరించిన డిజిటల్ యాక్సెస్ అంటే అనుసంధానం, వైవిద్యమైన గ్రామీణ జీవనోపాధితోప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పన చేయడంవల్ల గ్రామీణ నిరుపేదలకు మెరుగైన ఉపాధినందించే కల్పతరువుగా మారుతోంది. ఈ పథకం ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు భరించినా రాష్ట్రాలకు కూడా బాధ్యతలు పెంచింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 60శాతం కేంద్రం నిధులు అందిస్తే 40శాతం కచ్చితంగా రాష్ట్రాలు భరించాలి. దీనివల్ల పారదర్శకంగా బాధ్యతాయుతంగా విబిజిరామ్‌జీ బిల్లు అమలవుతుందని కేంద్రం భావిస్తోంది.

ఈశాన్య రాష్ట్రాలపరిధిలో అయితే 90శాతం కేంద్రం, 10శాతం రాష్ట్రాలు విధిగా భరించాలి. అంతేకాకుండా ఈపథకంలో మహిళల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలనినిర్ణయించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 48శాతం మాత్రమే మహిళల భాగస్వామ్యం ఉంటే ప్రస్తుత ఏడాదిలో 56.74శాతం ఉంది. అలాగే ఆధార్‌అనుసంధానం చేసిన కూలీల సంఖ్య 2013-14లో 76 లక్షలుంటే ఇపుడు ఆసంఖ్య 12.11కోట్లకు పెరిగింది. ఎపిబిఎస్‌కింద కవర్‌చేసిన కార్మికులు 11.93 కోట్లవరకూ ఉన్నారు. అలాగే అభివృద్ధిచేసిన ఆస్తులను జియోట్యాగింగ్ చేయడంవల్ల ఇపుడు 6.44 కోట్లకుపైగా ప్రభుత్వ ఆస్తులు జియోట్యాగింగ్ జరిగింది. మొత్తంగా ఈ పథకం అమలులో మందు 37శాతం మాత్రమే ఉన్న ఆన్‌లైన్ చెల్లింపులు ఇపుడు డిబిటి వ్యవస్థతో 99.99శాతం జరుపుతుండటం వల్ల కార్మికుల ఖాతాల్లోకే నేరుగా వేతన సొమ్ము జమ అవుతోంది. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా గ్రామీణ నిరుపేదల జీవితాల్లో వెలుగురేఖలు మరింతగా ప్రకాశించేదిశగా కేంద్రం ఈపథకాన్ని అమలులోకి తెచ్చిందనడంలో ఎలాంటి సందేహంలేదు.

# బడుగులకే పెద్దపీట

>> ర్శిగా గోవు సత్యనారాయణ నియమితులయ్యారు. గుంటూరు పార్టీ అధ్యక్షుడుగా పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శిగా పోతినేని శ్రీనివాసరావు ఎంపికయ్యారు. నర్సరావుపేట జిల్లా పార్టీ అధ్యక్షుడుగా షేక్ జానే సైదా, ప్రధాన కార్యదర్శిగా నల్లపాటి రామచంద్ర ప్రసాద్‌కు పార్టీ ఎంపిక చేసింది. బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా సలగల రాజశేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శిగా నక్కల రాఘవకు బాధ్యతలు ఇచ్చారు. ఒంగోలు జిల్లా పార్టీ అధ్యక్షుడుగా ఉగ్ర నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొరాటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడుగా బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడుగా పనబాక లక్ష్మీ ్మ, ప్రధాన కార్యదర్శిగా డాలర్ దివాకర్ రెడ్డి నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడుగా షణ్ముగ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వై.సునీల్ కుమార్ చౌదరి నియమితులయ్యారు. రాజంపేటకు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా సుగవాసి ప్రసాద్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ ఖాదర్ ఖాన్‌కు బాధ్యతలు ఇచ్చారు. కడప జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వై.ఎస్ జబీవుల్లా నియమితులయ్యారు. కర్నూలు జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా గుడిశె కృష్ణమ్మ, ప్రధాన కార్యదర్శిగా పూల నాగరాజు యాదవ్ నియమితులయ్యారు. నంద్యాల జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా గౌరు చరితారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్ఎండి ఫిరోజ్ నియమితులయ్యారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడుగా పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ చౌదరి ఎంపికయ్యారు. హిందూపూర్ జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడుగా ఎం.ఎస్. రాజు, ప్రధాన కార్యదర్శిగా హనుమప్ప నియమితులయ్యారు.

సోషల్ ఇంజనీరింగ్‌లో భాగంగా బడుగులకు ఎక్కువ పదవుల కేటాయించారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేలా పదవుల కేటాయింపు జరిగింది. పార్టీ విధేయులకు పెద్ద పీట వేస్తూ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా పదవులు భర్తీ చేశారు. 25 పార్లమెంట్ అధ్యక్ష స్థానాలకు 14 పార్లమెంట్ పార్టీ అధ్యక్ష స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించారు. 5గురు మహిళలకు పార్లమెంట్ అధ్యక్ష స్థానాలు దక్కాయి. మోజోరు తేజోవతి, గద్దె అనూరాధ, పనబాక లక్ష్మీ, గుడిశె కృష్ణమ్మ, గౌరు చరితా రెడ్డిలు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సీనియర్, జూనియర్ కాంబి నేషన్లో ఈ పదవుల కేటాయింపు జరిగింది. నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీకి పార్లమెంట్ అధ్యక్ష పదవులు దక్కాయి. ఈ జాబితాలో బడేటి రాధాకృష్ణ, ఉగ్ర నరసింహారెడ్డి, గౌరు చరితా రెడ్డి, ఎంఎస్ రాజు, బీదా రవిచంద్ర యాదవ్‌లు ఉన్నారు. కీలక పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలను సీనియర్ నేతలకు అప్పగించారు.

| క.స | పార్లమెంట్ | అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి |
|---|---|---|---|
| 1. | అనకాపల్లి | బత్తుల తాతయ్య బాబు | లాలం కాశీ నాయుడు |
| 2. | అరకు(ఎస్టీ) | మోజోరు తేజోవతి | దత్తి లక్ష్మణరావు |
| 3. | శ్రీకాకుళం | మొదలవలస రమేశ్ | పీరికట్ల విఠల్ రావు |
| 4. | విశాఖపట్నం | చోడే వెంకట పట్టాభిరాం | లొడగల కృష్ణ |
| 5. | విజయనగరం | కిమిడి నాగార్జున | ప్రసాదుల వరప్రసాద్ |
| 6. | అమలాపురం | గుత్తల సాయి | పాలం రాజు |
| 7. | ఏలూరు | బడేటి రాధాకృష్ణ | ముత్తారెడ్డి జగ్గవరపు |
| 8. | కాకినాడ | జ్యోతుల నవీన్ | పెంకే శ్రీనివాస్ బాబా |
| 9. | నర్సాపురం | మంతెన రామరాజు | పితాని మోహన్ రావు |
| 10. | రాజమండ్రి | బొడ్డు వెంకట రమణ చౌదరి | కాసి నవీన్ |
| 11. | బాపట్ల | సలగల రాజశేఖర్ బాబు | నక్కల రాఘవ |
| 12. | గుంటూరు | పిల్లి మాణిక్యరావు | పోతినేని శ్రీనివాసరావు |
| | గుంటూరు | పిల్లి మాణిక్యరావు | పోతినేని శ్రీనివాసరావు |
| 13. | మచిలీపట్నం | వీరంకి గురుమూర్తి | గోవు సత్యనారాయణ |
| 14. | నర్సరావుపేట | షేక్ జానే సైదా | నల్లపాటి రామచంద్ర ప్రసాద్ |
| 15. | విజయవాడ | గద్దె అనురాధ | చెన్నుబోయిన చిట్టిబాబు |
| 16. | చిత్తూరు | షణ్ముగ రెడ్డి | వై.సునీల్ కుమార్ చౌదరి |
| 17. | నెల్లూరు | బీద రవిచంద్ర | చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి |
| 18. | ఒంగోలు | ఉగ్ర నరసింహా రెడ్డి | కొరాటి నాగేశ్వరరావు |
| 19. | రాజంపేట | సుగవాసి ప్రసాద్ బాబు | పఠాన్ ఖాదర్ ఖాన్ |
| 20. | తిరుపతి | పనబాక లక్ష్మీ | డాలర్ దివాకర్ రెడ్డి |
| 21. | అనంతపురం | పూల నాగరాజు | జి.శ్రీధర్ చౌదరి |
| 22. | హిందూపూర్ | ఎం.ఎస్. రాజు | హనుమప్ప |
| 23. | కడప | చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి | వై.ఎస్ జబీవుల్లా |
| 24. | కర్నూలు | గుడిశె కృష్ణమ్మ | పూల నాగరాజు యాదవ్ |
| 25. | నంద్యాల | గౌరు చరితారెడ్డి | ఎన్.ఎం.డి. ఫిరోజ్ |

నెల్లూరు పార్లమెంట్‌కు బీదా రవిచంద్ర, విజయ వాడకు గద్దె అనూరాధ, తిరుపతి పార్లమెంటుకు పనబాక లక్ష్మీ ్మల నియామకం జరిగింది. గోదావరి జిల్లాల్లో సామాజిక సమీకరణాల ఆధా రంగా పదవుల కేటాయిం చారు. క్షత్రియ వర్గం నుంచి మంతెన రామరాజు, కాపు సామాజిక వర్గం నుంచి జ్యోతుల నవీన్, శెట్టి బలిజ సామాజిక వర్గం నుంచి గుత్తల సాయికి చంద్రబాబు పార్లమెంట్ అధ్యక్ష పదవులిచ్చారు. త్రిసభ్య కమిటీ ఇటీవల ఖరారు చేసిన జాబితాలో అయిదుగురు పేర్లు మారాయి. దాదాపు ఖరారైన జాబితా మీడియా ద్వారా బయటకు వచ్చాక పలుచోట్ల నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకనుగుణంగా 5చోట్ల పేర్లు మార్పు జరిగినట్లు తెలుస్తోంది. అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, నరసరావుపేట, అనంతపురం లలో గతంలో దాదాపు ఖరారైన పేర్లలో మార్పు జరిగింది.

# ఒక్క రోజులోనే

>> కార్యక్రమంలో భాగంగా 'అపోలిస్' మొబైల్ యాప్‌ను కూడా డిజిపి ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా సిబ్బంది సులభంగా సంక్షేమ రుణాలు, సెలవుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే పేస్లిప్స్, మెడికల్ రిపోర్టులు, పోలీస్ శాలరీ ప్యాకేజీ వివరాలను కూడా చూసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో అదనపు డిజిపి ఎన్. మధుసూదన్ రెడ్డి, ఐజిపి సిహెచ్. శ్రీకాంత్, డీఐజీ అన్బు రాజన్‌తో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

22-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
విదియ ఉ.11.50
ఉత్తరాషాఢ తె.5.21, మూల కార్తె
వర్జ్యం : ఉ.9.47-11.30
దు.ము.12.29-1.04, మ.2.42-3.27
శుభసమయం : ఉ.8.30-9.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగిస్తాయి.వాహన సౌఖ్యం కలదు.

**వృషభం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి.

**కర్కాటకం:** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం:** దూరప్రాంతాలల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. సోదరుల కలయిక.వాహన సౌఖ్యం.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి.వస్త్రలాభం.

**వృశ్చికం:** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం.ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం:** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.సోదరుల కలయిక.

**కుంభం:** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు.ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం:** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

22-12Pg3exHMNWJQE 3_22-12Pg3exHMNWJQE.qxd 21/Dec/25 10:43 PM Page 1



# శేషాచలంకొండలకు జీవనాడి 'దివ్యఔషధ వనం'

## రూ.4.25కోట్లతో 3.90ఎకరాల్లో ఏర్పాటు



**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండలకు మరో మణిహారం చేరనుంది. భారతీయ సాంప్రదాయ వైద్యానికి ప్రాణంపోసే ఔషధమొక్కల సంరక్షణ లక్ష్యంగా తిరుమలలో "దివ్యఔషధవనాన్ని" ఏర్పాటుచేయాలని టిటిడి నిర్ణయించింది. తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్‌కు సమీపంలో దిగువ,ఎగువ ఘాట్‌రోడ్లకు మధ్యలో ఉన్న 3.90 ఎకరాల స్థలంలో ఈ విద్యఔషధవనం అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్వయం నిర్ణయంతో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు సిద్దం చేశారు. 2026 జనవరిలో పనులు ప్రారంభించి మొక్కలను పెంచనున్నారు. భక్తుల సందర్శనకు వీలుగా పార్కింగ్, మౌళిక సదుపా యాలు ఏర్పాటుచేసి 2026 చివరికి పూర్తి స్థాయిలో ఔషధవనాన్ని అందుబాటులోకి తీసుకు రానున్నారు.

4.25కోట్ల రూపాయల అంచనాతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు టిటిడి బోర్డు ఆమోదం తెలిపింది. అరుదైన, జీవపరి ణామం ఉట్టిపడే శేషాచలం అడవుల్లో అంతరించిపోతున్న ఔషధమొక్కలకు నిలయంగా ఉన్న జీవనాడి దివ్యఔషధవనం ఏర్పాటుచేసేందుకు టిటిడి సంకల్పించింది. ఔషధమొక్కలను సంరక్షిస్తూ ప్రజలకు పరిచయం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. దీనిద్వారా పర్యావరణ పరిరక్షణ,జీవ వైవిధ్య సంరక్షణ లక్ష్యాలకు దివ్య ఔషధ వనం తొడ్పడనుంది. దక్షిణభారత దేశంలోనే ఈ తరహాలో రూపొందించనున్న ఔషధవనం భక్తులు, పరిశోధకులు, విద్యార్థులు ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

### భక్తి విజ్ఞానం ప్రకృతి సమ్మేళనం

తిరుమలలో టిటిడి ఏర్పాటుచేయనున్న దివ్య ఔషధవనంలో దేహ చికిత్స వనం, సుగంధ వనం, పవిత్రవనం, ప్రసాద వనం, పూజాద్రవ్య వనం, జీవరాశివనం, కల్పవృ క్షధామం, ఔషధకుండి, మూలికావనం, విశిష్టవృక్ష వనం, ఔషధమొక్కలు వంటి 13రకాల ప్రత్యేక థీమ్ ఆధారిత విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ఇవి భక్తులకు ఆధ్యా త్మిక అనుభూతిని కలిగించడమేగాక ఔషధ విజ్ఞానం, ప్రకృతిపై అవగాహనను పెంపొందించనున్నాయి.

# తిరుపతిలో అధునాతన బస్ టెర్మినల్

## పాతబస్టాండు స్థానంలోనే అద్భుతంగా ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మాణానికి కసరత్తు



**తిరుపతి,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** కొన్ని దశాబ్దాల క్రిందట అప్పటి తిరుమల యాత్రికుల అవసరాలకు అనుగుణంగా తిరుపతినగరంలో నిర్మితమైన సెంట్రల్ ఆర్టీసి బస్టాండు ఇప్పటి భక్తుల రద్దీకి ,విపరీతంగా పెరిగిన ప్రయాణీల సేవలకు తగ్గట్లు లేకపోవడంతో అధునాతన నూతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు టర్మినల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదిసంవత్సరాల క్రిందట ప్రతిపాదనలు ఇప్పుడు అమలులోకి వస్తుండటంతో దీనిపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సుమారు 500 కోట్ల రూపాయలు వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్‌తోబాటు 10 అంతస్థులతో తిరుమల ఆలయ నమూనా తరహాలో ఈ ఆర్టీసి బస్టాండు ఇంటిగ్రేటెడ్ టర్మినల్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ, అంతర్జాతీయ ఖ్యాత ఉట్టిపడేలా అధునాతనంగా బస్‌స్టేషన్ నిర్మాణం పనులు మొదలుకానున్నాయి. ప్రస్తుతం 60వేలమంది ప్రయాణీకులతో ,50వేలమంది వరకు యాత్రికులతో నిత్యం రద్దీగా ఉండే తిరుపతి సెంట్రల్ బస్టాండు (ఏడుకొండలు బస్టాండ్, శ్రీహరిబస్టాండు, శ్రీనివాసాబస్టాండ్) నుండి తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసిబస్సులతోబాటు తమిళనాడు, కర్నాటక ,పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్టీసి బస్సులు తిరుపతికి వస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న ప్రయాణీకుల సౌకర్యం తోబాటు అన్ని రకాల వాణిజ్యసముదాయాలకు నిలయంగా ఇంటిగ్రేటెడ్ బస్టేషన్ అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ సిద్దమైంది. బస్‌టెర్మినల్ నుండి కూతవేటు దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు స్కైవే ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటూకానుంది. 13ఎకరాల్లో ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రస్తుతం 70వరకు ప్లాట్‌ఫామ్‌లతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుసర్వీసులతో నిండిపో తోంది. ఈ బస్‌స్టేషన్ నుండి తిరుమలకు నేరుగా రోడ్డుసౌకర్యం ఉంది. తిరుపతి విమానాశ్రయంకు కూడా నూతన ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టనుంది. నూతన టర్మినల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని ప్రాంతాలకు వెళ్ళే బస్సుప్లాట్‌ఫామ్‌లు, మొదటి అంతస్థుల నుండి ప్రయాణీకులకు సదు పాయాలు, వాణిజ్యసముదాయాలు, హోటళ్ళు, ఆర్టీసి కార్యాలయాలు,డార్మిటరీలు,డ్రైవర్ల విశ్రాంతి గదులు, ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3లక్షలమంది వరకు ప్రయాణీలకు సరిపోయేలా ,మరో నాలుగు దశాబ్దాల వరకు ఇబ్బంది లేకుండా ఈ అధునాతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఇతరరాష్ట్రాల నుండి బస్టాండుకు వస్తున్న ఆర్టీసి బస్సులతోబాటు తిరుపతి,చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుండి వచ్చే గ్రామీణ ప్రాంతాల ఆర్టీసి బస్సులను తాత్కాలిక బస్టాండులు మంగళం, బైరాగిపట్టెడ,తిరుచానూరుసమీపం, మూవడ మైలు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తున్నారు. ఈ స్థలాలను ఇప్పటికే ఆర్టీసి ఉన్నతాధికారులు పరిశీలించారు.

# అలిపిరిలో బ్రీత్ అనలైజర్లతో తనిఖీ

## రూ.8 లక్షల విలువైన పరికరాలు అందజేత



**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రానికి మద్యం సేవించి కొండెక్కాలని చూస్తే ఇకపై అలాంటి ఆటలు సాగనీయకుండా తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీచేసేందుకు టిటిడి ,తిరుపతి పోలీసులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందుకు అవసరమైన బ్రీత్ ఎనలైజర్లను టిటిడి తిరుపతి పోలీసులకు అందజేసింది. తొలివిడతలో 20 బ్రీత్‌ఎనలైజర్లు అందజేయగా వీటిల్లో నాలుగు అలిపిరి తనిఖీ కేంద్రానికి, మరో నాలుగు తిరుమలకు అందించారు.మిగిలిన 12 వాటిని తిరుపతిలో ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. తిరుమలను పవిత్రక్షేత్రంగానే భావించి భక్తులు, స్థానికులు, కార్మికులు పవిత్రతను కాపాడటానికి ఇతోధికంగా సహకారం అందించాలి. అయితే కొన్ని సందర్భాల్లో కార్మికులు, స్థానికులు ,యాత్రికులు కూడా మద్యం సేవించి మత్తులో కొండకు ఆర్టీసి బస్సుల్లో, ట్యాక్సీల్లో వచ్చేస్తున్నారు. ఇలా తోటి భక్తులకు కూడా తీవ్ర ఇబ్బందికలిగిస్తున్నారు. దీనిపై ఇప్పటికే టిటిడికి అందిన ఫిర్యాదులతో తగిన చర్యలకు ఉపక్రమించింది. యాత్రికులను అలిపిరి తనిఖీ కేంద్రంలో తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్‌లో తనిఖీ చేసేందుకు బ్రీత్ ఎనలైజర్లు పరికరాలు అందజేశారు. ఆదివారం ఉదయం టిటిడి ఇఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, డిఎస్పీలు రామకృష్ణమాచారి, విజయశేఖర్, సిఐలు హరిప్రసాద్, సంజీవకుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు. తిరుమల పోలీసులకు, తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు ఇఒ సింఘాల్,ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా అందజేశారు. ఘాట రోడ్లలో రోడ్డుప్రమాదాల నివారణ, భక్తుల భద్రతకు టిటిడి చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా మద్యంసేవించి బండి నడిపేవారినేగాక కొండెక్కేవారిని పట్టుకునేందుకు ఇవి ఉపయోగిస్తారు. తొలిరోజే ఆదివారం సాయంత్రం అలిపిరి టోల్‌గేట్‌లో వీటిని ఉపయోగించారు. కాగా బ్రీత్‌ఎనలైజర్ల పనితీరును స్వయంగా ఎస్పీ సుబ్బరాయుడు ఇఒకు వివరించారు.

# రాజ్యాంగ సూత్రాల మేరకే వ్యవహరించాలి

## జిల్లా న్యాయవ్యవస్థకు ఉత్తమస్థానం కల్పించిన రాజ్యాంగం: 'సుప్రీం' జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా




ప్రసంగిస్తున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

**విజయవాడ, డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే భారత న్యాయ వ్యవస్థ అతి పెద్దదని సుప్రీమ్ కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాల కంటే ఉత్తమ లక్షణాలను కలిగి ఉందన్నారు.న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ మూల స్థంభం అని అన్నారు. జ్యుడిషియల్ అకాడమీలో నిర్వహించిన రాజ్యాంగ దృక్కోణం జిల్లా న్యాయ వ్యవస్థ పాత్ర (అప్ హోల్డింగ్ ద కాన్‌స్టిట్యూషనల్ విజన్ ద రోల్ ఆఫ్ డిస్ట్రిక్ట్ జూడీషియరీ) అనే సెమినార్ లో సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఉపన్యాసం చేశారు. న్యాయ వ్యవస్థలో ప్రతి అంశంలో రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా, స్థైర్యంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగంలో జిల్లా న్యాయ వ్యవస్థకు ఉత్తమ స్థానం కల్పించడం జరిగిందన్నారు. ఉత్తమ న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన విధిగా గుర్తించాలని సూచించారు. సామాన్యునికి న్యాయం చేరువ కావడానికి న్యాయ వ్యవస్థ పనితీరు మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. న్యాయ స్థానంలో జరిగే విచారణ సామాన్యునికి సైతం అర్థం కావాలని, అప్పుడే న్యాయ వ్యవస్థపై విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని చెప్పారు. న్యాయ వ్యవస్థ చట్టానికి, గౌరవానికి వారధిగా పనిచేయాలని అందుకు న్యాయ మూర్తులుగా విలువలు, బాధ్యతలు పాటించాలని, మంచి క్రమ శిక్షణ, న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఉద్బోధించారు. పోటీ తత్వంలో విజయం సాధించే దిశగా ప్రతి న్యాయ మూర్తి తయారు కావాలని, రోజు రోజుకు పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ పాట్రన్ ఆఫ్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్థలోకే ముఖ్యమైనదని అన్నారు. జీవించే హక్కు కలిగి ఉండడం అంటే వ్యక్తి జీవించడం ఒకటే కాదని, మంచి జీవనాన్ని గడిపే హక్కు కలిగి ఉండటం అని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ పనితీరులో ఏమాత్రం అశ్రద్ధ ఉన్న అధికరణ 14,15 ప్రకారం న్యాయాన్ని సక్రమంగా వెలువరించడం సాధ్యం కాదని అన్నారు. రాజీలేని న్యాయ వ్యవస్థను నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. రాజ్యాంగాన్ని సక్రమంగా పరిరక్షి ంచుకోవడమే రాజ్యాంగానికి ఇచ్చిన విలువ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి , జ్యుడిషియల్ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి వ్యక్తికి పౌర హక్కులు ఇచ్చిందన్నారు. వీటిని జిల్లా న్యాయ వ్యవస్థ పటిష్టంగా రక్షణ కల్పించాలన్నారు. మహిళలు, చిన్నారులు పై వచ్చే వివాదాలు చాలా మేరకు సున్నితమైనవని సరైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలోనే స్పష్టమైన విధానాన్ని అవలంబించడం ద్వారా కేసుల పరిష్కారంలో రాజ్యాంగ మార్గదర్శకాల మేరకు చేయవచ్చని చెప్పారు. రాజ్యాంగ పీఠికలో ప్రతి పౌరునికి ఆర్థిక, సామాజిక, సౌభ్రాతృత్వం వంటి అంశాలను కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్, హై కోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తులు, రాష్ట్రంలో వివిధ జిల్లాలో పనిచేస్తున్న న్యాయ అధికారులు పాల్గొన్నారు.

# రైల్లో 7 కేజీల గంజాయి పట్టివేత: ఇద్దరు అరెస్టు

**సింగరాయకొండ, డిసెంబరు 21, ప్రభాత వార్త:** రైల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఉదయం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఈగల్ టీం సిబ్బంది ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు బొకారో ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6.770 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయితో కలిసి ఒంగోలు జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఒంగోలు జీఆర్‌పీ సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ యు.సుధాకర్ ఆధ్వ ర్యంలో ఎస్సైలు సుదర్శన్, చెంచయ్య, శివరామయ్య, జీఆర్‌పీ ఎస్సై కే.మధుసూదన్ రావు, ఏఎస్‌ఐ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



### మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై

# జగన్‌కు స్పష్టత

## వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు" అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకా లంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు.

జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు. చంద్రబాబు తన 18 నెలల పాలనలోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేశారని, కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆర్థికవేత్తలే ఆశ్చర్యపోయేలా జగన్ తన ఐదేళ్ల పాలనను సాగించారని సజ్జల ప్రశంసించారు.

# ఎపి మహిళలకు మరో పథకం

## సిద్ధమవుతున్న ప్రభుత్వం

**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఏపీ ప్రభుత్వం మరో మంచికబురు తెలిపింది. స్వయం సహాయక సంఘాలకు మరో కీలక బాధ్యతలను అప్పగించనుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. అలాగే పలు కోర్సుల్లో వారికి ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. ఈ క్రమంలో వారి కోసం మరో పథకం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది. ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉంది. ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ కిచెన్ల బాధ్యతలను మహిళా సంఘాలకు అందించనుంది.వంట వండటమే కాకుండా ప్యాకింగ్, సమయానికి భోజనం పంపించడం, వ్యర్థాల నిర్వహణ వంటి బాధ్యతలను మహిళలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలోని కడప, జమ్మలమడుగు వంటి ప్రాంతాల్లో స్మార్ కిచెన్లను మహిళా సంఘాలకు అప్పగించడంతో సక్సెస్ అయింది. దీంతో త్వరలో మరో 33 స్మార్ట్ కిచెన్ల బాధ్యతలను కూడా వారిని ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక మహిళా సంఘాల ఆధ్వర్యంలో నేచురల్ ఫార్మింగ్ కూరగాయలు పండిస్తున్నారు. వీటిని మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించనున్నారు. మహిళా సంఘాలు పండించిన కూరగాయలు మధ్యాహ్న భోజన పథకంకు సరఫరా చేయడం వల్ల వారికి ఆదాయం లభిస్తుంది. అలాగే సేంద్రీయ వ్యవసాయంపై మహిళా సంఘాలకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు మండల సమాఖ్యలు సహాయం చేయనున్నాయి. ఆర్గానిక్ కూరగాయలు మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించడం వల్ల పిల్లలకు పోషక విలువలు కూడా పెరగనున్నాయి. అంతేకాకుండా మహిళలకు ఉపాధి కూడా లభించనుంది.

# తిరుమల సమాచారం

## 2,129మంది చిన్నారులకు పోలియో చుక్కలు



**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమం తిరుమలలో విజయవంతమైంది. శ్రీవారి దర్శనంలోభాగంగా తిరుమలలో పలుచోట్ల 0-5ఏళ్ళలోపు పిల్లలతో వచ్చిన యాత్రికులను గుర్తించి 2,129మందికి టిటిడి వైద్యఆరోగ్యసిబ్బంది పోలియోచుక్కలు వేశారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిరంతరాయంగా 25 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించేలా సిబ్బంది చూశారు. అలిపిరి నుండి కాలినడకమార్గాల్లో, తిరుమల ఆలయం వరకు పలుకేంద్రాలను నిర్వహించారు.



## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మనసు సంతోషం

**తిరుమల,డిసెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషం కలిగిస్తుందని ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ్‌ప్రతాప్ దంపతులు, ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, జస్టిస్ శ్యామ్‌సుందర్‌లు ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎపిలో ఇక కేరళ తరహా జలవిహారం

## విజయవాడ బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు

## సూర్యలంక బీచ్ బ్యాక్‌వాటర్‌లో కూడా... రాత్రి బోటులోనే బస

## అక్టోబరుకల్లా అందుబాటులోకి విలాసవంతమైన పడవలు



**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యాటక రంగంలో కీలక ముందడుగు పడింది.విజయవాడ బెర్మ్ పార్కు సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం ఐదు అల్ట్రా లగ్జరీ బోట్లు నడిపేందుకు ప్రైవేటు ఆపరేటర్లు ముందుకొచ్చారు. వీరికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాథమిక అనుమతులిచ్చింది. రెండు చోట్లా ఐదు జెట్టీలు నిర్మించడంతో పాటు బోట్లకు విద్యుత్ సౌకర్యం సంస్థ కల్పించనుంది. ఐదు బోట్లకు సంబంధించిన డ్రాయింగ్‌లకు ఇన్‌లాంట్ వాటర్ వేస్ అథారిటీ అనుమతులు ఆపరేటరుల తీసుకొని బోట్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 2026 అక్టోబరు నాటికి బోట్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కేరళ తరహాలో నదులు,సముద్రం బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం విలాసవంతమైన పడవలు(అల్ట్రా లగ్జరీ బోట్లు) ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ఏడాదిగా ప్రయత్నిస్తోంది. అందుకోసం ఆసక్తి గల సంస్థలను ఆహ్వానించింది. కేరళలో ఇప్పటికే ఈ తరహా సేవలు అందిస్తున్న ఒక సంస్థ ఏపీకి చెందిన మరొకరితో కలిసి ఉమ్మడి భాగస్వామ్యం కింద బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు రెండు బోట్లు నడిపేందుకు ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి 20 కిలోమీటర్ల మేర సర్వే కూడా చేశారు. ఒక బోటులో ఐదు పడక గదులు,వంద మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాలు ఉంటుంది. మరో బోటును 200 మంది డిన్నర్ చేసేందుకు వీలుగా డిజైన్ చేయనున్నారు. రాత్రుల్లో భవానీ ద్వీపం వద్ద బోట్లు నిలిపేలా అక్కడో జెట్టీ,విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు.బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో నాగరాజు కెనాల్ నుంచి నిజాంపట్నం వరకు మూడు బోట్లు ప్రైవేటు సంస్థలు నడపనునానయి. ఒక బోటులో 9,మరో బోటులో 3,ఇంకో బోటులో 2 పడక గదులు ఉంటాయి. బ్యాక్ వాటర్‌లో దాదాపు 30 కిలోమీటర్ల మేర బోటులో ప్రయాణించవచ్చు. మార్గమధ్యంలో సుందరమైన ప్రాంతాలను కూడా గుర్తించారు.విశాఖ తీరంలో రాజమహేంద్రవరం,కాకినాడలో గోదావరి నదిలో, నాగార్జునసాగర్‌లోనూ అల్ట్రా డీలక్స్ బోట్లు ప్రైవేటు ఆపరేటర్లతో నడిపేలా పర్యాటకాభి వృద్ధి సంస్థ ఫీజబులిటీ సర్వేచేస్తోంది. ఈ ప్రక్రి య పూర్తయ్యాకఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

## ఒంగోలులో జరిగిన ఎబివిపి రాష్ట్ర మహాసభకు హాజరు




**ఒంగోలు, ప్రభాతవార్త:** ఒంగోలు పట్టణంలో జరుగుతున్న అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 3వ రోజు శ్రీజనమంచి గౌరిజీ యువపురస్కారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు విచ్చే శారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నూజిళ్ళ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర కార్యదర్శి శ్రీ యాగంటి గోపి, పురస్కార గ్రహీత మదనపల్లికి చెందిన వెల్ విషర్ స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ గిరీష్ నల్లగుట్ట, రాష్ట్ర మహా సభల స్వాగత సమితి అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు. నూజిళ్ళ శ్రీనివాస్ జనమంచి గౌరీ శంకర్ స్ఫూర్తిదాయక జీవితం గురించి ప్రస్తావన చేశారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా పురస్కారం అందజేయబడింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ కంభంపాటి హరిబాబు ఏబీవీపీ కార్యకర్తలను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. గౌరిజీ జీవితం నుండి సేవ చేసే లక్షణాన్ని అలవర్చుకోవాలి అన్నారు. గౌరీజీ పేరు మీద సేవా సంస్థల నిర్వాహకులకు అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. యువతకు దిశానిర్ధేశం చేస్తూ డిగ్రీలతో పాటు నైపుణ్యాలు అలవర్చుకోవాలి అన్నారు. నూతన విద్యా విధానం అమలు సమాజంలో మంచి ప్రయోజనాలు అందిస్తుందన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు మెరుగు పరచడంలో దేశ సమైక్యతను బలోపేతం చేయడంలో ఏబీవీపీ ప్రారంభించిన సీల్ ప్రాజెక్ట్ కీలక పాత్ర వహించింది అన్నారు. విద్యార్థులు ఇక్కడ పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి పథంలో నడుస్తూ ప్రపంచ వ్యాప్తంగా విశ్వ గురు స్థానంలో ఉన్న భారతదేశంలో నేడు యువత అధికశాతం ఉండటం ప్రయోజనకరమని అయితే నేడు ప్రధాన సమస్యగా మారిన డ్రగ్స్ వినియోగంపై యువత విద్యార్థులు పోరాడాలని అన్నారు. ఇందుకు సంబంధించి మంచి కార్యక్రమాలని రూపొందించి విద్యార్థులలో యువతలో డ్రగ్స్ పట్ల వ్యతిరేకతకు అవగాహన కలిగించాలని ఏబీవీపీ కార్యకర్తలను మార్గదర్శనం చేశారు. తిరుపతికి చెందిన డాక్టర్ లక్ష్మీ నారాయణ సంచాలకత్వంలో సాగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఏబీవీపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి రావులపల్లి నాగేంద్ర యాదవ్ పాల్గొన్నారు. కంభంపాటి హరిబాబుతో పూర్వ పరిచయం ఉన్న అనేక మంది మిత్రులు, కార్యకర్తలు వారిని కలిసి జ్ఞాపకాలు పంచుకొన్నారు.

# ఎపి కాంగ్రెస్ చీఫ్ షర్మిలకు జగన్ థాంక్స్



**విజయవాడ,డిసెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల కూడా తన సోదరుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ట్వీట్ చేశారు. షర్మిల ట్వీట్ కు జగన్ స్పందించారు. థాంక్యూ షర్మిలమ్మ అంటూ రిప్లయ్ ఇచ్చారు. జగన్ స్పందనతో వైసీపీ అభిమానులు ఆనం దంతో పొంగిపోతున్నారు. గత కొంతకాలంగా జగన్, షర్మిల మధ్య విభేదాలు తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ పుట్టినరోజు సందర్భంగా షర్మిల శుభాకాంక్షలు తెలపడం, జగన్ కూడా షర్మిలమ్మ అంటూ స్పందించడం అభిమానులను ఆనందానికి గురిచేసింది.

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.


న-జార్జి ఎలియట్

# సాంస్కృతిక స్పృహలేని భాషాసేవలేల!

**ఇప్పటికైనా మన విధి విధాన నిర్ణేతలు, తెలుగు భాషాభిమానులు, ముఖ్యంగా తెలుగు సంస్థ వార్థ మేల్కొనాలి. నిధుల గురించి సాకులు చెప్పడం మాని, ఉన్న వనరులతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలి. తమిళులు ఢిల్లీలో చేసిన సాహిత్య యాత్రను ఒక ప్రేరణగా తీసుకోవాలి.మన కవుల రచనలను ప్రపంచ వేదికపై నిలబెట్టాలి. అంతర్జాతీయ యవనికపై తెలుగు జెండా ఎగరడం అంటే కేవలం నాయకుల ప్రసంగాల్లో కాదు పారిస్ లైబ్రరీలోనో, లండన్ బుక్ స్టోర్లోనో మనప్రాచీన తెలుగు రచనల అనువాదం కనిపించినప్పుడు, జర్మన్ విద్యార్థి మన పోతనను చదివి తల ఊపినప్పుడు అప్పుడు నిజమైన తెలుగు వెలుగు ప్రసరించినట్లు. ఆ రోజు త్వరలోనే రావాలని ఆశిద్దాం.**

వెంకట రామయ్య గంపా

సాధారణంగా ప్రాంతీయ భాషా సదస్సులు ఆయా రాష్ట్రాలకే పరిమితం కావడం మనం చూస్తుంటాం. కానీ, తమిళసాహిత్య సదస్సుకు తన కార్యక్షేత్రంగా ఢిల్లీని ఎంచుకోవడం వెనుక ఒక బలమైన సాంస్కృతిక స్పృహ ఉంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని భారతీయ భాషలు సాహిత్య అధ్యయన శాఖలో జరిగిన ఈ మేధోమథనం, వివిధ భాషల విద్యావేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ద్వారా, తమిళ సాహిత్యం కేవలం తమిళుల సొత్తు మాత్రమే కాదు, అది భారతీయ విజ్ఞాన సర్వస్వంలో భాగమని నిరూపించింది. ఇది ఇతర భాషా సంస్థలకు ఒక మేలుకొలుపు. తెలుగు భాషకు వెయ్యేళ్ల లిఖిత చరిత్ర ఉంది, రెండు వేల ఏళ్ల మౌఖిక చరిత్ర ఉంది. రాజ రాజనరేంద్రుడి ఆస్థానం నుండి, శ్రీకృష్ణదేవరాయల భువన విజయం వరకు మన సాహితీ వైభవం దేదీప్యమానం అని, మన భాష గొప్పదని మనలో మనం చెప్పుకోవడం వేరు, అది ఇతరుల చేత, ముఖ్యంగా భిన్న సంస్కృతుల వారి చేత గుర్తింపు పొందేలా చేయడం వేరు. ఈ విషయంలో తమిళులు చూపిన చొరవ అభినందనీయం. భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి అస్తిత్వ పతాకం. కానీ ఆ పతాకాన్ని మనం ఎగరేస్తున్నామా? ఢిల్లీలో జరిగిన తమిళ సాహిత్య సదస్సును గమనించినప్పుడు,మన తెలుగు వారి స్తబ్దత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ అంతరాన్ని అర్థంచేసుకోవడానికి ఒక చిన్న పరిశీలన అవసరం. ఒక జాతి మనుగడ కేవలం దాని భౌగోళిక సరిహద్దుల మీదో, ఆర్థిక వనరుల మీదో ఆధారపడి ఉండదు. ఆ జాతి తన భాషను, సంస్కృతిని, విజ్ఞానాన్ని ఇతరులకు ఎంత సమర్థవంతంగా పంచగలుగుతుందనే అంశంపైనే దాని అంతర్జాతీయ గుర్తింపు ఆధారపడి ఉంటుంది. దీనినే ఆధునిక పరిభాషలో సాఫ్ట్ పవర్ అంటారు. డిసెంబరు 4, 5, 6, 2025న దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక కార్యశాల, తెలుగు భాషకు ఒక పాఠంగా మారుతుందనిపించింది. చెన్నైకి చెందిన సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్, ప్రతిష్టాత్మక ఢిల్లీ విశ్వవిద్యాలయపు భారతీయ భాషలు, సాహిత్య అధ్యయన శాఖ సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ కార్యశాల, కేవలం ఒకసాహిత్య సమావేశం మాత్రమే కాదు, అది తమిళ భాష తన ప్రాచీనతను ఆధునిక ప్రపంచానికి చాటిచెప్పిన ఒక వ్యూహాత్మక సాంస్కృతిక విజయం. 12వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత కవయిత్రి అవ్వైయార్ రచించిన ఆత్తిచూడి అనే నీతినిధుల సంకలనాన్ని ఎంచుకోవడం వెనుక గొప్ప దూరదృష్టి కనిపిస్తుంది. ఇది వేల పద్యాలున్న బృహద్గ్రంథం కాదు, కేవలం 109 చిన్నచిన్న నీతి వాక్యాల సమాహారం. ఈ చిన్న పుస్తకాన్ని ఒకేసారి వివిధ భాషల్లోకి అనువదించే బృహత్తర బాధ్యతను తలకెత్తుకుంది. ఇందులో భారత రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషలు, అనేక గిరిజన, మైనారిటీ భాషలు ఉండటం గమనార్హం. కేవలం మూడు రోజుల్లో, 109 వాక్యాలను 60 భాషల్లోకి అనువదించడం, సరిచూడటం, ప్రచురణకు సిద్ధం చేయడం అనేది సాధారణ విషయం కాదు. దీనికి అకడమిక్ డిసిప్లిన్, పకడ్బందీ ప్రణాళిక అవసరం. ఒక పదం మూలార్థం చెడిపోకుండా, లక్ష్య భాషలోని సాంస్కృతిక నేపథ్యానికి అన్వయించేలా అనువాదం సాగాలి. అక్కడ జరిగిన చర్చలు, నిపుణుల సూచనలు, సలహాలు ఈ అనువాద సమస్యల పరిష్కార దిశగా సాగాయి. ఈ 60 పుస్తకాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలకు, విశ్వవిద్యాలయాలకు వెళ్తాయి. మనం కేవలం ఈ ఒక్క సంఘటనను చూసి ఆశ్చర్యపోతే సరిపోదు. దీనివెనుక ఉన్న వ్యవస్థాగత నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ వెబ్‌సైట్‌ను కానీ, వారి నివేదికలను కానీ పరిశీలిస్తే కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి




వస్తాయి.వారి జాలగూడు (వెబ్‌సైట్)లో వారిసంస్థ సమాచారం మొత్తం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కేవలం జీతభత్యాలకో,భవనానికో పరిమితం చేయకుండా, ఇటువంటి సృజనాత్మక ప్రాజెక్టుల వైపుకు మళ్ళించడం వారి విజయ రహస్యం. తిరుక్కురల్‌ను ఇప్పటికే ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధానభాషల్లోకి అనువదించారు. ఇప్పుడు ఆత్తిచూడి వంతు.వారు కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలలో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడంలో విజయంసాధించారు. ఇక్కడే మనసును కలిచి వేసే ప్రశ్న ఉదయిస్తుంది. తమిళ సోదరులు ఢిల్లీ నడిబొడ్డున తమ భాషా వైభవాన్ని చాటు తుంటే, మన తెలుగుభాష పరిస్థితి ఏమిటి? మనకు కూడా 2008లోనే ప్రాచీన భాష హోదా లభించింది.మనకు కూడా ఒక క్లాసికల్ తెలుగుసంస్థ ఉంది. కానీ, జాతీయ స్థాయిలో దాని ప్రభావం ఎంత? మన తెలుగు సంస్థ నిర్వహించే కార్యక్రమాలు ఎలా ఉంటాయంటే చూడటానికి బాగున్న ఒక మంచి సమావేశ మందిరం, కొంతమంది ఆస్థాన పండితులు. ఈ పండితుల జాబితా ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. (మ్యూజికల్ చైర్స్ ఆటలాగా, వాళ్ళే తిప్పి తిప్పి కూర్చుంటారు). సదస్సు అంశాలు, కవి సమ్మేళనం, సాహిత్యం సమాలోచన,సాహిత్యం సమాజం, తెలుగు భాష ఇలా ఏమాత్రం కొత్తదనం లేని అంశాలు, ఎత్తిపోతల పథకాలను ఎంచుకుంటారు.ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీబిస్కెట్లు.

మధ్యలో ఒకరినొకరు మీరు మహాకవి అంటే కాదు, మీరే యుగకర్త అని పొగుడుకుంటూ, శాలువాలు కప్పుకుంటూ, ఫోటోలు దిగడంతో సభ ముగుస్తుంది. మరుసటి రోజు పత్రికలో ఒక చిన్న వార్త ఘనంగా తెలుగు సదస్సు అంతే! ఆ సదస్సు వల్ల భాషకు, సాహిత్యానికి, లేదా సమాజానికి ఒరిగిన ప్రయోజనం ఏమిటంటే?సమాధానం శూన్యం.తమిళులు వారి ప్రాచీన సాహిత్యాన్ని వివిధ భాషల్లోకి అనువదించి అంతర్జాతీయ పాఠకులకు అందిస్తుంటే, మనవాళ్ళు వచ్చే నెల ఏ అంశం మీద సమావేశం పెడదాం?అని చర్చిస్తుంటారు.తమిళ సెంటర్ పనితీరు రాకెట్ వేగంతో ఉంటే, మనం ఎక్కడున్నామో బయటి ప్రపంచానికి తెలీదు. వారు పుస్తకాలను ప్రచురిస్తుంటే, మనం కాలయాపన చేస్తున్నాం. వారు ప్రపంచానికి చెబుతుంటే, మనం గోడలకు చెప్పుకుంటున్నాం. నిజంగా చెప్పాలంటే, మన సంస్థరహస్య గూఢచారి సంస్థలా పనిచేస్తోంది. అంతర్జాలంలో వారి సమాచారం ఏమీఉండదు. వారు ఏంచేస్తున్నారో ఎవరికీ తెలియదు. బహుశా అదే వారి వ్యూహం ఏమో! ఇది ఎవరినీ నిందించడానికి చేస్తున్న విమర్శ కాదు ఇది ఒక వ్యవస్థాగత వైఫల్యంపై చేస్తున్న ఆవేదన. ఇటీవల కాలంలో తెలుగుకేంద్రం నుండి జాతీయ స్థాయిని ఆకర్షించే నూతన ఆలోచన ఉన్న ఒక్క సదస్సు అయినా జరిగిందా?వేమన పద్యాలు,సుమతీ శతకం, లేదా భర్తృహరి సుభాషితాల తెలుగు అనువాదాలు ఆత్తిచూడి కంటే ఏమాత్రం తక్కువకావు. మన ప్రాచీన రచనల్లోని అంశాలు ప్రపంచ స్థాయికి చెందినవి. కానీ, వాటిని వివిధ భాషల్లోకి అనువదించాలనే ఆలోచన మనకెందుకు రాలేదు? మన దగ్గర నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు ఉన్నారు. వారి సాహిత్యాన్నిఇంగ్లీష్‌లోకి లేదా హిందీలోకి అనువదించి,పెంగ్విన్ క్లాసిక్స్ లేదా అంతర్జాతీయ స్థాయి క్లాసిక్స్ వంటి వాటితో కలిసి ప్రచురించే ప్రయత్నం జరిగిందా? కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని తరచుగా వింటుంటాం. కానీ ఉన్ననిధులతో, అందుబాటులోఉన్న సాంకేతికతతో చిన్నచిన్న ప్రాజెక్టులనైనా ఎందుకు చేపట్టలేకపోతున్నాం? ఒకవేళ అటువంటి ప్రాజెక్టులు చేసివుంటే కనీసం జాలగూడులో ఎందుకు లభించడంలేదు? కనీసం జాలగూడును కూడా సరిగా నిర్వహించలేని స్థితిలో ఒక సంస్థఉండడం చాలా బాధాకరం.ఇప్పటికైనా మన విధి విధాన నిర్ణేతలు, తెలుగు భాషాభిమానులు, ముఖ్యంగా తెలుగు సంస్థ వార్థ మేల్కొనాలి. నిధుల గురించి సాకులు చెప్పడం మాని, ఉన్న వనరులతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగాలి. తమిళులు ఢిల్లీలో చేసిన సాహిత్య యాత్రను ఒక ప్రేరణగా తీసుకోవాలి.మన కవుల రచనలను ప్రపంచ వేదికపై నిలబెట్టాలి. అంతర్జాతీయ యవనికపై తెలుగు జెండా ఎగరడం అంటే కేవలం నాయకుల ప్రసంగాల్లో కాదు పారిస్ లైబ్రరీలోనో, లండన్ బుక్ స్టోర్లోనో మనప్రాచీన తెలుగు రచనల అనువాదం కనిపించినప్పుడు, జర్మన్ విద్యార్థి మన పోతనను చదివి తల ఊపినప్పుడు అప్పుడు నిజమైన తెలుగు వెలుగు ప్రసరించినట్లు. ఆ రోజు త్వరలోనే రావాలని ఆశిద్దాం. •


## ఆరని 'రావణ కాష్టం'

బంగ్లాదేశ్ రగడ రావణ కాష్టంలా రగులుకుంటోంది. 1971 నాటి బంగ్లా విమోచన ఉద్యమంలో పాల్గొన్న వారి వారసులకు ఉద్యోగాల్లో అధిక రిజర్వేషన్లు ఇవ్వడాన్ని అక్కడ విద్యార్థి లోకం తప్పు పట్టింది. రిజర్వేషన్ల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి బదులు తమకు ఉద్యోగాలు రాకుండా ఇలాంటి కార్యాచరణ చేపట్టడాన్ని నిరుద్యోగ యువకులకు రుచించలేదు. దాంతో వారంతా ఆనాడే తిరుగుబాటు చేశారు. ఆ ఉద్యమంతో బంగ్లా ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి జరిగింది. ఆపైన భారత్‌లో ఆమె తలదాచుకోవడంతో తాత్కాలిక ప్రభుత్వ పాలన నోబెల్ గ్రహీత యూనస్ చేతిలోకి వెళ్లింది. ఆ తర్వాత అక్కడి పాలన షేక్ హసీనాకు పూర్తి వ్యతిరేకంగా మారింది. అనేక సందర్భాలను వెలికి తీసి ఆమెను అభిశంసించడమే కాకుండా, ఆమె అనుయాయులకు నిద్ర పట్టకుండా చేసింది. కాగా వచ్చే ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలు నిర్వహించింది. గత ఆగస్టులో విద్యార్థుల ఉద్యమానికి నేతృత్వం వహించిన ఇంక్విలాబ్ మంచ్ నేత ఉస్మాన్ షరీఫ్ హాదీ ఢాకా 8 నియోజక వర్గం నుంచి పోటీ చేయదలచి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతుండగా ఓ ముసుగు మనిషి అతడిని కాల్చాడు. తీవ్ర గాయమై ఆనక సింగపూర్ ఆస్పత్రిలో మరణించాడు. షేక్ హసీనాకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పించడం నచ్చని హాదీ ఆది నుంచీ భారత్‌పై వ్యతిరేక వైఖరితో ఉండేవాడు. కాగా అతను మృతి చెందాడన్న సమాచారంతో ఢాకాలోను, పలు జిల్లాల్లోను హింసాత్మక ఘటనలు జరిగాయి. భారత రాయబార కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. బంగ్లాదేశ్‌లో పనిలో పనిగా మత విద్వేషాలు కూడా తలెత్తాయి. తాజా దుశ్చర్య భారత్ బంగ్లాదేశ్ మధ్య సత్సంబంధాలను బెడిసికొట్టే పరిస్థితి ఎదురయ్యింది. ఓ అమాయక హిందువుని కొన్ని ఉగ్రవాద ముష్కర మూకలు అతి కిరాతకంగా చంపేశాయి. ఈ ఘటనకు సాకుగా చూపిన అతను ఇస్లాం మత దూషణ చేశాడన్న ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని ఇన్వెస్టిగేషన్ అధికారులే చెప్పినా దాడులు దారి తప్పాయి. ముందుగా అతన్ని చెట్టుకు కట్టి ఉరి తీసి చంపేశారు. డిసెంబరు 18న మెయిమెన్ సింగ్ ప్రాంతంలోని దీపు చంద్ర దాస్ అనే అతను ఇస్లాం మతాన్ని అవమానించాడంటూ అతడి సహోద్యోగి ఉద్యోగరీత్యా ఉన్న దుగ్ధ కొద్దీ నేరాన్ని ఆరోపించాడు. జరగకూడనిది జరిగిపోయింది.ఫ్యాక్టరీలో గొడవ జరుగుతున్న సమయంలోనే దీపును బయటికి పంపడం వల్లే అతనిని వాళ్లు చంపగలిగారు. తదనంతర పరిణామాల్లో దీపూ నిర్దోషిత్వంపై వివరాలు సేకరించి వెల్లడించిన ప్రముఖ పత్రిక 'డైలీ స్టార్'పై ఆందోళన కారులు మళ్లీ ఆగ్రహించారు. ఆ పత్రిక భవనాలను, యంత్రాలను విధ్వంసం చేసారు. అసలీ నిజాలను పాట్ 14 కంపెనీ కమాండర్ మహమ్మద్ సంసుజమాన్ వెల్లడించగా సదరు వివరాలను ఆ పత్రికలో ఇచ్చారు. పత్రికల ధర్మం. అయినప్పటికీ ఉద్రిక్త వాతావరణంలో ఈ విషయాలను అర్థం చేసుకోలేక ఆందోళన కారులు దాష్టీకానికి ఒడికట్టారు. దీపూ హత్య జాతీయంగా, అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇలా ఓ అమాయక హిందువుని తప్పుడు ఆరోపణలతో చంపేయడాన్ని ఉత్తర హిందూ ఉత్తర అమెరికా హిందూ కూటమి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ క్రమేపి ఆటవిక పాలన వైపుగా మరలుతోందని హిందువులపై ఇంతటి దాడులు జరుగుతున్నా అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాలు మౌనంగా ఉండటానికి జీర్ణించుకోలేకపోతున్నామని వ్యాఖ్యానించింది. ఇది ఇలా ఉంటే బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం భారతదేశానికి ముప్పుగా పరిణమిస్తుందని మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ బజార్ హెచ్చరిస్తున్నారు. దేశంలో చాలా ఉగ్రవాదుల శిక్షణా శిబిరాలు ఉన్నాయని వెల్లడించారు. బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించినట్లు తేదీ విడుదలయ్యాక బంగ్లాలో ఇరు వర్గాల దాడులు మళ్లీ ఊపు అందుకున్నాయి. హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని మీడియా స్పష్టంచేస్తోంది. వాస్తవాలు వెలుగులోకి తెచ్చారన్న కారణంగా వివిధ పత్రికా సంస్థలపై దాడులు చేసి పత్రికా స్వాతంత్ర్యానికి మచ్చ తెచ్చారు. ఇలా పత్రికా సంస్థలపై దాడులు చేయడం దురదృష్టకరం. ఉన్నది తాత్కాలిక ప్రభుత్వమైనా బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమవడమే కాదు. కొత్తగా మత విద్వేషాలను కూడా అదుపుచేయలేకపోతోంది. హాదీ మృతి విషయాన్ని తాత్కాలిక ప్రభుత్వ అధినేత మొహమ్మద్ యూనస్ స్వయంగా టీవీలో ప్రకటించారు. ఆ వెంటనే జనం అల్లర్లకు దిగారు. అలాంటి ఉద్వేగాలున్నప్పుడు ఆయనలా చేయకుండా ఉండాల్సింది. ఆయన సంయమనం పాటించి ఆ విషయాన్ని కొంచెం సర్దుకున్నాక చెప్పి ఉంటే ఇంత తీవ్ర స్థాయిలో అలజడులు జరిగే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఆయన అలా ఆ దిశగా ఆలోచించ లేకపోయారు. జనం జీర్ణించుకోలేని అంశాలను అదిమిపెట్టి ఉంచితేనే మేలు. ఇప్పటికైనా యూనస్ ప్రభుత్వం భారతీయుల భద్రత రీత్యా గట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సంయమనం పాటించే కృషిచేయాలి. హాదీ హంతకులు భారత్‌కు వెళ్లిపోయారన్న అపోహ కూడా ఉంది. ఇలాంటి పరిస్థితిలో పాలకుల మౌనం మంచిది కాదు. అందుకే భారతీయుల కోసం భారత దౌత్య అధికారులు ప్రత్యేక అడ్వైజరీ ఇవ్వాల్సి వచ్చింది. అటు వైపు నుంచి కూడా బంగ్లా పాలకులు అప్రమత్తమవడం అత్యంత ఆవశ్యకం. ఉభయ దేశాల మధ్య అపోహలు, అనుచిత ప్రవర్తనల పర్యవసానాలు ఉండడం శ్రేయస్కరం కాదు.



కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికీ వాయిదా వేయకూడదు.

ఇ. గిబ్బన్



దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.

హెచ్. లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు



### రాష్ట్రాలకు గుదిబండ

**ఉపాధి** హామీకి కొత్తబిల్లుతో ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం ఏముంది. ఒకటి పని కల్పన అనేది డిమాండ్ బేస్ కాకుండాప్రభుత్వఇష్టాలమీద ఆధారపడిపోతుంది. అసలు ఈ ఉపాధి హామీ పాత చట్టంలో ఉన్న విశిష్టత ఏమిటి జెండర్ తేడాలు లేకుండా అందరికీ సమాన వేతనం అనే భావం ఒకటి ఉండేది. అయితే ఇప్పుడది ఉండకపోవచ్చు. మూడు ఈ దేశంలో దళితులు ఆదివాసులకు ఈ బిల్ ఆక్సిజన్ లాంటిది, ఇప్పుడు అది మాయం అవుతుంది, ఇప్పటికే వివిధ రకాల సాంకేతిక నిబంధనలతో చాలా మందినిఉపాధిహామీకి దూరంచేశారు.ఇప్పుడు60 రోజుల హాలిడే పేరుతో మరికొంత మంది దూరం అవుతారు. అసలు ఈబిల్‌లో రాష్ట్రాలకు స్వేచ్ఛ లేకపోగా గుది బండ అనిరాష్ట్రాలు అనుకునేట్టు చేయడంలోకేంద్రం ఏ మాత్రం ఆలోచన లేకుండా చేసింది అనడంలో సందేహం లేదు.

- యార కొమురయ్య, ఆక్కపల్లిగూడెం

### అహంకారం కూడదు

విద్యవల్లవినయం అబ్బుతుందనిఅంటారు.అయితే విద్యావంతులు అందరిలోనూ ఈవినయం ఉన్నట్లు అనిపించదు. వారు మాట్లాడే భాష, కోపంతో వారి నోట నుంచి వచ్చేఅసభ్యకరమైన తిట్లువింటుంటే వీరు నిజంగా అంతా పెద్ద చదువు చదివారా అదీ విదేశాల్లో అనే అనుమానం కలుగుతుంది. తాము అనుకున్నది జరగనప్పుడు తాము కోరుకున్నది అందుకోలేనప్పుడు అందుకు కారణమైన వారిపై ద్వేషంపెంచుకుంటారు.భీష్ముడు అన్నివిద్యల్లోనూ ఆరితేరినవారు. ఎంతటి వారినైనా ఓడించగల మహా బలవంతుడు అయినప్పటికీ అహంకారాన్ని ప్రదర్శించలేదు.

- మిధునం, హైదరాబాద్

### వందేభారత్‌లో స్లీపర్ క్లాస్

**భారతీయ** రైల్వేశాఖ కొత్తగా రెండుస్లీపర్‌క్లాస్‌తో వందే భారత్‌రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీతగాళ్లుకూడా భరించే అవకాశంలేదు. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితోఉన్న వందేభారత్ రైలు టికెట్‌ఛార్జీ, ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరంగమ్యం చేరే సదుపాయం కలుగుతుంది.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

### అధికార పార్టీ గెలుపు

**ఎన్నికలు** జరిగే సమయానికి తీవ్రవ్యతిరేకతతో గడ్డు పరిస్థితులను ఎదుర్కొని కూడా మహారాష్ట్రలో బిజెపి సారథ్యంలోని మహాయుతి కూటమిఅంతటి ఘనవిజయాన్ని ఎలా సాధించగలిగింది. అలాగే పాలన బాగాలేక తీవ్ర అసంతృప్తితో ఉన్న బీహార్ ప్రజలు కప్పుదాట్ల సతీష్‌కుమార్ పార్టీకి రికార్డుస్థాయిలో సీట్లను ఎలా కట్టబెట్టారు. ఇవేకాక మరికొన్ని రాష్ట్రాలలో కూడా ఇలానే జరిగింది. ఫలితాలు అనుమానించేలా వెలుపడ్డాయి. నిజమే రాజు తలచుకుంటే దెబ్బలకి కొదవ ఉండదు. ఇసి బిజెపి ఏకమయితే ప్రత్యర్థి పార్టీలకు గెలుపు అనేది ఉండదు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### నిధులు పెంచాలి

**ఉపాధి** పైన తీవ్రగందరగోళం నెలకొన్న పరిస్థితి కనబడుతుంది. ఒకవేళ ప్రభుత్వం చెపుతున్నట్టుగా ఆస్తుల సృష్టి కి తగ్గట్టు ఖర్చు ఎక్కువ అవుతుంది అనుకుందాం. అప్పుడు నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీలు ఏమి చేస్తున్నట్టు అసలు చిక్కు ఏమిటి. కేంద్రం తమ బాధ్యతల నుండి తప్పుకోవడమే కదా రాష్ట్రాల ఆదాయాలను లెక్కలోకి తీసుకొనే కొత్త బిల్ తీసుకోస్తాం అని మొత్తుకుంటున్నా అది ఎంత వరకు నిజం అనేది అసలుప్రశ్న.రాష్ట్రాలకు తమ అవసరాలకు తగ్గట్టుపనులు చేసుకునే స్వేచ్ఛ ఇస్తారా లేక ఆర్థిక భారం మాత్రమే మోపుతారా అనేది కూడా అసలు ప్రశ్నే. ఉపాధి హామీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి లేక రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అన్నింటికంటే ముఖ్యంగా బడ్జెట్ పెంచాలి. కేంద్రం ప్రవచిస్తున్న వికసిత భారతం సాకారం కావాలంటే గ్రామీణ స్వరాజ్యం రావాలి అంటే బడ్జెట్ పెంచాలి.

- భారత అవినాష్, జనగామ

### పెండింగ్ దరఖాస్తులు?

ప్రభుత్వ కార్యాలయంలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కారంచేయాలి. రెవిన్యూ, పోలీస్, మానవహక్కుల కమిషన్,కలెక్టర్ ఆఫీస్, విద్యాశాఖలో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.శారీరక వికలాంగులకు, ఎస్సి, ఎస్టీ, వర్గాలకు చెందిన దరఖాస్తులు ఆయా శాఖ మండల, జిలా, రాష్ట్రస్థాయి అధికారులుప్రత్యేకంగా కృషి చేయాలి. 1 జనవరి 2026 నూతన సంవత్సర కానుకగా ప్రతి ఆఫీస్‌లో గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## బీమా రంగంలో శత శాతం ప్రైవేటీకరణ సురక్షితమా?

తిప్పర్తి శ్రీనివాస్

బీమా రంగం ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన రంగం. ప్రజల జీవితాల్లో అనిశ్చితి ఎదురైనప్పుడు భద్రత కల్పించే ప్రధాన సాధనం బీమానే. ప్రమాదాలు, అనారోగ్యం, మరభయం, ప్రకృతి విపత్తులు వంటి సందర్భాల్లో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస బీమా వ్యవస్థ సామాజిక భద్రతకు పునాదిగా నిలుస్తుంది. అలాంటి ప్రాధాన్యత కలిగిన బీమా రంగంలో శతశాతం ప్రైవేటీకరణ సురక్షితమా అనేప్రశ్న ఈరోజుల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి, సామాన్య ప్రజల భవిష్యత్తుకు మేలు చేస్తుందా లేక ప్రమాదాలను పెంచుతుందా అనే అంశాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.బీమా రంగం కేవలం లాభనష్టాల గణాంకాలతో కొలిచే రంగం కాదు. రైతులు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు వంటి విభిన్న వర్గాల ప్రజల జీవితాలతో ఇది ముడిపడి ఉంటుంది. భారతదేశంలో ప్రభుత్వ రంగ బీమా సంస్థలు,ముఖ్యంగా భారతీయ జీవిత బీమాసంస్థ, గ్రామీణ ప్రాంతాలుఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా బీమా సేవలు అందిస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించాయి.బీమా లాభదాయకంగా లేని ప్రాంతాల్లో కూడా సేవలు అందించడమే ప్రభుత్వ రంగ ప్రత్యేకత. ఇలాంటి వ్యవస్థలో శత శాతం ప్రైవేటీకరణ జరిగితే సామాజిక బాధ్యత కంటే లాభాలే ప్రాధాన్యం పొందే ప్రమాదం ఉంది.ప్రభుత్వం ప్రైవేటీకరణకు అనుకూలంగా విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని, పోటీవల్ల సేవల నాణ్యత మెరుగవుతుందని, కొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తుందని వాదిస్తోంది. కొంత వరకు ఇవి నిజమే. ప్రైవేట్ రంగ ప్రవేశంతో డిజిటల్ బీమా సేవలు, కొత్త పాలసీలు వచ్చిన విషయం వాస్తవం. అయితే శతశాతం ప్రైవేటీకరణలో ఈ ప్రయోజనాలతోపాటు తీవ్రమైన ప్రమాదాలు కూడా దాగి ఉన్నాయి. ప్రైవేట్ బీమా సంస్థలు ప్రధానంగా లాభాలు వచ్చే నగరప్రాంతాలు, అధిక ఆదాయం కలిగిన వినియోగదారులపైనే దృష్టిసారించే అవకాశం ఎక్కువ. దీనివల్ల గ్రామీణ ప్రజలు, పేదలు, చిన్న రైతులు బీమా కవరేజ్‌కు దూరమయ్యే పరిస్థితిఏర్పడవచ్చు. బీమా రంగం ప్రజల పొదుపులతో నేరుగా ముడిపడి ఉంటుంది. కోట్లాది మంది పాలసీదారులు తమ జీవిత పొదుపులను బీమా సంస్థలపై నమ్మకంతో పెట్టుబడి పెడతారు. ఒకవేళ ప్రైవేట్ లేదా విదేశీ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో పడితే లేదావ్యాపార ప్రయోజనాల కోసం దేశంవిడిచిపెడితే, ఆ నష్టాన్ని భరించాల్సింది చివరకు ప్రజలే. అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదుడుకులు దేశీయ బీమా రంగంపై ప్రభావం చూపితే ఆర్థిక అస్థిరత పెరిగేప్రమాదం కూడా ఉంది. ప్రైవేటీకరణవల్ల ఉద్యోగ భద్రతపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ బీమాసంస్థల్లో ఉద్యోగులకు స్థిరత్వం, సామాజిక భద్రత,కార్మికహక్కులుంటాయి. ప్రైవేట్‌రంగంలో మాత్రం లాభాల ఆధారంగా ఉద్యోగ నియామకాలు, తొలగింపులు జరుగుతాయి. దీనివల్ల వేలాది ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలోపడే అవకాశంఉంది. ఉద్యోగ భద్రత లేకపోతే సేవల నాణ్యతపై కూడా ప్రభావం పడుతుందన్న వాస్తవాన్ని విస్మరించలేం.బీమారంగంలో ప్రభుత్వ రంగసంస్థల పాత్రను విస్మరించడం సాధ్యంకాదు.భారతీయ జీవిత బీమాసంస్థ దేశంలోనిమౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు,సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి ఆర్థిక మద్దతు వంటిఅనేక సందర్భాల్లో కీలకంగా నిలిచింది.లాభాల కోసమే కాకుండా దేశప్రయో జనాల కోసం పనిచేసే ఇలాంటిసంస్థలు బలహీనపడితే దేశ ఆర్థికవ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావంపడే అవకాశంఉంది.బీమారంగాన్నినియంత్రించే సంస్థలు ఉన్నప్పటికీ, శతశాతం ప్రైవేటీకరణతర్వాత నియంత్రణ సవాళ్లు మరింత పెరుగుతాయి. పెద్ద కార్పొరేట్ సంస్థలు,విదేశీ పెట్టుబడి దారుల ప్రభావం వల్ల నియంత్రణ వ్యవస్థ బలహీనపడితే వినియోగదారుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉంది. నియమాలు సడలితే పాలసీదారుల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రభుత్వ రంగం కేంద్రపాత్రలో ఉండి, ప్రైవేట్ రంగం సహాయక పాత్ర పోషిస్తేనే సామాజిక భద్రతతో పాటు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది. •

## గ్రామపాలకులు కొలువుదీరినట్లే!

డా.పోలం సైదులు

రాష్ట్రంలో కాస్త ఆలస్యమైనా ఎట్టకేలకు ఎన్నికల కమీషన్ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించింది. దాదాపు డిసెంబర్ మాసమంతా ఎన్నికల హడావుడితో గ్రామాలలోని నాయకులు నిద్రలేనిరాత్రులు గడుపుతూ ఓటర్లను ఆకర్షించడానికి విశ్వప్రయత్నాలు చేస్తూ,ధన ప్రవాహంతో మద్యాన్నీ ఏరులా పారించి, అభ్యర్థులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ ప్రచార పర్వాన్నీ ముగించుకోని, మూడు విడుతలుగా డిసెంబర్ 11,14,17న ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రమంతటా 12778 గ్రామాలకు 11497 గ్రామాలలో ఎన్నికలు జరిపి,వివిధ కారణాలవల్ల 26 గ్రామాలను మినహాయించిన, 1205 గ్రామాలు ఏకగ్రీవంతో ఎన్నికైనవారిని కలుపుకొని 12702 గ్రామపంచాయతీలకు ప్రథమపౌరుడి నియామకాలు జరిగిపోయాయి. ఈనెల 22న అధికారికంగా ప్రమాణస్వీకారాలు చేసి గ్రామ పాలకులుగా కొలువుదీరనున్నారు. పోటీలో ఎంతమంది అభ్యర్థులున్నప్పటికి చివరికి గెలుపొందేది మాత్రం ఒక్కరే. కావున కొలువుతీరాక కక్ష్యగట్టే ధోరణితో,స్వార్థపూరిత ఆలోచనలతో ఖర్చుపెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవాలో నని, తమకు మద్దతివ్వని వారిపై ఏ విధంగా కక్ష్యపూరిత చర్యలు చేపట్టాలనో గాకుండా అవినీతికి పాల్పడకుండా దాదాపు ఐదు సంవత్సరాలపాటు గ్రామాభివృద్ధికై గ్రామంలోని పలువురితో చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ,ప్రతి కార్యక్రమంలో గ్రామప్రజలను భాగస్వామ్యులుగా చేస్తూ ఎలాంటి కుల,మత,వర్గ భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తూ,గ్రామంలోని ప్రతి ఒక్క విభాగానికి ఒక కమిటీని నియమిస్తూ, ప్రతి సమస్యకు స్పందిస్తూ, ఎప్పటికప్పుడు పరిష్కారమార్గం వైపు అడుగులు వేస్తే, గ్రామ ప్రజలే అతనిని శాశ్వతంగా ఉండేవిధంగా కోరుకుంటారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకంపట్ల అవగాహన ఏర్పర్చుకుంటూ,ఆ పథకాలను తమగ్రామంలోని పేదలు ఎవ్వరు ఏ పథకానికి అర్హులో వారికీ ఆ ఫలాలను అందించేందుకు కృషి చేస్తూ, గ్రామాభివృద్ధి దిశగా గ్రామాలలో గెలుపొందిన అభ్యర్థులు ప్రభుత్వం నుండి ఎలాంటి ఫలాలు వచ్చిన ముందు వారి పార్టీకార్యకర్తలకు ఎలాంటి షరతులు పెట్టకుండా అధిక ప్రాధాన్యతనిస్తూ ఇప్పించడం జరుగుతుంది. మరీ ముఖ్యంగా గ్రామాలలో ఉచిత పథకాల విషయంలో తమవర్గానికి మద్దతు ప్రకటిస్తూ వర్గపూరిత రాజకీయాలకు తెరలేపుతుంటారు.కానీ



ఇదంతా మంచి పరిణామము కాదు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే యావత్తు దేశం అభివృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతిఒక్కరు వృద్ధిలోకి వస్తనే గ్రామం సైతం అభివృద్ధి చెందుతుంది.గ్రామాభివృద్ధి అనేదీ గ్రామ ప్రథమ పౌరుడిపై ఆధారపడి ఉంటుంది. కావున గ్రామ ప్రజలందరినీ తమ పిల్లలుగా భావించి నిస్వార్థంతో,నిజాయితీతో ఎలాంటి పక్షపాత ధోరణి అవలంభించకుండా,అర్హులందరికీ ఆసరాగా వుంటూ అభివృద్ధికై పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరికొద్ది రోజులలో వేసవికాలం ప్రారంభం కాబోతున్నది. గత సంవత్సరాల నుండి కొన్ని గ్రామాలలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, ట్యాంకర్లతో నీటిని అందించడం జరిగింది.సర్పంచ్ లు సైతం ముందు జాగ్రత్తతో ప్రణాళికాయుతంగా వేసవికాలంలో మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలి. వితంతువులు, వృద్ధులు,అంగ వైకల్యం కలిగిన వారికీ ప్రతి నెల పింఛన్ వచ్చే విధంగా చూసుకుంటూ,ఏమైనా సాంకేతిక సమస్యలతో పేర్లు తొలిగించబడితే వెంటనే అధికారులదృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాల్సిన అవసరం వున్నది. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా?ప్రతి నిరుపేదకు ఉపాధిహామీ పథకంలో చోటు ఉన్నదా? రైతుబీమా, రైతు బంధు వస్తుందా? కల్యాణలక్ష్మి అందరికి అందుబాటులో ఉన్నదా? వసతి గృహాల కల్పనలో నిరుపేదలకు స్థానమున్నదా? మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా జరుగుతుందా? అంగన్వాడీ,పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయా?ప్రభుత్వం చేపట్టే పోలియో చుక్కల నిర్వహణ, వాక్సిన్‌కు తోడ్పాటు అందిస్తున్నారా? ప్రతి ఒక్కరి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఉన్నాయా? వీటన్నింటినీ చూసుకోవాల్సిన బాధ్యత వారిపై వున్నది. ప్రతి ఒక్క రైతుకు పంటలోన్లు,పంట నష్టపరిహారం అందుతున్నదో చూసుకోవాలి. వందశాతం అక్షరాస్యత, జనన, మరణ నమోదులు, పచ్చదనం, పరిశుభ్రతకు సహకరించాలి. బడులకు మరమ్మత్తులు,టాయిలెట్లు, ప్రహరీ గోడలు,అంగన్వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, పంచాయితీ భవనాలు, దేవాలయాలను, కల్యాణ మండపాలు నిర్మించాలి. చాలాగ్రామాలలోకోతులు, వీధికుక్కల బెడదలేకుండా శాశ్వత పరిష్కారమార్గాలు చేపట్టాలి. ప్రతి గ్రామపంచాయతీలో హాజరు రిజిస్టర్‌ను ఖచ్చితంగా అమలుచేయాలి. అందులో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్,ఎంపీటీసీలు, కారోబార్, పంచాయతీ కార్యదర్శి, కావలికారు ఏఎన్ఎమ్‌లు, ఆశవర్కర్, ఉపాధ్యాయులు, చౌకీదార్, విద్యుత్ హెల్పర్, వెటర్నరీ అసిస్టెంట్,గ్రామ పోలీస్ అధికారు,ఫీల్డ్ అసిస్టెంట్, సుంకరులు ఐకెపి బాధ్యులు, ఐకెపి యానిమేటర్స్, అంగన్వాడీ టీచర్, వాటర్‌మెన్, రేషన్ డీలర్, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తమసంతకాన్ని నమోదుచేసి తమబాధ్యతలు నిర్వర్తిస్తూ గ్రామాభివృద్ధికి పూనుకోవాల్సిన అవసరం ఉన్నది.అందరు కష్టించి పనిచేసి,గ్రామాభివృద్ధికి పూనుకుంటారని ఆశిద్దాం. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

### అమరావతిలోని ఏపీ సిఆర్డిఏ కార్యాలయంలో
## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

**అమరావతి, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** ప్రజారాజధాని అమరావతి రాయపూడిలోని తిశిదిళిదీతి ప్రధాన కార్యాలయంలో శనివారం అధికారులు, సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ కమిషనర్ ఏ. భార్గవతేజ ఐ.ఏ.ఎస్. గారు, ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు గారు, పీజీఎంసీ లోని పలు విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా క్రిస్మస్ కరోల్స్, కేక్ కటింగ్, క్రిస్మస్ పాటల ఆలాపన నిర్వహించిన అనంతరం అడిషనల్ కమిషనర్ గారు, ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్, ప్లానింగ్





విభాగ డైరెక్టర్ బి.సురేష్ కుమార్ గారు, డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగ డైరెక్టర్(నీతిది) వి.సునీత గారు, సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్ వెలుగోటి రాములు గారు, స్ట్రాటజీ విభాగ డైరెక్టర్ అడుసుమిల్లి ఉమ, డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయ జోషి, విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ కె.దివ్యలత, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్. రవీంద్ర ప్రసాద్, కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ ఎం.సిద్ధార్థ వర్మ, ల్యాండ్‌స్కేప్ ఎన్విరాన్‌మెంట్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ బి.జాన్ బెన్నీ, నుంచి మోహనరావు.. కార్యక్రమానికి హాజరైన అధికారులు, సిబ్బందికి క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలియజేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాలకు సంబంధించి బహుమతులు అందజేశారు.

## పెదనందిపాడు మండలంలో 98.7 శాతం పల్స్ పోలియో

పెదనందిపాడు డిసెంబర్ 21 (ప్రభాతవార్త) పెదనందిపాడు మండలంలో ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాలను ఎంపీడీవో జీ లక్ష్మీ ్మదేవి. రోటరీ జిల్లా మీడియ కోఆర్డినేటర్ పోపూరి లక్ష్మీ ్మనారాయణ. ఎంపీపీ హెప్సీబా. కూటమినాయకులు. రావి శివరామకృష్ణయ్య. దివి నాగరాజు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియంవద. డాక్టర్ నందకుమార్. సి హెచ్ ఓ. ఎస్ ఆర్ ప్రసాద్ స్వామి. ఈ చెన్నయ్య. తదితర ప్రముఖులు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మండలంలో క్షేత్రస్థాయిలో పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి రత్న శ్రీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెదనందిపాడు మండలంలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు 2202 మంది ఉండగా 21 75 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 98. 7 పూర్తి చేసినట్లు డాక్టర్ ప్రియంవద. సి హెచ్ ఓ. ఎస్ ఆర్ ప్రసాద్ స్వామి తెలిపారు.

## కంభంపాడు గ్రామంలో పల్స్ పోలియో



ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (హెచ్.డబ్లు) బూత్‌లో ఆరోగ్యశాఖ అధికారులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి శాఖ అధ్యక్షుడు కొప్పుల శౌరి తెదేపా శ్రేణులతో కలిసి 5ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

## చిన్నారుల నిండు నూరేళ్ల జీవితానికి రెండు పోలియో చుక్కలు

ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బూత్‌లో తెలుగుదేశం పార్టీ సీనియర్ లీడర్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి సతీమణి ప్రముఖ సంఘ సేవకురాలు మానవతామూర్తి గద్దె రోజారాణి తనయుడు ప్రవాసాంధ్రుడు గద్దె అజయ్‌కుమార్ రెడ్డి పాల్గొని 5ఏళ్ల లోపు పిల్లలకు



పోలియో రెండు చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా తత్పరురాలు రోజారాణి ఎన్నారై అజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల నూరేళ్ల జీవిత కోసం పరిరక్షణ కోసం రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు వైద్య రంగానికి పెద్ద పీటవేసి ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారని ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కల నిర్వాహకులకు సేవలందిస్తున్న ఎఎన్ఎం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సిబ్బందికి రోజారాణి ఎన్నారై అజయ్‌కుమార్ రెడ్డి ప్రశంసించారు.

## సంత్‌గాడ్గే బాబాకు భారతరత్న ఇవ్వాలి: రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు డిమాండ్

మైలవరం, డిశంబర్ 21, ప్రభాతవార్త : సమాజ ంలో అసమానతలను రూపుమాపటానికి గ్రామ గ్రామాన తిరిగి పరిశుభ్రత పై ప్రజలను చైతన్యం చేస్తూ వారి మూఢనమ్మకాల పారదోలేందుకు కష్టపడి పనిచేయాలని, పిల్లలను చదివించాలని పేదవిద్యార్థులకు చదివేందుకు హాస్టల్స్ స్కూల్స్ అన్నదాన సత్రాలు, పశువులకు గోశాలలను నిర్మించిన మహోన్నత స్వచ్ఛభారత్ పితామహుడు సంత్‌గాడ్గే బాబాకు భారతరత్న ఇవ్వాలి అని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు డిమాండ్ చేశారు.



ఆదివారం సంత్‌గాడ్గేబాబా 69వర్ధంతి సందర్భంగా మైలవరంలోని నూజివీడు రోడ్డులో ఆయన చిత్రపటానికి నియోజకవర్గ రజకసంఘం అధ్యక్షులు తాళ్లూరి శేషగిరి రావు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధవరపు వెంకట్రావు మాట్లాడుతూ భారతప్రధాని మోదీ నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్‌కు ఆద్యుడు, డా బిఆర్ అంబేద్కర్ గురువు అయిన సంత్‌గాడ్గేబాబాకు భారతరత్న ఇవ్వాలని, భారతపార్లమెంట్‌కు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు డి వీరభద్రరావు, సాయిరి అనిల్, బి గోపాల్, కె లక్ష్మారావు, జి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ ఇండియా మిషన్‌కు ఫ్లిప్‌కార్ట్ మద్దతు

విజయవాడ, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎన్సీవిఇటి నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖతో కలిసి కేంద్ర ప్రభుత్వ స్కిల్ ఇండియా మిషన్‌కు మద్దతు ఇవ్వడానికి నేషనల్ ఒకేషనల్



ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు తెలిపారు. దేశంలో పెరుగుతున్న లాజిస్టిక్స్ రవాణా రంగానికి తగిన శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఎన్సీవిఇటి చైర్‌పర్సన్ దేబశ్రీముఖర్జీ పాల్గొన్నారు.

## ఏపిలో టివిఎస్ ఆర్బిటర్ ప్రారంభం

విజయవాడ, డిశంబర్ 21, ప్రభాతవార్త : తమ కొత్త ఆర్బిటర్‌ను ఆంధ్రప్రదేశ్లో ఆవిష్కరిస్తున్నట్లు టివిఎస్‌మోటార్స్ కంపెనీ హెడ్ కమ్యూనికేషన్ అనిరుద్ధ హల్దార్ తెలిపారు. ఇవి రంగంలో అత్యున్నత సాంకేతికతతో కూడిన ఈ ఆర్బిటర్ 3.1కెడబ్ల్యుహెచ్ బ్యాటరీతో లభిస్తుందన్నారు.

# విజయవాడ వార్త



## నిండు జీవితానికి రెండు చుక్కలు
### నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 20,ప్రభాతవార్త: నిండు జీవితానికి రెండు చుక్కలు అంటూ పోలియో ఆదివారం కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 46వ డివిజన్ కెఎల్‌రావు నగర్‌లో పోలియో కార్యక్రమంలో పాల్గొని



చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి శాశ్వతంగా నిర్మూలించేందుకు 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లల తల్లిదండ్రులందరూ తమ పిల్లలకి పోలియో చుక్కలు వేయించాలని, ఆదివారం నాడు పోలియో చుక్కలను వేయించ లేకపోతే సోమవారం,మంగళవారం నాడు ప్రతి ఇంటికి వచ్చి ఎన్ఎంలు చిన్న పిల్లలు ఉన్నారా లేదా అంటూ అడిగి వారికి పోలియో చుక ్కలు వేస్తారని, వారికి సహకరించి పోలియో చుక్కలు వేయించాలని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికను సంప్రదించండి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 20,ప్రభాతవార్త: కార్పొరేషణ్‌కు చెందిన సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సంప్రదించవచ్చని మున్సిపల్




కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఉదయం 10 నుండి 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయంతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడ అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తిరువూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : తిరువూరు నాగార్జునస్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా సరిహద్దు ఖమ్మం జిల్లా నుండి కూడా రోగులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డా వల్లభనేని రవీంద్ర పలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. వైద్యపరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



## ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



తిరువూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : తిరువూరు మండలం కాకర్ల గ్రామంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్ ఇతర వైసిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వారు జన్మదిన కేకును కట్‌చేసి హ్యాపీబర్త్‌డే జగనన్న అంటూ కేరింతలతో నినాదాలతో ఉత్సాహంగా వేడుకలు జరిపారు.

## తిరువూరులో పల్స్‌పోలియో



తిరువూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : తిరువూరు టౌన్ ప్రభుత్వ కళాశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాష్ట్ర హాజ్ కమిటీ చైర్మన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్లా హుస్సేన్, తిరువూరు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కామాల్ రామారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదం


ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో డిపిఆర్‌టియు ఎ కొండూరు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సేవాదళ్ అధినేత



డి.శ్రీను అధ్యక్షతన మండలంలో ఆయా పాఠశాలలకు నూతనంగా జాయినయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో అభినందన సభ నిర్వహించారు. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తినిఎంచుకొని ప్రస్తుతం ఉన్న కాంపిటేషన్‌లో ఎంతో కష్టపడి ఉద్యోగం సాదించిన వారికి సర్వీస్ రిజిష్టరులు బహుకరించి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమం అనంతరం నూతన మండల శాఖ అధ్యక్షుడిగా బి.సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శిగా డి.రవికృష్ణ కుమార్‌లను రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎంలు డిజె ఎండి ప్రసాదరావు, సంఘ నాయకులు రాజారావు, బండి గిరిబాబు, సురేష్‌బాబు, శ్రీనివాస్, రమేష్, కనకరాజు, శామ్యూల్, శివ, స్వరూపరాణి, లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కెఆర్‌పాలెం గురుకుల పాఠశాల కళాశాల ముస్తాబు ఎస్ఎఎస్ఎ కార్యక్రమాలు

ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ గురుకులాల ఎన్‌టిఆర్ కృష్ణా ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలలో





శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారానికోసారి చేతివేళ్ల గోళ్లను కత్తిరించుకోవాలని ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్నానం చేయాలని ఉతికిన బట్టలు ధరించి పరిశుభ్రంగా ఉండాలని మురళీకృష్ణ కోరారు. అలాగే స్వచ్ఛాంద్ర స్వర్ణాంధ్ర (ఎస్ఎ ఎస్ఎ) కార్యక్రమంలో భాగంగా పాఠశాల / కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి విధొఇగా మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి విధిగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణ వాతావరణ సమతుల్యత వాయు కాలుష్య నివారణకు పాటుపడాలని జిల్లా సమన్వయ అధికారి మురళీకృష్ణ సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల / కళాశాల ప్రిన్సిపాల్ కె.సిద్ధయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గెలుపును పంచడమే నిజమైన ఆట

గుంటూరు విద్య డిసెంబరు 21 ప్రభాతవార్త: క్రీడలంటే పతకాలు కాదని, గెలుపును పంచడమే ఆటకు నిజమైన నిర్వచనమని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ డిసిపి సరిత అన్నారు. శనివారం స్థానిక వికాస్ నగర్ లోని వికాస్ గ్రౌండ్లో జరుగుతున్న భాష్యం ఒలంపస్ యాన్వల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీసీపీ సరిత మాట్లాడుతూ క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, జీవితంలో ఎదురయ్యే ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కొనే శక్తినిస్తాయన్నారు. మన అనే భావన క్రీడా స్ఫూర్తి ద్వారా పెంపొందించబడుతుందన్నారు. ఇండియాకి వన్నెతెచ్చిన ఎంతోమంది క్రీడాకారులు మీకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న భాష్యం యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. తొలుత డీసీపీ సరిత భాష్యం స్పోర్ట్స్ మీట్ జెండాలను ఆవిష్కరించి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన ఓపెన్ పరేడ్ లో వారి నుండి గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ రకాల క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీసీపీ సరిత చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్ ఈ ఓ లు శివ, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దూరవిద్య పూర్వ వైభవానికి ప్రణాళికలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు21, ప్రభాతవార్త: ఏఎన్‌యు దూరవిద్యకు పూర్వ కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు ఉన్నారు. ప్రస్తుతం 26 వరకు పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు ఇస్తున్నారు. గతంలో డిగ్రీ కోర్సులైన బిఏ, బికాం, బిఎస్సీ, బిబియం, సర్టిఫికెట్ కోర్సులు, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబిఏ, ఎంసిఏ, పీహెచ్‌డి కోర్సులు కూడా దూరవిద్యా కేంద్రం అందించింది. దేశంలో ఢిల్లీలోని ఇగ్నో యూనివర్సిటీ తరువాత దూరవిద్యను ప్రణాళికా బద్దంగా అందిస్తున్న కేంద్రంగా ఏఎన్‌యుకు



పేరుంది. అంతటి వైభవం మళ్ళీ తీసుకొచ్చేందుకు నిరంతరం ప్రణాళికలు తీసుకొస్తున్నారు దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు. డైరెక్టర్‌గా తన సమర్థతను నిరూపించుకుంటున్నారు. అకడమిక్ పరంగా హెచ్‌ఓడి, డీన్, బిఓఎస్ చైర్మన్ లతో పాటు పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ వంటి పదవుల్లో పనిచేశారు. విద్యార్థులు, పరిశోధకులు అకడమిక్ పరంగా ఎదిగేందుకు పలు సూచనలు చేస్తు సామాజిక శాస్త్రాల్లో ఉపాధికి బాటలు వేస్తున్నారు. పరిశోధనలో పర్యవేక్షకునిగా దాదాపు 50 ఎంఫిల్, పీహెచ్‌డి డిగ్రీలు అందించారు. ఏఎన్‌యు దూరవిద్య స్టడీ మెటీరియల్ చాలా కళాశాలలు, యూనివర్సిటీలు రెగ్యులర్ విధానంలో అమలు చేసుకున్న సందర్భాలున్నాయి. పరీక్షలు నిర్వహణ, ఫలితాలు ప్రకటన, సర్టిఫికెట్‌లు నేరుగా అభ్యర్థులకు పోస్ట్ చేయడం, ఫోన్, ఈ మెయిల్ ద్వారా నిరంతరం అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుంది. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (ఢిల్లీ) అనుమతి ప్రకారం ఏ యూనివర్సిటీ అయితే రెగ్యులర్ విధానంలో యూజి కోర్సులు అందిస్తుందో ఆ యూనివర్సిటీలు మాత్రమే దూరవిద్యలో ఆయా కోర్సులు నిర్వహించుకునే అవకాశం ఇచ్చింది. ఈ నిర్ణయంపై ఎప్పటికప్పుడు డెబ్‌తో సంప్రదింపులు చేస్తుండటం ఆయనలోని అకుంటిత దీక్షకు నిదర్శనం. పీజీలో ఎంబిఏ, ఎంసిఏ కోర్సులకు ఆధరణ ఉంది, వాటితో పాటు పీజీ సైన్స్ కోర్సులకు కూడా అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. త్వరలో యూజి కోర్సులు కూడా వస్తాయని వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

**దూరవిద్య సేవలు మారుమూల గ్రామాలకు**

ఏఎన్‌యు దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో అవసరమైన మేరకు స్టడీ సెంటర్లు మంజూరు కు అవకాశం ఉందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు దూరవిద్య సేవలను సైతం అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అభ్యర్థుల డిమాండ్ ప్రకారం స్టడీ సెంటర్లు కేటాయిస్తామన్నారు. దూరవిద్య చదవాలనుకునే వారికి అన్ని రకాల సూచనలు సలహాలు ఇస్తూ వారికి అధనపు విద్యార్హతలు కల్పించేందుకు కృషిచేస్తున్నారు. గతంలో దూరవిద్య అంటే కేవలం గృహిణులు, పదోన్నతులు కోసం చేరేవారని ఇప్పుడు అన్ని రకాల వారున్నారని వివరించారు.

**డ్యూయల్ డిగ్రీకి అవకాశం**

ఏఎన్‌యు దూరవిద్యా కేంద్రంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు అవకాశం ఉందని ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. రెగ్యులర్ విధానంలో పీజీలో ఏదైనా కోర్సు చేస్తున్న విద్యార్థులు అదే సమయంలో సమాంతరంగా దూరవిద్యలో కూడా మరొక పీజీ కోర్సు (అర్హతల ప్రకారం) చేసుకునే వెసులుబాటు ఉంది. అలాగే క్యాంపస్‌లో ఉద్యోగాలు చేస్తున్న వారికి ఫీజులో కొంత రాయితీ కూడా దూరవిద్య కల్పిస్తుంది. :

**నేరుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం్మ:** డైరెక్టర్‌గా నేరుగా విద్యార్థుల సమస్యల పరిష్కారంకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎవరైన సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వెంటనే సర్టిఫికెట్‌లు అందించే విధంగా ఉద్యోగులకు ఆదేశాలు జారీచేశారు. అభ్యర్థులు నేరుగా తన కార్యాలయానికి వచ్చి వారి సమస్యలు వెల్లడిస్తే సంబందిత అధికారి, ఉద్యోగి ద్వారా ఆ సమస్యకు అక్కడే పరిష్కరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అభ్యర్థులు తమకు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్‌లు పోస్టు ద్వారా రావడం లేదని, పిర్యాదు చేయడంతో వారి అడ్రస్‌కు చేరుకోని, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్‌ల వద్ద వెరిఫై చేసి వారికి తగు న్యాయం చేస్తున్నారు. అభ్యర్థులు ఫీజు చెల్లించడంలో ఆలస్యం అయితే వారు నేరుగా ఈమెయిల్ ద్వారా డైరెక్టర్‌కు వినతిపత్రం పంపితే వెంటనే వారికి ఫీజు చెల్లించుకునేలా అవకాశం కల్పిస్తున్నారు. ఇలా అభ్యర్థుల సేవలకు దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా నిరంతరం అందుబాటులో ఉండి వారికి తగు సర్వీస్‌లను అందిస్తున్నారు. ఈ క్రమంలో రానున్నకొద్ది రోజుల్లోనే దూరవిద్యకు పూర్వ వైభవంకు తెచ్చుకుంటుందని వర్సిటీలో పలువురు పేర్కొంటున్నారు.

## ఆకట్టుకున్న జానపద బృందగాన పోటీలు

గుంటూరు కల్చరల్,డిసెంబరు 21,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీపద్మావతి కల్యాణ వేదికగా సంస్కారభారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు బృందం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న భరతమాత పూజా దినోత్సవ



వేడుకల్లో భాగంగా 1నుంచి 10వ తరగతి వరకు సీనియర్స్, జూనియర్స్ విభాగాలకు,ఉపాధ్యాయులకు నిర్వహించిన సాంప్రదాయ కళలైన జానపద బృంద గీతాలాపన పోటీలు ఆకర్షణీయంగా సాగాయి.చిన్నారులకు యోగాసన పోటీలు,భాగవతం లోని బలి చక్రవర్తి జీవిత విశేషాల పై ఆబ్జెక్టు టైపు టెస్ట్ పోటీల్లో అనేక ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల నుండి పాల్గొన్న విద్యార్థులకు సంస్థ వారు ప్రశంసా పత్రాలు,బిస్కట్లు అందించారు.

## ఘనంగా జగన్ జన్మదిన వేడుక

ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కంభంపాడు పట్టణంలో వైసిపి అధినేత మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎ కొండూరు ఎంపిపి కాలసాని నాగలక్ష్మి వైసిపి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మండల వైసిపి యూత్ అధ్యక్షుడు మండల వైసిపి యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాడ్డు) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నాగలక్ష్మి రాడ్డు



దంపతులు మాట్లాడుతూ వైఎస్ జగనన్న హయాం పేదబడుగు, బలహీన వర్గాల ప్రజలకు స్వర్ణయుగమని కులాలకు మతాలకు పార్టీలకు జెండాలకు అతీతంగా ప్రజాపాలన నిర్వహించి, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజల గుమ్మం చెంతకు తీసుకొచ్చిన స్వార్థం లేని జగనన్న పరిపాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఎంపిపి నాగలక్ష్మి చెన్నారావు (రాడ్డు) అన్నారు. ఈ సందర్భంగా జరిగిన జగనన్న బర్త్‌డే వేడుకల్లో తిరువూరు నియోజక వైసిపి యూత్ కన్వీనర్ జాలా ముత్తు వైసిపి మండల యూత్ అధ్యక్షుడు చిమట రామకృష్ణ (రేజా) వైసిపి గ్రామ శాఖ అధ్యక్షుడు కాలసాని వెంకటేశ్వరరావు సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపిసిటి మెంబర్ మాజీ సర్పంచ్ కోట పుల్లారావు తదితరులు పాల్గొనగా ఎంపిపి నాగలక్ష్మి బర్త్‌డే కేక్ కట్ చేసి జగనన్నకు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పల్స్‌పోలియో విజయవంతం

ఎ కొండూరు, డిశంబర్ 21, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం 98శాతం పూర్తి అయినట్లు మండల పిహెచ్‌సి డాక్టర్లు వేముల స్వాతి టి.దివ్య ఆదివారం మీడియాకు తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల తహశీల్దార్ కాలి లక్ష్మి, ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు పాల్గొని 5 ఏళ్ల లోపు పిల్లలకు రెండు చుక్కలు చొప్పున వేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కాలి లక్ష్మి, ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో రహిత సమాజం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతుందని, పోలియో మహమ్మారిని దేశం నలుమూలల నుండి రాష్ట్రం నుండి తరిమికొట్టి పిల్లలను సంరక్షించుకోవడమే ధ్యేయమని మండలంలో ఏర్పాటు చేసిన 36బూత్‌లలో 5ఏళ్లలోపు 5111 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నారని బూత్‌ల వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకొని పిల్లల కోసం 22, 23 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే జరిపి పోలియో చుక్కలు వేస్తారని డాక్టర్ స్వాతి డాక్టర్ దివ్య తెలిపారు.

## ప్రజల ఆరోగ్య రక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: ప్రజల కనీస అవసరాలు తీర్చడం, ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతని, పేదలు ఎలాంటి అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలై బాధపడకూడదన్న సదుద్దేశంతోనే ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రెండు చుక్కలతో జీవితాలను కాపాడుకోవచ్చనే వాస్తవాన్ని చిన్నారుల తల్లిదండ్రులు గ్రహించాలని, పల్స్ పోలియో ఆవశ్యకతను గుర్తించాలని ఆయన సూచించారు. ఆదివారం పురుషోత్తమపట్నంలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర కంటి ఆసుపత్రి, ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి వారు సంయుక్తంగా ఏర్పాటుచేసిన 40వ ఉచిత కంటిగుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రత్తిపాటి అనంతరం పట్టణంలోని ఆదిఆంధ్రా కాలనీలో పల్స్ పోలియో శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.





అనారోగ్య సమస్యలతో ప్రజలు బాధపడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం ప్రజల ఆరోగ్య రక్షణకోసం దేశచరిత్రలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం.ఆర్.ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి), ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా పాటుపడుతున్నారని, ఆయన చూపిన మార్గంలో తమవంతుగా నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యసేవల్ని అందిస్తున్నట్లు ప్రత్తిపాటి పేర్కొన్నారు. భవిష్యత్ లో ప్రజలెవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదన్న కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఆరోగ్యరంగంలో వినూత్న సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, తోట బ్రహ్మస్వాములు, తోట రామ్మూర్తి, కంచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ పెద్ది నవీన కృష్ణ, డాక్టర్ కిరీటి రతన్, డాక్టర్ రవి, మున్సిపల్ డి.ఈ అబ్దుల్ రహీమ్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు చూపిన మార్గంలో చంద్రబాబు ప్రజల సుఖసంతోషాలు, పేదరిక నిర్మూలనకు కృషి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: ద్వేషించేవారిని కూడా ప్రేమించాలని చెప్పిన మహోన్నతుడైన ఏసు జన్మదినాన్ని క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటున్నామని, ఆ ప్రభువు ఆశీస్సులతో అందరూ ఆనందంగా ఉండాలనే గొప్ప సందేశం ఈ పండుగ తెలియచేస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాటి కేక్ కట్ చేసి, చిన్నారులకు తినిపించి వేడుకల్ని ప్రారంభించి, పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జగన్ లాగా చంద్రబాబు అప్పులు చేసి ప్రజలకు తిప్పలు తీసుకురావడం లేదు. సమర్థత, అనుభవం, కష్టంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు ప్రజలందరి సంతోషం, సుఖశాంతులే లక్ష్యంగా, పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు.



సెమీక్రిస్మస్ ను ఘనంగా నిర్వహించిన పార్టీ ఎస్సీ సెల్ ప్రతినిధులందరికీ పేరుపేరునా ప్రత్తిపాటి ప్రత్యేక అభినందనలు తెలియ చేశారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు ఇనగంటి జగదీష్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొండా వీరయ్య, పట్టణ అధ్యక్షులు కుల్లి చిన్న బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి మేలు చేయటానికి 'కూటమి' ప్రభుత్వం కృషి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: రైతుల ప్రయోజనాల దృష్ట్యా, పంట ఉత్పత్తుల నిల్వకు ఉపయోగపడేలా రూ.5.60 కోట్లతో 2,600 టన్నుల సామర్థంతో నిర్మించిన గోదాము..దుకాణ సముదాయం... ఇతర భవనాల్ని జీడీసీఎంఎస్ యంత్రాంగం ఎల్లప్పుడూ జిల్లా రైతాంగానికి అందుబాటులో ఉంచాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి సూచించారు. ఆదివారం ఆయన నరసరావుపేట సమీపంలో సత్తెనపల్లి రోడ్డులో జీడీ.సీ.ఎం.ఎస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భారీ గోదాము, దుకాణ సముదాయాన్ని స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ.ఆంజనేయులు, డీ.సీ.ఎం.ఎస్ చైర్మన్ వడ్లమాను హరిబాబులతో కలిసి ప్రారంభించి, సభనుద్దేశించి మాట్లాడారు. సభ అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు వ్యవసాయానికి, రైతాంగానికి అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం ఉన్నంత కాలం అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులందరం రైతుల పక్షాన నిలుస్తున్నామని, వారి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తున్నామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జీడీసీఎంఎస్ యంత్రాంగం రైతులకు సేవలందించడంలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలన్నారు. నూతన సాగు విధానాలతో రాష్ట్ర వ్యవసాయాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలన్న సత్సంకల్పంతోనే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పంచసూత్రాలను ప్రవేశపెట్టారని, రైతాంగం వాటిని తూ.చ తప్పక అమలు చేస్తే వ్యవసాయంలో ఎవరూ ఊహించనంత అభివృద్ధి సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువులు సహా యాంత్రీకరణ పరికరాల అందజేత, మద్దతు ధర అమల్లో కూటమిప్రభుత్వం చేతల ప్రభుత్వంగా నిలుస్తోందన్నారు. జీడీసీఎంఎస్ విభాగం రైతులకు ఉపయోగపడే విధానాలు, నిర్ణయాలతో పారదర్శకంగా సేవలు అందించాలని ప్రత్తిపాటి ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, డీఎం హరిగోపాల్, కూటమి నాయకులు, జిల్లా రైతు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పల్స్‌పోలియో ప్రారంభం



చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ పతి బాబు, చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామ సుబ్బారావు, క్లబ్ డైరెక్టర్లు కళ్ళ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో పోలియో చుక్కలు



చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: చిలకలూరిపేట : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు గణపవరం గ్రామంలో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చుక్కలను వేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం గ్రామ పార్టీ అధ్యక్షులు


## చిన్నారులకు ఆశీర్వాదాలు



చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: గణపవరం గ్రామానికి చెందిన వెంకట నరసారావుకుమార్తె, కుమారుని నూతన వస్త్ర బహుకరణ వేడుకకు హాజరై, ఆ చిన్నారులు చైత్ర మణికంఠ రాజు ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు.

## నియోజకవర్గంలో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిర్వహించారు. వైయస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా చిలకలూరిపేటలో విడదల రజిని నివాసం వద్ద ఏర్పాటు చేసిన భారీ కేకును పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కట్ చేశారు. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



వైయస్ జగన్ రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లో కూడా ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. ఇచ్చిన మాట కోసం ప్రజల పక్షాన నిలబడి, ఢిల్లీ అధిష్టానాన్నే ధిక్కరించి ధైర్యశాలి నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. విపక్షాలే ఓడిపోతామనే భయాన్ని కూటమి నేతలకు చూపించిన ఏకైక నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. సొంత గ్రామంలో పర్యటించిన ఆమె వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పార్టీ కార్యకర్తలకు విడదల రజిని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నరసరావుపేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త : : పల్నాడు జిల్లా వైసీపీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి 54వ జన్మదినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తల నడుమ వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా వైసీపీ కార్యాలయంలో భారీ కేక్ ను కట్ చేసి, జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. 2029లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావటం తథ్యం అన్నారు. జగనన్న 54వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో ప్రజలు ఒక పండుగలా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



జిల్లా వైసీపీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, సత్తనపల్లి రోడ్డులోని అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. నియోజకవర్గంలోని గ్రామ, గ్రామాన పార్టీ శ్రేణులు జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకోవ టం విశేషమన్నారు. సుమారు 10 గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం చేసినట్లు చెప్పారు. గత జగనన్న పాలనను, ప్రస్తుత చంద్రబాబు నాయుడు పాలనను ప్రజలు పోల్చి చూసుకుంటున్నారని అన్నారు. ఈ సంబరాలను చూస్తుంటే 2029లో జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావడం, నరసరావుపేటలో తాను గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పట్నంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పలు ప్రాంతాలలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు,బ్రెడ్డు పంపిణీ చేశారు. హ్యాపీ బర్త్డే జగన్ సార్ అంటూ నినాదాలు చేశారు. వైయస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## స్టెమ్ ఎక్స్ పో




నకరికల్లు,డిసెంబర్ 21 ప్రభాతవార్త ::స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం స్టెమ్ ఎక్స్ పో ఉత్సాహంగా జరిగినట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు వలన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్, గణితం, ఇంజనీరింగ్ మరియు స్పేస్, రోబో టెక్నాలజీ లలో ప్రాజెక్టులను రూపొందించారు. ముఖ్యంగా పర్యావరణానికి సంబంధించి చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం, కాలుష్య నియంత్రణ పై ప్రత్యేక నమూనాలను ప్రదర్శించారన్నారు. అదేవిధంగా వైద్య రంగానికి సంబంధించి అంతర నిర్మాణ శాస్త్రం, శరీర ధర్మ శాస్త్రం, హిమో డయాలసిస్, రాకెట్ లాంచింగ్, సౌర శక్తి వినియోగం, రోబోటిక్స్ లో చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఈ స్టెమ్ ఎక్స్ పో 2025 సందర్శనకు పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు సందర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ నాగోతు సవిత, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది

## అట్టహాసంగా ప్రారంభమైన ఏఎం.ఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ క్రీడోత్సవాలు

నరసరావుపేట టౌన్,డిసెంబర్ 21 ప్రభాతవార్త ::నరసరావుపేట మండలంలోని పెట్లూరివారి పాలెం గ్రామంలోని ఏఎం. రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఏఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ 2025 క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి భార్గవ్ భూషణ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. తేజోమూర్తి హాజరై మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు పోటీతత్వం అలవడుతుందని తద్వారా అన్ని రంగాల్లో విద్యార్థులకు చైతన్యం పెంపొందుతుందని అన్నారు. క్రీడోత్సవాల నిర్వహిస్తున్న ఏఎం. రెడ్డి విద్యాసంస్థల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక మరియు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.



అనేక జాతీయ మరియు అంతర్జాతీయ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఇటువంటి క్రీడా పోటీలు దోహదపడతాయని తెలిపారు. ఈ క్రీడోత్సవాల సందర్భంగా మహిళా విభాగంలో ఖోఖో, త్రో బల్, క్యారమ్స్, చెస్, పురుషుల విభాగంలో కబడ్డి, ఖోఖో, చెస్ మరియు క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. మహిళ త్రోబాల్ పోటీలలో ఏఎం. రెడ్డి ఫార్మసీ కళాశాల మరియు చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలు ఫైనల్స్ చేరగా, పురుషుల విభాగంలో ఖోఖో పోటీలలో ఏఎం. రెడ్డి ఫార్మసీ కళాశాల మరియు చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల జట్టు సెమీస్ కి చేరాయని ప్రిన్సిపాల్ తెలిపారు. మహిళ 100 మీటర్ల పరుగుపందంలో సిమ్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని జె.ద్వారక మొదటి స్థానం, ఏఎం. రెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థిని టి.అశ్విని రెండవ స్థానంలో నిలిచింది. 100 మీటర్ల పురుషుల పరుగు పందెంలో మొదటి స్థానంలో కేసిరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థి బి. విజయ్, రెండవ స్థానంలో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల విద్యార్థి బి. పృథ్వి నిలిచారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్ డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. కృష్ణారెడ్డి, కళాశాల డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ పావని, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఉచిత యోగ శిక్షణా శిబిరం


నరసరావుపేట టౌన్, డిసెంబర్ 21 ప్రభాతవార్త : :వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో 28 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న 9వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద మహోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ప్రధాన ఏర్పాటు చేశారు. యోగాచార్యులు ఆతుకూరి వేంకటేశ్వర యోగి గురూజీ చరవాణి ద్వారా లైవ్ లో మాట్లాడారు. యోగం ద్వారా బుద్ధి బలం వృద్ధి చెందుతుందన్నా రు., ముఖ్య అతిథులుగా గంగూరి శ్రీనివాసరావు, తెలప్రోలు సుభాష్ చంద్రబోస్, గుంటుపల్లి చంద్రశేఖర్, మోదుగుల శ్రీనివాసరావు, చింతలపూడి సాలిరెడ్డి, లాయర్ మోదుగుల ఆరోగ్య చౌదరి హాజరవ్వగా వారిని కార్యక్రమం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శిబిర నిర్వాహక బోధక యోగచార్యులు జల్లి శ్రీనివాసరావు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతల విరాళం

నరసరావుపేట, డిసెంబర్ 21 ప్రభాతవార్త :: మండలంలోని ఇస్స పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవి దేవి ఆదివారం తెలియజేశారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన మహిపతి ఆంజనేయులు తులసమ్మ కుమారులు కోటేశ్వరరావు లక్ష్మీ ్మ శివ పార్వతి లు ఒక లక్ష 1,116 రూపాయలు విరాళం అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు భార్గవ్ శ్రావణి పాల్గొన్నారు అని వివరించారు. భక్తులకు అమ్మవారి శేష వస్త్రం తో పాటు దర్శనం, తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు. వేగంగా జరుగుతున్న ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా దాతలు అందించే విరాళాలకు సంబంధించి ప్రభుత్వం ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి భక్తులకు అభినందనలు తెలిపారు.



## పేద విద్యార్థినికి పారితోషికం



నరసరావుపేట టౌన్, (పల్నాడు జిల్లా), రేపటి కోసం : బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎన్ఈసి కళాశాలలో చదువుతున్న ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థిని కన్నెగంటి సాయి నిఖితకు రూ. 20,000 పారితోషికాన్ని అందజేశారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ప్రోత్సాహం భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొల్లు కృష్ణారావు, మేనేజింగ్ ట్రస్ట్ బొల్లు వెంకటేశ్వర్లు, సభ్యులు కోమటినేని నరసయ్య, మర్లపాటి రామకృష్ణ, జాస్తి గోపాలకృష్ణబాబు, బొడ్డుపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొండమోడు-పేరేచర్ల రోడ్డు నిర్మాణం పనుల పరిశీలన

**సత్తెనపల్లి, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** కొండమోడు నుంచి పేరేచర్ల హైవే రోడ్డు పనులను తాజాగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నేత దరువురి నాగేశ్వరరావు మరియు ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

**సత్తెనపల్లి, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** వైకాపా అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఆదివారం సత్తెనపల్లి పరిధిలో ఘనంగా జరిపారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ మీడియా ప్యానలిస్టు చిట్టా విజయభాస్కరరెడ్డి, తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి ఆలయంల ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి వైకాపా ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, పక్కాల సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షుడు వేపూరి శ్రీను, రాజుపాలెం జడ్పీటిసి సునీత, అచ్యుతశివప్రసాద్, గరిగదాసు శ్రీధర్‌రెడ్డి, వల్లెల నరసింహారావు, బండి కోటి నాగిరెడ్డి, కౌన్సిలర్ మాధవ,గడ్డం వెంకటేశ్వర్లు (బుల్లోడు), బెల్లంచర్ల కళ్యాణ్, బండి మల్లికార్జునరెడ్డి, చల్లగుండ్ల ఎంపిటిసిలు గోపు అంజిరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యప్ప దీక్షాపరులకు ,భక్తులకు అన్నదానం అందజేశారు.



## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

**సత్తెనపల్లి, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలు మేరకు ప్రతి ఆదివారం ఇంటిటికి కార్యక్రమంలో భాగంగా ఆదివారం 4వ వార్డులో డి. జానకి రామయ్య ప్రధాన కార్యదర్శి జానీ, పాండురంగ రావు, కార్యదర్శి నాగేశ్వరావు, కోశాధికారి జిల్లా మురళి, కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు అలీ, తెలుగు యువత కార్యదర్శి వనమా రామారావు సభ్యులు, బుట్టో తదితరులు పాల్గొని ప్రజా సమస్యలను తెలుసుకొని కమిటీ తీర్మానం చేశారు.



## సత్తెనపల్లిలో ఘనంగా హిందూ సమ్మేళనం

**సత్తెనపల్లి, డిసెంబర్ 21, ప్రభాతవార్త:** సామాజిక పరివర్తన కోసం హిందూ సమ్మేళనం ప్రజల్లో దేశభక్తి, జాతీయతా భావన,స్వధర్మసంరక్షణ కోసం ప్రారంభించబడిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘం వంద సంవత్సరములు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు జరుగుతున్నాయని, స్థానిక హిందూసమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మరాఠా సంఘ కార్యవర్గ సభ్యులు భానోజీ కార్యక్రమమునకు అధ్యక్షత వహిస్తూ తెలిపారు. ఆదివారం సత్తెనపల్లిలోని సరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో స్థానిక ఆధ్యాత్మికవేత్త చుండూరు లక్ష్మి మాట్లాడుతూ రామాయణం మన జీవన విధానమని, అందులోని విలువలను కుటుంబజీవనంలో అలవర్చుకోవాలని అనేక ఉదాహరణలతో వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాలభైరవ పీఠ స్వామీజీ పూజ్యశ్రీ నిత్య విద్యానంద భారతి వారు తమ ఆశీర్వచన ప్రసంగంలో, దేవాలయాలను, దేవాలయ ఆస్తులను, సనాతన ధర్మమును సంరక్షించడం



ప్రతి హిందువు కర్తవ్యమని తెలియజేస్తూ, తల్లిదండ్రులను దైవసమానంగా గౌరవించి, ఆదరించాలని, హిందూ కుటుంబజీవన విధానము ప్రపంచమునకే తలమానికమని పేర్కొన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ సహప్రాంత శారీరిక ప్రముఖ్ వోలేటి రవి ప్రసంగిస్తూ, ప్రపంచానికి జ్ఞానభిక్షపెట్టిన ఐశ్వర్యవంతమైనమన దేశం.. ప్రజల మధ్య అనైక్యత కారణంగా వెయ్యి సంవత్సరాల పాటు బానిసత్వ జీవనాన్ని అనుభవించిందని, ప్రజల్లో దేశభక్తిని, ఐకమత్యమును పెంపొందించుటకు1925లో పూజనీయ డాక్టర్ హెడ్గేవారు స్థాపించిన ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు ఇక్కడ జరుగుతున్న హిందూ సమ్మేళనంలో మనందరం పాల్గొంటున్నామని తెలిపారు. కుటుంబ జీవనవిలువలను పెంచుకోవడం, సామాజిక సమరసత, స్వదేశీ, పర్యావరణ సంరక్షణ, పౌరవిధులను ప్రజలందరూ ఆచరించాలని తెలియజేశారు. ఈ



కార్యక్రమంలో పదిమంది సంతానం కలిగిన వనమా రామారావు, ఆరుగురు సంతానంతో ఉన్న పెరుమాళ్ళ రామారావు దంపతులను, మొల్లమాంబ వృద్ధాశ్రమ నిర్వాహకులు శ్రీ ఆరేపల్లి కొండలు దంపతులను, స్థానిక ప్రసిద్ధ రంగస్థల కళాకారులు, నంది, ఉగాది పురస్కార గ్రహీత శ్రీ లక్ష్మయ్య గారిని, కేంద్ర ప్రభుత్వ చేనేత పురస్కార గ్రహీత కర్నాటి మురళిని నిర్వహణసమితి సభ్యులు సత్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో శిశుమందిర్ విద్యార్థులు, యువకులు ప్రదర్శించిన చెక్కభజన, కోలాటం, కర్రసాము, భజనగీతాలు సభికులను అలరించినవి. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ కమిటీ సభ్యులు చలువాది సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్ హరికుమార్ మోటమర్రి రాంబాబు తదితరులు, పాఠశాల ఆచార్యులు, నగర సంకీర్తన సంఘ సభ్యులు అన్నం రమణ, మహేశ్వర రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు అబ్బూరి సత్యనారాయణ, బదరీనారాయణ, శంకర్, తొమ్మండ్రు సత్యనారాయణ తదితరులు పుర ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వివేకానంద చైతన్యభారతి సభ్యులు వెంకటనారాయణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసినది. కార్యక్రమం అనంతరం అందరికీ భోజన వ్యవస్థ ఏర్పాటుచేశారు.

## ఘనంగా వేడుకలు

చిలకలూరిపేట, డిసెంబర్ 21, ప్రభాతవార్త: చిలకలూరిపేట: పట్టణంలోని కూరపాటి నివాసంలో నిర్వహించిన చిన్నారుల నూతన వస్త్రబహూకరణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులకు ఆశీస్సులు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చైత్ర శ్రీ మరియు మణికంఠ రాజులకు నూతన వస్త్రాలను అందజేసి, వారిని ఆశీర్వదించారు. .చరణ్ తేజ తో పాటు జనసైనికులు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరం

రొంపిచర్ల డిసెంబర్ 21 ప్రభాతవార్త :: డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్ ఆధ్వర్యంలో ముప్పాళ్ళ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసిన హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లోకి రెడ్డి శ్రీనివాస్ రెడ్డిని, వారి వైద్యులు సిబ్బందిని ఆయన అభినందించారు తెలుగుదేశం పార్టీ నాయకులు రాపర్ల జగ్గారావు, వరదయ్య, సత్యం, హనుమయ్య, శ్రీనివాసరావు, కృష్ణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 350 మంది డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్ వైద్య శిబిరం లో పరీక్షలు చేయించుకున్నారు.

## మాజీ సీఎం జగన్ జన్మదిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట,డిసెంబర్ 21 ప్రభాతవార్త :: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి 54వ జన్మదినాన్ని పురస్కరించుకొని పలనాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సుస్మిత ఆర్థో అండ్ ట్రామా కేర్ హాస్పిటల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆదివారం డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా హాస్పిటల్ నందు ఆర్థోపెడిక్ మరియు న్యూరాలజీ వ్యాధులకు సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ మెగా వైద్య శిబిరము నందు చికిత్స కొరకు వచ్చిన రోగులకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్సరే పరీక్షలు, ఎముకల సాంద్రతకు సంబంధించిన పరీక్షలు మరియు శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా అందించినట్లు వివరించారు., రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందని తెలియజేశారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ బాలకృష్ణా పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పొన్నూరు ఉపాధ్యాయినులు



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పొన్నూరు మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయిలో పోటీల్లో వీరు పాల్గొని అత్యధిక ప్రతిభ కనబరచారు. జిల్లా స్థాయిలో జట్టులో ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో జె.ఉమాదేవి, కె.నీలాబాయి, కె.తిరుపతమ్మ, ఎం.స్వాతి, కె.శాంతి ఉన్నారు. వీరిని మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

## పోలియో రహిత సమాజస్థాపనకు కృషి చేయాలి



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: పోలియో రహిత సమాజస్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలో జరుగుతున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. 0-5సంవత్సరాల లోపు వున్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేయించడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అపోహలను నమ్మవద్దని కోరారు. పట్టణంలో పలు పోలియో కేంద్రాలను సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## మండే సుబ్రహ్మణ్యంకు గోదావరి పురస్కారం



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరంలోని బకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గీతం 15 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండే సుబ్రహ్మణ్యంకు గోదావరి పురస్కారాన్ని అందజేశారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో గోదావరి కవితా తరంగాలు వారి ఆహ్వానం మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా అమృతలూరుకు చెందిన మండే నాన్నే నా దైవం అనే తన స్వీయ కవితా గానం చేసి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే భక్తుల బలరామకృష్ణ, సంస్థ చైర్మన్ కొల్లి రమాపతి తదితరుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

## మాణిక్యరావును అభినందించిన వడ్రాణం



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పిల్లి మాణిక్యరావును ప్రకటించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జీడీసీఎమ్మెస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మాణిక్యరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు, కార్యకర్తల, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని వడ్రాణం కోరారు. పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు త వంతు సహాయ సహకారాలు అందిస్తానని వడ్రాణం హరిబాబు పిల్లి మాణిక్యరావు సూచించారు. పిల్లి మాణిక్యరావు నేతృత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యను కాపాడుకుందాం.....ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: విద్యను కాపాడుకుందామని....ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్ పిలుపునిచ్చారు. యూనియన్ క్యాబినెట్ ఆమోదించిన వికసిత్ భారత్ శిక్ష అధీక్షక్ బిల్లు-2025ను స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అందుకు సంబంధించిన పత్రాలను దహనం చేశారు. సమీర్ మాట్లాడుతూ గతంలో 2018లో ప్రవేశపెట్టి హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్ఈసిఐ) బిల్లునే కొత్త పేరుతో తిరిగి తెచ్చి, ప్రజాభిప్రాయాలను, విద్యావేత్తల విమర్శలను పూర్తిగా విస్మరించి ఈ బిల్లును



ఆమోదించడం కే oద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ వంటి స్వతంత్ర నియంత్రణ సంస్థలను రద్దు చేసి, వాటి స్థానంలో ఒకే కేంద్రీకృత సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఉన్నత విద్యను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడమే ఈ బిల్లుకు అసలైన ఉద్దేశమన్నారు. ఈ బిల్లు అమలైతే విద్యాహక్కు కాకుండా, డబ్బున్న వారు మాత్రమే కొనగలిగే వస్తువుగా మారుతుందన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అన్సారి, ఉపాధ్యాయుడు సుబాని, ఆబిద్, సమీర్, షఫీ, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: ప్రతి నిత్యం కొంత సమయం ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ ఎంతో మంది మహనీయులు ధ్యానం ద్వారానే పరిపూర్ణమైన జ్ఞానాన్ని సంపాదించి ప్రపంచస్థాయి నేతలుగా ఎదిగారన్నారు. ధ్యానం మనిషిలోని ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయాలంటే తప్పని సరిగా ధ్యానం చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ పరాశరం రంగవల్లి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, బి.శబలాదేవి,పి.మోహనలక్ష్మి, పి.నిర్మలాదేవి, ఎస్.జీవహంస, బి.నాగమంజరి, ఎం.అమరేశ్వరి, విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు

పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్ జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు పట్టణ, మండల పరిధిలోని నిర్వహించారు. పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ జగన్మోనరెడ్డి పాలనలో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉందన్నారు. చెప్పిన మాటలను తు.చ తప్పకుండా నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో రెండేళ్ళు కోవిడ్‌తో రాష్ట్రం అల్లాడినప్పటికీ సంక్షేమ పథకాలకు ఎక్కడా లోటు రాకుండా చూశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. రానున్న 2029ఎన్నికల్లో మళ్ళీ జగన్మోహనరెడ్డిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, నాయకులు చింతలపూడి మురళీకృష్ణ, మౌలాలి, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, పల్లికల శ్యామ్, మంద్రు అనిత, గేరా సంజీవ్, పీర్‌సాహెబ్, దక్కుమళ్ళ రవి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మానవ సేవే మాధవ సేవ



పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: మానవ సేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరూ విశ్వసించి, అవసరార్థులకు సేవ చేయాలని రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు అన్నారు. వికలాంగులకు ఆదివారం నేతాజీనగర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులకు సేవ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. సొంత లాభాన్ని కొంత మానుకొని పొరుగువాడికి తోడుపడవోయ్ అన్న సూక్తిని అనుసరించి ప్రతి ఒక్కరూ అవసరార్థులను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్లను రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచి వికలాంగులకు ఆదుకున్నారన్నారు. కొల్లి మాధవి మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. పలువురు వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాసం వీరయ్య, కొత్తమాసు రామకృష్ణ, నారాయణం మేఘనాథ్, పాములపాటి రవీంద్రనాథ్, రాజేంద్ర చౌదరి, షేక్ కాలేషావలి, పి.శ్రీనివాసరెడ్డి, షేక్ కరిముల్లా, కోగంటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేయించండి

పొన్నూరు, డిసెంబర్ 21,ప్రభాతవార్త: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి పిలుపునిచ్చారు. స్థానికంగా ఆదివారం జరిగిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలని ఆమె కోరారు. రూత్‌రాణి చిన్నారులను ఎత్తుకొని స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పోలియోను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.



## చిన్నారులకు చుక్కల మందు



కొల్లూరు, డిసెంబర్ 21 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరులో ఆదివారం పల్స్‌పోలియో సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలకు కాకతీయ కళ్యాణ మండపం కొల్లూరు నందు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి మాజీ మండల పరిషత్ అధ్యక్షులు డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.కూటమి నాయకులు, పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## కాంగ్రెస్ పార్టీ కడిగిన ముత్యం: మహాత్మని అవమానించడం బాధాకరం:
## డీసీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం: మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం

బాపట్ల.డిసెంబర్21.(ప్రభాతవార్త).దేశమును కాపాడగలిగే సత్తా, ఎన్ని అవరోధాలు వచ్చినా ఎదుర్కొనే దమ్ము, ఈడీ కేసులలో కడిగిన ముత్యంలా బయటకు రాగలిగినది ఒక కాంగ్రెస్ పార్టీ నే అని మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యులు జే డి శీలం అన్నారు.పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంటా అంజిబాబు స్వగృహంలో ఆదివారంవిలేకరుల సమావేశాని నిర్వహించారు.ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నమాజీ కేంద్రమంత్రి శీలం మాట్లాడుతూ, ఎన్ డి ఏ కూటమి కాంగ్రెస్ పార్టీపై, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పై ఆరోపించిన కేసులని కూడా కొట్టివేయడం కేంద్ర అధికార పార్టీకి



చెంప పెట్టెనన్నారు. కాంగ్రెస్ పార్టీ కడిగిన ముత్యంలా తిరిగి ప్రజా మద్దతును కూడగట్టుకొని దేశాన్ని నిర్దేశించే స్థాయికి కాంగ్రెస్ పార్టీ చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చేందుకు ప్రధాని మోడీ ప్రభుత్వం కుట్రపూరితమైన విధానాలను కొనసాగిస్తుందని మాజీ కేంద్రమంత్రి, జెడి శీలం దుయ్యబట్టారు. జాతిపితామహుడుకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన గౌరవం ఇదేనా అని సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఈవీఎం ల విషయమై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంతో ప్రజలు పక్షాన యుద్ధం చేస్తుందన్నారు.ప్రజలను విస్మరించిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని కాంగ్రెస్ పార్టీ శ్రేణి నాయకులు సూచించారు. అలాగే సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర నాయకులు గంట అంజిబాబు మాట్లాడుతూ, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. సమాఖ్య వాద ఉద్యమంలో కనీసం పోరాట పటిమ చూపించలేదని కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలకు సమాధానము ఆనాటి రాజ్యసభ సభ్యులు కొణిదెల శివశంకర్ ప్రసాద్ ను అడిగి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన సమయంలో మోడీకి మద్దతుగా వైఎస్ఆర్సిపి, టిడిపి, పార్టీలు పూర్తి మద్దతునిచ్చి ఆ నెపాన్ని కాంగ్రెస్ పార్టీపై వేసి తాము మాత్రం పబ్బం గడుపుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ఎప్పుడు ఏమి మాట్లాడతాడో తెలియని నాయకుడిని మనం ఎన్నుకున్నామని రాష్ట్ర ప్రజలు తలదించుకునేలా డీసీఎం వ్యాఖ్యలు ఉన్నాయని గంట అంజిబాబు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికైనా కడిగిన ముత్యములా ప్రజల సమక్షంలో ప్రజల మెచ్చే అధికారంతో తిరిగి భారతదేశాన్ని ఏకతాటిపై నడిపే సాధనంగా తిరిగి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరొకసారి కాంగ్రెస్ పార్టీని కించుపరిచే విధంగా, పార్టీ అధినేతల కుటుంబాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని, త్యాగాలకు నిలయమైన గాంధీ కుటుంబం పై విషము చిమ్మే ప్రయత్నాలను కేంద్ర రాష్ట్ర అధికార పార్టీ నాయకులు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా బాబురావు, ఎస్వీఆర్ కుమార్, బక్క రోశయ్య, ధోనిపూడి రవిబాబు, శంకర్ రెడ్డి, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు....

## చిన్నారులకు నూతన దుస్తులు అందజేత



చెరుకుపల్లి ,డిసెంబర్ 21, ప్రభాతవార్త : సమాజంలోని పేద ,వెనుకబడిన వర్గాల చిన్నారులను ఆదుకోవడమే న్యూ లైఫ్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ గుండాల రవి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన చెరుకుపల్లి హరిజనవాడలో చిన్నారులకు ఉచితంగా దుస్తులను అందజేశారు. పేద కుటుంబాల్లోని చిన్నారులను ఫౌండేషన్ తరపున ఆదుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని ఇటువంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఫౌండర్ గుండాల రవి తెలిపారు. ఈ సందర్భంగా 60 మంది చిన్నారులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గుండాల మోహన్ రావు, గుండాల దానియేలు ,కంచర్ల సుధాకర్, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

## అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దు
## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి: ఎస్పీ

బాపట్ల.డిసెంబర్21.ప్రభాతవార్త. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వినూత్న మార్గాలను ఎంచుకొని ప్రజలను మోసం చేస్తూ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ ఉమామహేశ్వర మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరాలను ఆసరాగా చేసుకొని క్రిస్మస్ గిఫ్ట్, న్యూ ఇయర్ గిఫ్ట్ ల పేరుతో సైబర్ నేరగాళ్లు అపరిచిత లింక్‌లు, ఫైల్‌లను ఫేస్‌బుక్, వాట్సాప్ మరియు ఇతర సోషల్ మీడియా వేదికలలో పోస్ట్ చేస్తున్నారన్నారు. వాటిని క్లిక్ చేస్తే ఖాతాలోని డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారనారుఅపరిచిత లింక్‌లు, తెశిరీ ఫైల్‌లను క్లిక్ చేసే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు, రాబోయే క్రిస్మస్ మరియు నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. దీనిని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు అమాయక పౌరులను మోసం చేసి నగదు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కావున ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితుల నుండి వచ్చిన లింక్‌లు మరియు తెశిరీ ఫైల్‌లను క్లిక్ చేయవద్దని, అలాగే మీ వ్యక్తిగత సమాచారం అయిన పాన్, ఆధార్ కార్డ్ ల నంబర్ లు, వాటి ఫోటోలు, బ్యాంకు ఖాతా గురించిన సమాచారం తదితర వివరాలను అపరిచిత లింక్‌లలో పంచుకోవద్దని హెచ్చరించారు.

## జగన్‌కు ప్రజల ఆశీస్సులు కావాలి

రేపల్లె, డిసెంబరు 21, ప్రభాతవార్త:ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి కి ప్రజల ఆశీస్సులు కావాలని రేపల్లె నియోజకవర్గపార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు.ఆదివారం రేపల్లె వైసీపీ కార్యాలయంలో జగన్మోహన రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు జరిగాయి.ఆర్టీసీ బస్టాండ్ సెంటరులోని స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి డాక్టర్ ఈవూరు గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.పార్టీ కార్యాలయంలో జగన్మోహనరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపి రాష్ట్ర సహాయ కార్యదర్శి చిమటా బాలాజీ,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిత్రాల ఓబేదు,వైసీపీ పట్టణ అధ్యక్షుడు కరేటి



శేషగిరిరావు,మండల పార్టీ కన్వీనర్ అనిల్‌కుమార్,చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు,కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు,కాటూరి శివనాగబాబు,గౌస్,కుదుష్,భాషా,పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి,పద్మావతి,బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు,రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర,బాపట్ల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్,జిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శి ఎన్.నాంచారయ్య,రేపల్లె టౌన్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎ.రాజ్‌పాల్,రేపల్లె టౌన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తలతోటి రాజేష్,కట్టుపల్లి కిరణ్,మున్నా,పృధ్వీ,ఆలీ,శశి,చింటు,అమీన్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు.

## పిల్లలకు పోలియో చుక్కలు



రేపల్లె, డిసెంబరు 21, ప్రభాతవార్త:పల్స్ పోలియో అనేది పోలియో వైరస్‌కు వ్యతిరేకంగా 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు చుక్కలు వేయడం ద్వారా పోలియో నిర్మూలన సాధ్యపడుతుందని రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మారుపూడి సుచిత్ర అన్నారు.ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రాజక్టు పరిధిలో నిర్వహించారు.161 మంది అంగన్‌వాడీ వర్కర్లు విధులలో పాల్గొని పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసారని సిడిపిఓ సుచిత్ర తెలిపారు.తల్లిదండ్రులలో అవగాహన పెంపొందించామని ఆమె చెప్పారు.రైల్వేస్టేషన్,బస్టాండు సెంటర్లలోనూ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి నథిక్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి,ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాధిక,హిమబిందు తదితరులు పాల్గొన్నారు.మండలంలోని కారుమూరు,వేజళ్ళవారిలంక,పేటేరు,మోర్లవారిపాలెం,బేతపూడి,గుడ్డికాయలంక,ఉప్పూడి,పెనుమూడి, రాజుకాల్వ,బొబ్బర్లంక,అరవపల్లి,తుమ్మల, గంగడిపాలెం, మృత్యుంజయపాలెం, లంకెవానిదిబ్బ, చోడాయపాలెం, చెన్నుపల్లివారిపాలెం,సింగుపాలెం,నల్లూరుపాలెం,నల్లూరు,చాట్రగడ్డ,మోర్తోట తదితర గ్రామాలలో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది.వైద్య సిబ్బంది సేవలు అందించారు.ప్రజలు సహకరించారు.

## అంగవైకల్యాన్ని నిర్మూలించే వాక్సిన్

భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 21, ప్రభాతవార్త:భట్టి ప్రోలు మండలంలో ఆదివారం పల్స్‌పోలియో చుక్కల వాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు.మండలంలోని పెదపులివర్రు సచివాలయం పరిధిలో గల గుత్తావారిపాలెం మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఎంపిపి దావూరి వెంకట లలితకుమారి మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలు వినియోగించడం వలన అంగవైకల్యం రాదన్నారు.ఈ కార్యక్రమంలో వెల్లటూరు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అబ్రహం లింకన్, ఎంపిడిఓ ఎస్.వెంకటరమణ,ఎఎన్ఎం ఉషారాణి,అంగన్ వాడీ కార్యకర్తలు జి.రాజ్యలక్ష్మి,విజయ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.మండలంలోని భట్టి ప్రోలు,అద్దేపల్లి,ఐలవరం, 4గ్జబివివేమవరం, సూరేపల్లి, కోనేటి పురం,తాతావారిపాలెం,పడమటపాలెం,పల్లెకోన,ఆళ్ళమూడి,రాచూరు,వెల్లటూరు,ఓలేరు,వరికూటివారి పాలెం,గొరిగపూడి,చింతమోటు,పెసర్లంక,పెదలంక,వెల్లటూరు గ్రామాలలో పల్స్‌పోలియో కార్యక్రమాలు జరిగాయి.



## ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు మేలు



రేపల్లె, డిసెంబరు 21, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల జాబితా నుంచి పట్టాదారు భూములను తొలగించాలని ఆదేశాలు జారీచేయడం శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ జనతాదళ్ ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తాతా సాయిబాబు అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు మంత్రి వర్గ సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు నిర్ణయించడం అభినందనీయమన్నారు.బాపట్ల జిల్లాలో పట్టాదారు భూముల సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్,జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్,జిల్లా జాయింట్ కలెక్టర్ భావన,రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి సత్వర చర్యలు తీసుకోవడం ప్రశంసనీయమని సాయిబాబు తెలిపారు.ఇతర జిల్లాల్లో సైతం ఇటువంటి చర్యలే తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్యప్రమాణాల పరిరక్షణపై అవగాహన

రేపల్లె, డిసెంబరు 21, ప్రభాతవార్త:విద్యార్థుల మానసిక ఆరోగ్యం,భావోద్వేగ స్థిరత్వాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆదివారం రేపల్లె బిసి సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.స్పష్టమైన అవగాహనతోనే విద్యార్థులు సంపూర్ణమైన ఆరోగ్యంతో జీవిత లక్ష్యాలను సాధించగలరని జిల్లా కెరీర్ గైడెన్స్,మానసిక ఆరోగ్య కౌన్సిలర్ పి.ఉమాదేవి చెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సహాయ బి.సి సంక్షేమ శాఖ అధికారి బి.నాగేశ్వరరావు,పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నగరం,డిసెంబర్21,ప్రభాతవార్త: వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను నగరం మండలంలో ఘనంగా నిర్వహించారు.ఆదివారం రేపల్లే వైఎస్సార్‌సీపి పార్టి నియోజకవర్గ ఇన్‌చార్జి నగరం మండల పరిధిలోని వైయస్ఆర్ విగ్రహాలకు ,అంబెద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే ఇవ్వడం జరిగేదన్నరు.ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు.ప్రతి సంక్షేమ పథకం నేరుగా ఇంటిదగ్గకే ఇచ్చే వాలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసారన్నరు.రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి సీఎం అవుతారని జోష్యం చెప్పారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి,ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు,సీట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండలపార్టి కన్వినర్ ఇంకొల్లు రామకృష్ణ,లుక్క బాపనయ్య,నియోజకవర్గ బీసిల కన్వినర్ పాగోలు వెంకటేశ్వరావు,సజ్జవారిపాలెం సర్పంచ్ రాజ,ఎంపీటీసి ఖాదర్‌వలి,ధూళిపూడి సర్పంచ్ ఆనంద్,ధూళిపూడి ఎంపిటీసి బాబురావు,నగరం ఎంపిటీసి వెంకటేశ్వరావు,కార్తకర్తలు,నాయకులు తదితరులు పాల్గోన్నరు.



## కొల్లూరులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కొల్లూరు, డిసెంబర్ 21 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరులో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, కొల్లూరు మండలం మాజీ మండల పరిషత్ అధ్యక్షులు డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, గుమ్మడి శివల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎస్సీలకు తేనేటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్, కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గుమ్మడి శివ, సంఘం డైరీ డైరెక్టర్ గుత్తికొండ జ్ఞానానంద భగవాన్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలి

కొల్లూరు, డిసెంబర్ 21 (ప్రభాతవార్త) : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని తల్లిదండ్రులు విజయ వంతం చేయాలని కొల్లూరు మండల వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో చుక్కలు వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు పిల్లలకు పోలియో చుక్కలను అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పిల్లందరికీ పోలియో చుక్కలు తప్పకుండా తల్లిదండ్రులు వేయించాలన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని వారు సోమ, మంగళవారాలలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారని ఆ సమయంలో పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కల కార్యక్రమంలో తల్లిదండ్రుల భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణప్రియ, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## పేద వర్గాలకు బాసటగా గ్రేస్ ఫౌండేషన్
### -వేమూరు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు
### -ట్రస్ట్ ద్వారా పేద వర్గాలకు సేవా కార్యక్రమాలు

వేమూరు డిసెంబర్ 21 (ప్రభాతవార్త) : వేమూరు నియోజకవర్గంలోని పరిసర గ్రామాల పేద వర్గాలకు క్రిస్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ అనేక రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి బాసటగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతుంది. సమస్త వ్యవస్థాపకులు డాక్టర్ కైతేపల్లి షాలెంరాజు తనకున్న దానిలో పేద వర్గాలకు సహాయ పడాలనే ఉద్దేశ్యంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఆయన సేవ నిరతిని గ్రహించి గౌరవ డాక్టరేట్ కూడా ప్రధానం చేశారు. ముఖ్యంగా ఈ ట్రస్ట్ ద్వారా పేద వర్గాలకు కనీస అవసరతలు, విద్య, ఉపాధి గ్రామాలలో మంచినీటి సదుపాయాలు వంటి కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రాంతంలోనే పుట్టిపెరిగి తనకున్న దానిలో పేదలకు సహాయపడాలనే సదుద్దేశ్యంతో చొరవ చూపే డాక్టర్ కైతేపల్లి షాలెంరాజు చిన్న రైతు కుటుంబంలో జన్మించాడు. రేపల్లె సమీపంలోని చెన్నుపల్లి వారిపాలెం అనే గ్రామంలో కైతేపల్లి వీరయ్య రాజకుమారుల తొలి సంతానంగా జన్మించారు. ఇంటర్మీడియట్ వరకు రేపల్లెలో చదివి డిగ్రీ ఆంధ్రలో దరం కళాశాలలో చదువుకున్నారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో పిజి చదివారు. విద్యాభ్యాసం పూర్తి చేశారు. తన అమ్మమ్మ ఊరు అయినటువంటి ముల్పూరులో కొంతకాలం ఉన్నారు. ప్రేమ వివాహం అనంతరం ఏదో సాధించాలని, పది మందికి ఉపయోగపడాలి అనే పట్టుదలతో హైదరాబాదుకు చేరుకొని అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ ఉద్యోగాన్ని మానివేసి 2012లో సొంతంగా సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ ప్రారంభించి నేడు మూడువేల మందికి పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారు. భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మరియు ఇతర దేశాల్లో తన కంపెనీ ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిచారు. అదే స్ఫూర్తితో గ్రేస్ ఫౌండేషన్ సంస్థ స్థాపించి దాని ద్వారా పేద వర్గాలకు సహాయపడేందుకు తనకు వచ్చే ఆదాయంలో సగభాగం పేద వర్గాలకు విద్య, వైద్యం, వంటి కార్యక్రమాలతో పాటు ఇల్లు, పెళ్ళిళ్ళు వంటి కార్యక్రమాలకు సహాయ పడటంతో పాటు ఇతర సదుపాయాలు కల్పన కూడా సహాయపడుతూ ఆదర్శంగానే నిలుస్తున్నారు. గ్రేస్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు విద్య, ఉపాధికి సహాయపడుతూ పేద వర్గాలకు ఆపద్బాంధవుడుగా షాలెంరాజు గుర్తింపు పొందారు. వేసవి కాలంలో చుట్టుప్రక్కల ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆ కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించటం, ముఖ్యంగా పేద వర్గాల్లో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబానికి ఆసరాగా నిలబడి మృతుడికి ఖననం చేసేందుకు మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందిస్తూ బడుగు వర్గాలకు ఆత్మబంధువుగా నిలుస్తున్నారు.









# భావోద్వేగాల అదుపునకు ధ్యానం ఉపకరిస్తుంది

### ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

### హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం ఉపకరిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం చేస్తున్న వారి మనసు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం అందరూ ధ్యానం చేయాలని సూచనలు చేశారు. రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. సీపీ రాధాకృష్ణన్, జిష్ణుదేవ్‌వర్మ, శ్రీధర్‌బాబు ఒకే వేదికపై ధ్యానం చేశారు. డిసెంబరు 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రకటించిందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ధ్యానం, యోగాలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. మన దేశం ఓ ఆధ్యాత్మిక కేంద్రమని, వికసిత్ భారత్‌లో ఆర్థిక అభివృద్ధే కాదని, దేశ శాంతి కూడా భాగంగా ఉంటుందని పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. శాంతి, సామరస్యం, ఆధ్యాత్మికతను ఈ సంస్థ ప్రోత్సహిస్తోందని అన్నారు. అందరూ ధ్యానం చేసేలా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ (దాజీ) చొరవ చూపుతున్నారని తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ధ్యానం వల్ల అన్నింటిని జయించవచ్చని, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ధ్యానం గురించి ప్రస్తావించాయని తెలిపారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో శాంతితో మెలగాలి. భగవద్గీతలోనూ ధ్యానం గురించి, వాటి ప్రయోజనాల గురించి ప్రస్తావన ఉందన్నారు. ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను జయించవచ్చని దాజీ వివరించారు. మనసు కేంద్రంగా ధ్యానం చేస్తే సత్ఫలితాలు ఉంటాయని అన్నారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత వస్తుందని అన్నారు. తద్వారా సునాయాసంగా విజయాలు సాధించొచ్చని, ధ్యానం చేశాక వచ్చే మార్పును మనం గమనించొచ్చని తెలిపారు. రాత్రి 8 గంటలకు కన్హా శాంతివనం వేదికగా వర్చువల్ ద్వారా లక్ష మందితో ధ్యానం చేయించారు. 170 దేశాలు ఇవాళ మెడిటేషన్ జరుపుతున్నాయని, 2,600 మెడిటేషన్ సెంటర్లలో మెడిటేషన్ చేస్తున్నారని వివరించారు.

**ఢిల్లీకి వెళ్లిన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్**

రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చేగురులోని కన్హ శాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అడిషనల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు, ఘనంగా వీడ్కోలు పలికారు.

# క్రోమ్, వాట్సాప్ యూజర్లకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

### నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వినతి

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** గూగుల్ క్రోమ్ బ్రౌజర్ లోపాలు వాట్సాప్ ఖాతాల టేకోవర్ వంటి పద్ధతుల ద్వారా సైబర్ నేరగాళ్లు ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుని మోసాలు చేస్తున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) వెల్లడించింది. ఈ విషయమై టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్ల డేటా చౌర్యం, ఆర్థికనేరాల కోసం ఈ తరహా పద్ధతులను ఎంచుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమ యాప్‌లను అప్‌డేట్ చేయాలని, ఒటిపిలు లేదా వెరిఫికేషన్ కోడ్‌లను ఎవరికీ షేర్ చేయవద్దని ఆమె సూచించారు. ఏదైనా అనుమానం వస్తే 1930 లేదా సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. క్రోమ్ దాడి ఎలా జరుగుతుదనే దానిపై ఆమె వివరిస్తూ వెబ్‌లింక్/యూఆర్‌ఎల్ ఓపెన్ చేస్తే క్రోమ్‌లో వున్న లోపం వల్ల దుర్వినియోగం జరగవచ్చని, బ్రౌజర్ డేటా, సేవ్ చేసిన పాస్‌వర్డ్స్ డేటా అనధికారికంగా చోరీ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతోపాటు ఫేస్‌బుక్ ఫోటో ట్యాగ్ ద్వారా లేదా ఆఫర్లు, హెచ్చరిక ద్వారా గానీ నకిలీ లింక్/మెసేజ్ వస్తుందని, ఈ సమయంలో అప్రమత్తంగా వుండాలని, నిర్లిప్తంగా వుంటే సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల చాట్‌ను గమనించే వీలుంటుందని ఆమె వెల్లడించారు. గూగుల్ క్రోమ్, లేటెస్ట్ వర్షన్‌కు ఖాతాదారులు అప్‌డేట్ కావాలని ఆమె కోరారు. అనుమానంగా వుండే లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలియని వెబ్‌సైట్లలో లాగిన్ కావొద్దని ఆమె సూచించారు.

# కొనసాగుతున్న చలి తీవ్రత

### 14 జిల్లాలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

### సంగారెడ్డిలో 5 డిగ్రీలు, రంగారెడ్డిలో 6.9, వికారాబాద్‌లో 7 డిగ్రీల అత్యల్పం

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. శనివారంతో పోలి స్తే సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు కలిగిన జిల్లాల సంఖ్య కొంత తగ్గినా మొత్తం మీద 14 జిల్లాలలో పది లోపు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీలు, రంగారెడ్డిలోని మొయినాబాద్‌లో 6.9, వికారాబాద్‌లోని నవాబ్‌పేట్‌లో ఏడు డిగ్రీలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా వున్నాయి. ఆసిఫాబాద్‌లోని తిర్యాణిలో 7.2, ఆదిలాబాద్‌లోని భీంపూర్‌లో 7.6, మెదక్‌లోని ఎల్దుర్తిలో 7.9, కామారెడ్డిలోని గాంధారిలో 7.9, నిజామాబాద్‌లోని సాలూరాలో 8.5, సిద్దిపేట్‌లోని అక్బర్‌పేట్‌లో 8.9, మేడ్చల్‌లోని ఉప్పల్‌లో 9.1, నారాయణ్ పేట్‌లోని నారాయణ్‌పేట్ టౌన్‌లో 9.5, మహబూబ్‌నగర్‌లోని గండీడ్‌లో 9.8, సిరిసిల్లాలోని రుద్రంగిలో 9, జగిత్యాలలోని కతలాపూర్‌లో 10.1, మంచిర్యాల్‌లోని కొత్తపల్లిలో 10.2, భూపాలపల్లిలోని ముత్తారంలో 10.3, కరీంనగర్‌లోని కొత్తపల్లెలో 10.4, పెద్దపల్లిలోని రామగిరిలో 10.4, ములుగులోని గోవిందరావుపేట్‌లో 10.3, భువనగిరిలోని రాజాపేట్‌లో 10.6, నల్లగొండలోని చింతపల్లిలో 10.6, హనుమకొండలోని శాయంపేట్ లో 10.7, నాగర్‌కర్నూలులోని కల్వకుర్తిలో 10.8, జనగాంలోని బచ్చన్నపేట్‌లో 10.9, వనపర్తిలోని గోపాల్‌పేట్‌లో 11, మహబూబాబాద్‌లోని గంగారంలో 11.1, వరంగల్‌లోని నెక్కొండలో 11.2, హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలో 11.2, గద్వాలలోని ఈజాలో 11.3, కొత్తగూడెంలోని గుండాల లో 11.4, ఖమ్మంలోని ఎంకూరులో 12, సూర్యాపేట్‌లోని ముకుందాపురంలో 12.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సమయంలో సా ధారణ ఉష్ణోగ్రతలు 14.1 డిగ్రీల సగటున వుండాల్సి వుండగా 2.1 డిగ్రీలు తక్కువగా 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత యేడాది ఇదే సమయంలో 14.9 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో చలితీవ్రత మరోవారం రోజుల పాటు వుంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆరంజ్ అలర్ట్ వున్న జిల్లాలకు ఇది మరికొన్ని రోజులపాటు ఉంటుందన్నారు.

# విబిజి రామ్‌జి-2025 బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ బిల్లు-2025కు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదం తెలిపారు. నరేంద్రమోడీ సర్కార్ సంకల్పించిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లుపై ఆదివారం ముర్ము సంతకం చేశారు. దాంతో ఇరవై యేళ్లుగా కరవు పనిగా కొనసాగుతున్న ఎంజీ నరేగా చట్టం కనుమరుగవ్వనుంది. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా పలు సంస్కరణలకు రూపమిస్తున్న మోడీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొత్త పేరుతో కొనసాగించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 100 రోజులు ఉపాధి కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. మోడీ ప్రభుత్వం ఈ పథకం నుంచి గాంధీ పేరున తొలగించాలనే ఉద్దేశంతో కొత్త చట్టంతో వస్తోంది.

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్(గ్రామిణ్) బిల్లును ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. ఆదివారం ఆ బిల్లుపై ప్రెసిడెంట్



సంతకం చేశారు.

ఈ కొత్త స్కీమ్‌లో పనిదినాలతోపాటు వేతనం కూడా పెంచిన విషయం తెలిసిందే. ఇదివరకూ 100 రోజులున్న పని దినాలను 125కు, కనీస వేతనాన్ని కూడా రూ.240కి పెంచారు. అలానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల్లోనూ కీలక మార్పులు చేశారు. ఇంతకుముందు హిమాలయ పర్వత ప్రాంత రాష్ట్రాల్లో ఈ వాటా 90:10గా ఇతర రాష్ట్రాల్లో 75:25గా ఉండేది. ఇకనుంచి కేంద్ర, రాష్ట్రాలు ఖర్చులను 60:40 శాతంలో భరించనున్నాయి.

### మహాత్ముడి పేరు తొలగించడం మాత్రమే కాదు..

# 13 కోట్ల పేదల పొట్ట కొట్టే కుట్ర

### రోహతక్ కాంగ్రెస్ ఎంపి దీపేందర్ హుడా

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాకుండా ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దేశవ్యాప్తంగా ఉన్న 13 కోట్ల మంది పేదల పొట్ట కొట్టాలనే కుట్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోందని రోహతక్ ఎంపి దీపేందర్ హుడా ఆరోపించారు. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మధుయాష్కీ ప్రచార కమిటీ చైర్మన్, మెట్టు సాయి కుమార్ చైర్మన్, ఫిషర్మెన్ కమిటీ, సామరాంమోహన్ రెడ్డి మీడియా కమిటీ చైర్మన్, అల్లం భాస్కర్, సంధ్యా రెడ్డి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, లింగం యాదవ్ తదితరులతో కలిసి దీపెందర్ హుడావిలేఖరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేరు కోసం రాజకీయం చేస్తుందని అన్నారు. కోవిడ్ సమయంలో పనికి ఆహార పథకం సంజీవిని లాగ పని చేసిందని వ్యాఖానించారు. జీ రామ్ జీ కి గ్యారెంటీ లేదని ఆయన ఆవేదనచెందారు. యూపిఎ ప్రభుత్వం రోజ్ గార్ యోజనను పూర్తిగా కేంద్రం నిధులు కే టాయించింది బిజెపి ప్రభుత్వం జి.రామ్ జి పేరుతో రాష్ట్ర ల పై భారం మోపాలని చూస్తుందని ఆరోపించారు. గతంలో రాష్ట్రాలు పని దినాలు చూపించింది కానీ ఇప్పుడు కేంద్రమే పని దినాలు నిర్ధారిస్తుందని తెలిపారు. గ్రామ పంచాయతీ లకు ఇప్పుడు పనుల ఎంపిక హక్కులు ఉండవు కేంద్రం ఆధీనంలో ఉంటదనీ తెలిపారు. 90 : 10శాతం నిధులు కేంద్రం ఇచ్చేదని ఇప్పుడు 60:40 మించి నిధులు ఇవ్వదని తెలిపారు. రాష్ట్రాలకు నిధులు ఇవ్వదు కానీ అధికారం కేంద్రం చేతుల్లోనే ఉంటుంది క్రమేణా మన్రేగా పథకాన్ని తీసివేయలని చూస్తుంది కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మేము ఒప్పుకోము అని తెలిపారు. వందే మాతరం గీతాన్ని మార్చి కొత్త గీతాన్ని తీసుకరావాలని బిజెపి చూస్తుందని తెలి పారు. నేషనల్ హెరాల్డ్ పేరుతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. కానీ కోర్టు వాస్తవాలను గుర్తించిందని అన్నారు. 2015 లో డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వామి ప్రయివేట్ ఫిర్యాదుతో ఇడి, సిబిఐ కేసు నమోదు చేసిందిమని లాండరింగ్ జరిగిందని పదే పదే రెండు సంస్థలు కేసులో పెట్టి ఇబ్బంది పెట్టిందని ఆవేదన చెందారు. కేవలం రాజకీయ కక్షతోనే నేషనల్ హెరాల్డ్ కేసు పెట్టి ఇబ్బంది పెట్టారని అన్నారు. రాహుల్‌గాంధీ పోరాటం చేశా రనీ చివరకు ఇడిసిబిఐ కేసును తిరస్కరించింది చివరకు సత్యమే గెలిచిందని తెలిపారు.

# పవన్‌కల్యాణ్ సిఫారసుతో కొండగట్టుకు రూ.35 కోట్లు కేటాయింపు హర్షణీయం

### కేంద్రమంత్రి బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసుతో ఈ నిధులు మంజూరు కావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. దీని వల్ల కొండగట్టుకు వచ్చే భక్తు లకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు.

అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవల ఛార్జీలను పెంచి భక్తులపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభు త్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయా లని బండి సంజయ్ డిమాండ్ చేశారు. టిటిడి నిధులతో నిర్మించనున్న సత్రం పూర్తయితే కొండగట్టు దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# బుక్ 'ఫెయిర్'లోనూ అవకతవకలేనా?

### ఆర్థిక అక్రమాలపై గత కార్యవర్గం జవాబివ్వాలి

### 2014 నుంచి 22 వరకు అన్ని వివరాలు వెల్లడించాలి

### అందుకే వారి సభ్యత్వాలు నిలిపివేశాం: హెచ్‌బిఎఫ్

### ప్రస్తుత అధ్యక్షుడు యాకుబ్, ప్రధానకార్యదర్శి వాసు

**హైదరాబాద్(ముషీరాబాద్), డిసెంబరు 21, ప్రభాతవార్త:** జనరల్ బాడీ నిర్ణయం మేరకే హైదరాబాద్ బుక్ ఫెయిర్ గత కార్యవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారుల సభ్యత్వాలను తాత్కాలికంగా నిలిపివేయటం జరిగిందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రస్తుత అధ్యక్షులు కవి యాకుబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాలురెడ్డిలు స్పష్టం చేశారు. ఆదివారం బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆర్థిక వ్యవహారాల్లో 2014 నుంచి 2022 వరకు భారీ అక్రమాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై గత కార్యవర్గం స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. 1986 నుంచి కాచిగూడలో బీఓఐలో అధికారిక ఖాతా ఉండగా రిజిస్ట్రేషన్ లేకుండానే ది హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పేరుతో 2021లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో, 2016లో ఎస్‌బీఐలో కొత్త ఖాతాలు ఎందుకు తెరవవలసి వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఖాతాల నుంచి భారీ మొత్తంలో కన్వెన్షన్ సెంటర్‌కు చెల్లించటం, లక్షలల్లో డబ్బు ఉపసంహరణలు చేయటం, గతంలో నిర్వహించిన 8 ప్రదర్శనలకు సంబంధించి టిక్కెట్ల విక్రయాలు, ఫుడ్ స్టాల్స్ నుంచి వచ్చిన ఆదాయం బ్యాంకుల్లో ఎందుకు జమ కాలేదని నిలదీశారు. నిధుల దుర్వినియోగంపై మూడు సార్లు నోటీసులు ఇచ్చినా గత బాద్యులు స్పందించటలేదని, అందుకే జనరల్ బాడీ నిర్ణయం మేరకు వారి సభ్యత్వాలు తాత్కాలికంగా రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టటం జరిగిందని తెలిపారు. పదేళ్ల కాలంలో ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయలేదని, క్యాష్‌బుక్, వోచర్లు కూడా నూతన కార్యవర్గంకు అప్పగించలేదని మండిపడ్డారు. జిల్లాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయం బ్యాంకు రికార్డుల్లో కనిపించటం లేదని, కొత్త కార్యదర్శి ఎన్నికయినప్పటికీ పాత వారే సిగ్నేటరీలుగా కొనసాగటం ఆర్థిక నేరం కింద పరిగణించబడు తుందని అన్నారు. బుక్‌ఫెయిర్ కార్యా లయాన్ని గత అధ్యక్ష కార్యదర్శులు తమ సొంత అవసరాలకు వాడు కున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై వివరణ ఇవ్వాలని గత కమిటీ బాద్యులైన జూలూరి గౌరీ శంకర్, కోయ చంద్రమోహన్, పి.రాజేశ్వం రావులకు మూడుసార్లు లేఖరుల రాసినా స్పందించకపోగా, ఎదురు సమాజిక మాధ్యమాలలో ప్రస్తుత కమిటీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కమిటీ బాద్యులు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకుని అన్ని అనుమానాలను నివృత్తి చేయాలని, అన్ని రికార్డులను నూతన కమిటీకి అప్పగించాలని సూచించారు. ఇన్ని అనుమానాల నేపథ్యంలో కోయ చంద్రమోహన్‌కు చెందిన తెలంగాణ పబ్లికేషన్స్ కు స్టాల్ కేటాయించకపోవటం అప్రజాస్వామ్యం అంటూ ప్రచారం చేయటం, తెలంగాణపై వివక్ష అంటూ వ్యాఖ్యలు చేయటం హాస్యాస్పదమని, బుక్‌ఫెయిర్‌లో అన్ని ప్రాంగణాలకు తెలంగాణ కవులు, సాహితీ వేత్తల పేర్లు పెట్టి, తెలంగాణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఇప్పటికైనా గత కార్యవర్గం తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి, నిజాయితీ నిరూపించుకుంటే, వారికి స్టాల్ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకుబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి

# పోరాటానికి సిద్ధమవుతున్న ఆర్‌టిసి యూనియన్లు!

### గుర్తింపు ఎన్నికలే ప్రధాన అజెండా

### దాంతోపాటు ఇతర సమస్యలపై పోరాటం

### జెఎసిగా ఏర్పడిన కార్మిక సంఘాలు

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మిక సంఘాలు తమ సమస్యల పరిష్కారానికి సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)గా ఏర్పడ్డాయి. ఆర్‌టిసిలో గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలనే ప్రధాన ఎజెండాతో కార్మిక సంఘాలు ఉద్యమించడానికి సిద్ధమవు తున్నాయి. ఆర్‌టిసిలోని 6 కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్ప డ్డాయి. ఎంప్లాయిస్ యూని యన్(ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్(టిఎంయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు), ఎస్‌డబ్ల్యూఎఫ్, బహుజన కార్మిక యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్ సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కోసం ఆరు సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. సమావేశంలో పాలొనగన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జేఏసీ కార్యక్రమాలకు బయట నుండి మద్దతు ఇస్తామని ప్రకటిం చింది. ఆర్‌టిసి కార్మికులు నిత్యం ఎదురుకొంటున్న అధిక పని భారాలపై, వేధింపులపై, ప్రభుత్వ యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలపై, ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించాలని జేఏసీలో తీర్మానించారు. ప్రధాన డిమాండ్‌గా ఆర్‌టిసిలో యూనియన్లను పునరు ద్దరించడంపైనే పోరాటం చేయాలని జేఏసీ భావిస్తోంది. ఆర్‌టిసిలో గుర్తింపు యూనియన్ లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్‌టి సిలో యూనియన్లను పునరుద్ధరణ చేస్తామని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచినచంది. దాంతోపాటు పిఆర్‌సి పరిధిలోకి ఆర్‌టిసి కార్మికులను చేరుస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని ప్రకటించింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉద్యోగ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడిన సమయంలో ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతిస్తామని హామీ ఇచ్చారని సంఘాల నేతలు చెబుతున్నారు. ఖర్చు లేని పనైన యూనియన్లను పునరుద్ధరణ చేయకపోవడం వలన కార్మికులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. జేఏసీగా ఏర్పడిన సంఘాలే కాకుండా.. ఆర్‌టిసిలోని ఇతర సంఘాలు కూడా ఇవే సమస్యలపై వేర్వేరుగా పోరాటం చేయడానికి సిద్ధంగానే ఉన్నాయి. ఆర్‌టిసిలోని కార్మికుల ప్రధాన డిమాండ్స్‌లో గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను వేగంగా పూర్తి చేయడం. వీటితోపాటు ఇతర సమస్యలపై కూడా ఇటు జేఏసీ, అటు సంఘాలు వేర్వేరుగా ఉద్యమించడానికి సిద్ధమవుతున్నాయి.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా వరదలు, ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై ప్రభుత్వం, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థతో కలిసి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనుంది. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ కోసం రాష్ట్రంలోని కొన్ని జిల్లాలను ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాలోని అన్ని సంబంధిత శాఖల అధికారులు, అలాగే రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తారు. డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ఒకేసారి అన్ని జిల్లాల్లో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించి, వ్యవస్థల సామర్థ్యం, సమన్వయాన్ని పరీక్షి ంచనున్నారు.

వరదల మాక్ ఎక్సర్‌సైజ్‌కు ఎంపికైన ప్రదేశాలు1. ఖమ్మం జిల్లా మున్నేరు నది ఒడ్డున ఉన్న బొక్కలగడ్డ, ఖమ్మం పట్టణంప్రభుత్వ జనరల్ హాస్పిటల్ 2. వరంగల్ జిల్లారెడ్డిపురం / చిన్న వడ్డేపల్లి చెరువు 3. కామా రెడ్డి జిల్లా పెద్ద చెరువు జీఆర్ కాలనీ 4. నిజా మాబాద్ జిల్లా రఘునాథ చెరువు కిల్లా రామా లయం 5. మెదక్ జిల్లా దూప్‌సింగ్ తండా, హవేలీ ఘన్‌పూర్ మండలంబుర్గుపల్లి గ్రామం 6. మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణసాగర్ (కొత్త చెరువు) రామయ్య బావిమోడెం కుంట (యెను గొండ) దివిటిపల్లి (అమరరాజా ఇండస్ట్రీ సమీపంలో) ఏరియా హాస్పిటల్, జడ్చర్ల.7. హైదరాబాద్ జిల్లా నెక్లెస్ రోడ్, వ్యూపాయింట్ 8. సూర్యాపేట జిల్లా పెద్ద చెరువు, కోదాడ 9. భద్రాద్రి - కొత్తగూడెం జిల్లాబుర్గంపాడు గ్రామం గోదావరి నది, భద్రాచలం 10. నిర్మల్ జిల్లా_చిత్యాల వాగు11. జయశంకర్ - భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి వాగు12. హనుమకొండ జిల్లా రెడ్డిపురం చెరువు సమ్మయ్య నగర్, పారిశ్రామిక ప్రమాదం పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌కు ఎంపికైన ప్రదేశాలు1. సంగారెడ్డి జిల్లా ఔరోబిందో ఫార్మా లిమిటెడ్, బోరపట్ల, హత్నూర మండలం వినియోగించే రసాయనాలు: మెథనాల్, నాప్తలీన్, ఎథనాల్, ఎథైల్ అసిటేట్, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్ 2. మెడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ - హైదరాబాద్ స్మార్ట్ టెర్మినల్, ఐడీఏ ఫేజ్-3, చెర్లపల్లి ఇంధనాలు: మోటార్ స్పిరిట్, హెచ్‌ఎస్‌డీ, ఏటీఎఫ్, ఎథనాల్, బయోడీజిల్ 3.రంగారెడ్డి జిల్లానాట్కో ఫార్మా లిమిటెడ్, కెమికల్ డివిజన్, మెకగూడ, నందిగారసాయనాలు: అసిటోన్, మెథనాల్, ఐసో ప్రొపైల్ ఆల్కహాల్, మెథైల్ క్లోరైడ్, టోల్యూన్, హెక్సేన్, సైక్లో హెక్సేన్, ఎథైల్ అసిటేట్, హెచ్‌సీఎల్ గ్యాస్, సల్ఫ్యూరిక్ యాసిడ్, సోడియం హైడ్రాక్సైడ్, నైట్రిక్ యాసిడ్ 4. యాదాద్రి భువనగిరి జిల్లా డివిస్ ల్యాబొరేటరీస్, లింగోజిగూడెం, టోల్యూన్, మెథనాల్, ఆర్థో జైలిన్, క్లోరిన్, అమోనియా5. నల్గొండ జిల్లారెడ్డి ల్యాబ్స్, మిర్యాలగూరసాయనాలు: మెథాక్సీ డైబెన్జో అజెపిన్, సోడియం స్టియరిల్ ఫ్యూమరేట్, ఆక్సాకర్బాజెపిన్, ఇస్ట్రాడెఫైలిన్‌ఈ మాక్ ఎక్సర్‌సైజ్ సమయంలో ఎన్‌డిఎంఏ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలకులు లోపాలు, బలహీనతలు, సమన్వయ లోపాలను గమనించి నివేదిక సిద్ధం చేయనున్నారు.

ఉదయం 09:00 గంటల నుంచి 13:00 గంటల వరకు వరదల సన్నివేశం, రాత్రి వేళ సాయంత్రం 17:30 గంటల నుంచి 21:00 గంటల వరకు పారిశ్రామిక ప్రమాదాల సన్నివేశం ఎంపిక చేసిన పై జిల్లాలు, ప్రదేశాల్లో ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహిస్తారు.

# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేపర్-1 కీ విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** ఈ నెల 14న జరిగిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పేపర్-1కు సంబంధించిన కీ ఆదివారం విడుదల అయ్యింది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా పేపర్ 1 పరీక్షలకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు వుంటే ఈ నెల 24 తేదీ ఐదు గంటల లోపున ప్రతీ అభ్యంతరానికి 500 రూపా యలు గేట్ వే పేమెంట్ ద్వారా చెల్లించాలని శ్రీనివాస రావు తెలిపారు. అభ్యంతరాలు సరిగ్గా వుంటే డబ్బులను వెనక్కు చెల్లించడం జరుగుతుందని, సరైన పత్రాలు లేకుండా చేసే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని ఆయన తెలిపారు.

# హైడ్రా కమిషనర్ గన్‌మ్యాన్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, డిసెంబరు 21, ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ వద్ద గన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణ చైతన్య ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. హయత్ నగర్‌లోని తన నివాసంలో గన్‌తో కాల్చుకుని కృష్ణ చైతన్య ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. భార్యతో కలిసి హయత్ నగర్‌లో నివసిస్తున్న కృష్ణ చైతన్య తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కృష్ణ చైతన్య పరిస్థితి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే కామినేని ఆసుపత్రికి చేరుకుని వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణ చైతన్యకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. చికిత్సకు హైడ్రా సంస్థ పూర్తిస్థాయిలో సహాయం చేస్తుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కాగా, ప్రాథమిక సమాచారం ప్రకారం.. రెండేళ్ల క్రితం బెట్టింగ్, గేమింగ్ యాప్స్ పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. అప్పుల భారం పెరగడంతో తీసుకున్న లోన్లకు జీతం ఎక్కువగా కట్ అవుతూ రావడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఈ ఒత్తిడే అతన్ని ఆత్మహత్య యత్నానికి దారి తీసినట్లు భావిస్తున్నారు. ఇదివరకే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కృష్ణ చైతన్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆయన తండ్రి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. అలాగే గతంలో ఒత్తిడి, ఆరోగ్య సమస్యల కారణంగా తలలో రక్తం గడ్డకట్టడంతో చికిత్స తీసుకున్నట్లు తెలుస్తోంది. విధుల పరంగా కృష్ణ చైతన్య ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనలేదని అధికారులు స్పష్టం చేశారు. అధికారులతో పాటు ఇతర సిబ్బందితో కూడా మర్యాదగా, గౌరవంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. విధుల విషయంలో అప్రమత్తంగా, క్రమశిక్షణతో ఉన్న వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కృష్ణచైతన్య ఆరోగ్యంపై కామినేని ఆసుపత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. అతడికి న్యూరోసర్జన్లు డాక్టర్ ఎం.ఎ.జలీల్, డాక్టర్ సాయిశివ నేతృత్వంలో శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. పుర్రెకు, మెదడుకు తీవ్రమైన పగుళ్లు ఉన్నట్లు నిర్ధారించామని వైద్యులు పేర్కొన్నారు. ఇంటెన్సివ్ న్యూరో క్రిటికల్ కేర్‌లో చికిత్స పొందుతున్నాడని, 48 గంటలు అతడిని అబ్జర్వేషన్‌లోనే ఉంచుతామని వైద్యులు ప్రకటించారు.



# చొరబాటుదారులపైనే వారికి ప్రేమ

అసోమీయులపై పక్షపాతం అందుకే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గాలికొదిలేశారు

భూపేన్ హజారికాను అవమానించారు

కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ తీవ్ర ఆరోపణలు

నమ్రూప్‌లో ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభించిన ప్రధాని




**గువహటి, డిసెంబరు 21:** కాంగ్రెస్‌కు అసోమీలపై ప్రేమ, గౌరవం లేదు, దానికి బదులుగా చొరబాటుదారులపై అమితమైన ప్రేమను చూపుతున్నారని, అందుకే ఆ పార్టీ ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఉదయం అసోంలోని నమ్రూప్‌లో ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ అసోం, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని గాలికొదిలేసిందని, వ్యతిరేకించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ జాతి వ్యతిరేక ఆలోచనలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. అసోం గుర్తింపు, గౌరవాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఉక్కు కవచంలా అండగా నిలుస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. 'కాంగ్రెస్ బుజ్జగింపు, ఓటు బ్యాంకు" అనే ఈ విషం నుండి మనం అసోంను రక్షించాలని మోడీ పిలుపునిచ్చారు. "బిజెపి ప్రభుత్వం సంగీత దిగ్గజం భూపేన్ హజారికాకు భారతరత్న ఇచ్చి సత్కరిస్తే, కాంగ్రెస్ ఆ అసోం ఆరాధ్యుడిని అవమానించింది. అసోంలోని నాగావ్ జిల్లాలో సెమీకండక్టర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్న తమ నిర్ణయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది' అని అన్నారు. 'అసోం జనాభా స్వరూపాన్ని నాశనం చేసిన చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. ఎందుకంటే ఆ చొరబాటుదారులే ప్రతిపక్ష పార్టీకి ఓటు బ్యాంకు. అసోం ప్రజల హక్కులను పరిరక్షించడానికి బిజెపి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది" అని ప్రధాని మోడీ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని స్థానిక ప్రజలను రక్షించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. 'అసోంతోపాటు మొత్తం ఈశాన్య ప్రాంతాలకు శుభదినం. నమ్రప్, దిబ్రుగఢ్ చాలా కాలంగా ఎదురుచూస్తున్న కల నిజమవుతోంది' అని అన్నారు.

ఈ ప్రాంతంలో పారిశ్రామిక పురోగతిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని మోడీ అన్నారు. "అసోం అభివృద్ధిలో కొత్త వేగాన్ని చేరుకుందని, మీరు ఇప్పుడు అనుభవిస్తున్నది ప్రారంభం మాత్రమే.. ఈ ఆధునిక ఎరువుల కర్మాగా రాన్ని ప్రారంభించడం రైతు సోదరులందరికీ ఎంతో ఉపయోగం. బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో పరిశ్రమలు, కనెక్టివిటీ ఈ సహకారం అసోం కలలను నెరవేరుస్తోంది. యువత కొత్త కలలు కనేలా ప్రేరేపిస్తోంది" అని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో దేశ రైతులు, ఆహార ప్రదాతలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. అందువల్ల, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఎన్డీయే ప్రభుత్వం పగలు, రాత్రి కృషి చేస్తోంది. నమ్రప్‌లోని ఈ యూనిట్ వేలాది కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. అంతకుముందు గువహటిలోని స్మారక క్షేత్రంలో చారిత్రాత్మక అసోం ఉద్యమ అమరవీరులకు ప్రధాని మోడీ నివాళి అర్పించారు. ఇది రాష్ట్ర ప్రజలకు ఒక భావోద్వేగ క్షణంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. 1979లో ప్రారంభమైన ఆరేళ్ల విదేశీ వ్యతిరేక ఉద్యమంలో అమరవీరుడైన ఖర్గేశ్వర్ తలుక్దార్ విగ్రహానికి ప్రధాని మోడీ పూలమాల వేసి నివాళి అర్పించారు. అసోం గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షించ డానికి ఆయన చేసిన కృషి, త్యాగాలను మోడీ స్మరించుకున్నారు. అనంతరం అమరవీరుల గ్యాలరీని ప్రధాని సందర్శించారు. ఆ తర్వాత బ్రహ్మపుత్ర నదిపై 'చరాయిదేవ్' అనే క్రూయిజ్ నౌకలో అసోంలోని వివిధ ప్రాంతాల నుండి ఎంపిక చేసి 25 మంది విద్యార్థులతో ప్రధాని మోడీ ముచ్చటించారు.

## ఇక చాలు.. అబద్ధాలు చెప్పడం ఆపండి

ప్రధాని ఆరోపణలపై కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** స్వాతంత్ర్యానికి ముందు అసోంను పాకిస్తాన్‌కు అప్పగించాలని కాంగ్రెస్ కుట్ర చేసిందని ప్రధాని మోడీ ఆరోపించారు. అసోంను పూర్వపు తూర్పు పాకిస్తాన్‌లో భాగం చేయడానికి ముస్లిం లీగ్, బ్రిటిస్ వారితో చేతులు కలపడానికి సిద్ధమవడం ద్వారా కాంగ్రెస్ పాపం చేసిందని ఆరోపించారు. ఈయితే, ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ఎంపి మాణికం ఠాగూర్ స్పందించారం. ఈ ఆరోపణల్ని ఎక్స్‌వేదికగా ఖండించారు. అసోంను పాకిస్తాన్‌కు అప్పగించే ప్రతిపాదన లేదని అన్నారు. అసోం హిందూ మెజారిటీ ప్రావిన్స్ అని, విభజన ప్రణాళికలో పాకిస్తాన్ భాగంగా అసోం లేదని, అసోంలోని సిల్హెట్ జిల్లా ముస్లిం మెజారిటీ ప్రాంతం అని అన్నారు. ఇప్పుడు సిల్హెట్ జిల్లా బంగ్లాదేశ్‌లో భాగంగా ఉంది. జులై 1947లో బ్రిటిష్ అధికారంలో ఉన్న సిల్హెట్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ఆ తర్వాత అది తూర్పు బెంగాల్‌లో ఆ తర్వాత తూర్పు పాకిస్తాన్‌లో భాగమైందని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ నిర్ణయం కాదని గోపీనాథ్ బోర్డోలోయ్ ప్రయత్నాల కారణంగా కరీంగంజ్ సబ్ డిస్ట్రిక్ భారత్‌లోనే ఉంచబడిందని చెప్పారు. మోడీ శిక్షణ పొందిన ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని, అబద్దాలు వ్యాప్తి చేయడం ద్వారా జీవిస్తున్నారని అన్నారు.

## శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలు

విదేశాంగ మంత్రి జైశంకర్



**పుణె, డిసెంబరు 21:** రామాయణ, మహాభారతాలు కేవలం మత గ్రంథాలు మాత్రమే కాదని, ప్రపంచ రాజకీయాలు, దౌత్యానికి విలువైన పాఠాలను అందించే లోతైన మార్గదర్శకాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పుణె బుక్‌పెయిర్‌కు హాజరై చర్చావేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దౌత్యం నుండి చర్చ వరకు అనే అంశంపై జైశంకర్ మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలకు, బహుళ ధ్రువ ప్రపంచానికి మధ్య పోలికలను ఈ సందర్భంగా ఎత్తిచూపారు. ప్రపంచ దేశాలు, భాగస్వామ్యాల పట్ల భారతదేశ విధానాన్ని దాని జాతీయ ప్రయోజనాలే నిర్దేశిస్తాయని జైశంకర్ నొక్కి వక్కాణించారు. దౌత్యవేత్తల విధుల గురించి మాట్లాడుతూ.. తన దృష్టిలో శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలని పేర్కొన్నారు. భారత్‌కు వ్యూహాత్మక రాజకీయాలు, రాజ్య నిర్వహణ తెలియవని అనేకమంది విదేశీ రచయితలు పుస్తకాలలో రాసిన వ్యాఖ్యలను పదేపదే చదివి విసిగిపోయానని అన్నారు. మనమంతా సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పాటిస్తూ పెరిగామని జైశంకర్ చెప్పారు. ఇవన్నీ విదేశీయులకు తెలియవు కాబట్టి.. ఎన్నో ఏళ్లుగా భారత్ పాటిస్తున్న రాజనీతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నట్లు తెలిపారు. రామాయణంలోని ప్రజాపాలన, సంక్లిష్ట పరిస్థితులు, రాజకీయ వ్యూహాలు మన పరిపాలనా విధానాలను తెలియజేస్తాయన్నారు. ఆ సమయంలో హనుమంతుడు దౌత్యవేత్తగా తన విధులను ఎంతో చక్కగా నిర్వహించాడని చెప్పారు. సీతకు సంబంధించిన సమాచారం తీసుకురమ్మని ఒక్క పనిమీద లంకకు పంపితే.. అక్కడికి వెళ్లిన హనుమంతుడు పది పనులు చేసుకువచ్చాడని, సీతలో మనోధైర్యాన్ని, రావణుడిలో భయాన్ని నింపాడని జైశంకర్ అన్నారు. అదేవిధంగా మహాభారతంలో శ్రీకృష్ణుడు కూడా కౌరవులు, పాండవుల మధ్య సంధి కోసం ప్రయత్నించాడని, యుద్ధంలో ధర్మంవైపు నిలబడ్డాడని చెప్పారు. అంతకంటే గొప్ప దౌత్యవేత్తలను మనం ఇంకెక్కడ చూడగలమని ప్రశ్నించారు. వారిని ఆదర్శంగా తీసుకుని తాను కూడా ప్రధాని మోదీ నాయకత్వంలో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ యువరాజ్ మాలిక్, కేంద్ర మంత్రులు మురళీధర్ మోహోల్, చంద్రకాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్‌ను రాజకీయ కోణంలో చూడొద్దు

బిజెపితో ముడివేయడం పెద్దపొరపాటు

హిందూ సమాజ శ్రేయస్సే సంస్థ లక్ష్యం: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టీకరణ




**కోల్‌కతా, డిసెంబరు 21:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎలాంటి రాజకీయ ఉద్దేశంతో నడవడం లేదని, లేదా ఏదైనా రాజకీయ సమస్యకు ప్రతిస్పందనగా కూడా ప్రారంభం కాలేదని ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. భారత దేశం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందేలా, విశ్వగురు భారత్ గా ఎదగడానికే సంఘ్ స్థాపన జరిగిందన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం కలకత్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ గురించి చాలామందిలో అపోహలు ఉన్నాయని అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను బిజెపితో ముడివేయడం పెద్ద తప్పు అని స్పష్టం చేశారు.

బిజెపిలో అనేక మంది నాయకులు ఆర్ఎస్ఎస్ నుంచి వెళ్లినవాళ్లే అని, అంతమాత్రాన ఆర్ఎస్ఎస్‌ను బిజెపితో కలిపి చూడడం పొరపాటు అని అభిప్రాయ పడ్డారు. సంఘ్ ఎవరి పట్ల విరోధభావంతో పనిచేయదని, హిందూ సమాజ ఐక్యత, సౌహార్ద్రత కోసమే పనిచేస్తుందని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. చాలామందికి ఆర్ఎస్ఎస్ అనే పేరు మాత్రమే తెలుసని, కానీ ఆర్ఎస్ఎస్ ఎలాంటి కార్యకలాపాలు నిర్వర్తిస్తుందో తెలియదని అన్నారు. సంఘ్ అభివృద్ధి చెందడం కొందరికి నచ్చని విషయం అని వ్యాఖ్యానించారు. కేవలం హిందూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని భగవత్ ఉద్ఘాటించారు.

సంఘ్ గురించి ఏర్పడే అభిప్రాయాలు తరుచుగా మూడో పక్షం ద్వారా వ్యాప్తి అయ్యే తప్పుడు కథనాలపై ఆధారపడి వుంటోందని, అలా కాకుండా ప్రజలు సంఘ్‌ను అవగాహన చేసుకోవాలని, దాని వచ్చిన వాస్తవాలపై అర్థం చేసుకోవాలని సూచించారు. అంతేగానీ పుకార్లు, అపోహలను ఆధారంగా చేసుకొని సంఘ్‌ను అర్థం చేసుకోవద్దని కోరారు.

హిందూ సమాజాన్ని సంఘటితం చేయడానికే సంఘ్ స్థాపన జరిగిందని భాగవత్ పునరుద్ఘాటించారు. అంతేగానీ ఎవ్వరికీ వ్యతిరేకంగా స్థాపించలేదని స్పష్టం చేశారు.

సంఘ్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, దేశమే తొలి ప్రాధాన్యం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ కార్యకర్తలు పనిచేస్తున్నారని ఆయన చెప్పారు.

సంఘ్ చేస్తున్న ఈ కృషితో భారత్ మళ్లీ విశ్వగురువుగా మారుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. భారతదేశ సనాతన సంస్కృతీ విలువలకు కట్టుబడి ఉండటం, స్వదేశీని ప్రోత్సహించడం వంటివి జాతి నిర్మాణం, జాతి భద్రతకు అనివార్యమని అన్నారు. పేదల అభ్యున్నత, హిందూ సమాజ పరిరక్షణకు సంఘ్ పనిచేస్తోందని చెప్పారు.

## భరణం కోసం అనారోగ్యం నాటకమన్న భార్య


పక్షవాతంతో ఉన్న భర్త స్ట్రెచర్‌పై కోర్టుకు హాజరు

భార్య ఆరోపణలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన కోర్టు

**లక్నో,డిసెంబరు 21:** భరణం చెల్లించకుండా తప్పించుకునేందుకు భర్త అనారోగ్యం నాటకం ఆడుతున్నాడని భార్య ఆరోపించడంతో ఆ వ్యక్తిని స్ట్రెచర్‌పై కోర్టుకు కుటుంబం తరలించింది. పక్షవాతంతో మంచానికి పరిమితమైన అతడి పరిస్థితిని కోర్టుకు చూపించింది. ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక జంట వివాహం నెలలోనే విచ్ఛిన్నమైంది. దీంతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. భరణం కోరుతూ కాన్పూర్ ఫ్యామిలీ కోర్టును ఆమె ఆశ్రయించింది. కాగా, ఐదేళ్ల కిందట ఆ వ్యక్తికి పక్షపాతం వచ్చింది. దీంతో మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఉన్న అతడు పూర్తిగా మంచానికి పరిమితమయ్యాడు. సంరక్షణ కోసం పూర్తిగా తన కుటుంబంపై ఆధారపడ్డాడు. అయితే తన భర్త ఆరోగ్యంగా ఉన్నాడని, పని చేయగలడని భార్య కోర్టుకు తెలిపింది. భరణం చెల్లించకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగా అనారోగ్యంతో ఉన్నట్లు నటిస్తున్నాడని కోర్టులో ఆరోపించింది. మరోవైపు భార్య ఆరోపణలపై భర్త కుటుంబం కలత చెందింది. హాస్పిటల్‌లో ఉన్న అతడ్ని అంబులెన్స్‌లో కోర్టుకు తరలించారు. స్ట్రెచర్‌పై కోర్టు హాలులో హాజరుపరిచారు. ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని నిర్ధారించే వైద్య నివేదికలు, సర్టిఫికెట్లు, ఇతర ఫొటోలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి, న్యాయవాదులు, కోర్టులో ఉన్న వారిని ఇది దిగ్భ్రాంతికి గురిచేసింది.

భార్య ఆరోపణలపై కోర్టు అసం తృప్తి వ్యక్తం చేసింది. నిర్ధారణ కోసం ఆ వ్యక్తికి వైద్యపరీక్షలకు ఆదేశించింది. అయితే పక్షవాతంతో మంచానికి పరిమితమైన భర్తను చూసేందుకు భార్య ఒక్కసారి కూడా ఇంటికి రాలేదని అతడి కుటుంబం ఆరోపించింది. అతడి ఆరోగ్యం కోసం గత ఐదేళ్లుగా చాలా ఖర్చు చేసినట్లు సోదరి వాపోయింది. ఆ వ్యక్తిని స్ట్రెచర్‌పై కోర్టుకు తరలించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## భూమివైపు దూసుకొస్తున్న స్టార్‌లింక్ శాటిలైట్



**న్యూయార్కు, డిసెంబరు 21:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్టు లోని ఉపగ్రహాల్లో ఒకటి అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపు వస్తున్నది. ఈ నెల 17న భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న శాటిలైట్ 35956 హఠాత్తుగా అక్కడి నుంచి జారిపోవడం మొదలైంది. స్పేస్ఎక్స్ దానిపై నియంత్రణ కోల్పోయింది. ఆ తర్వాత ఆ సంస్థ దీనిపై వివరణ ఇచ్చింది. హఠాత్తుగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడింది. దాంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలుగా విడిపోయి మెల్లగా జారుతున్నాయి. వారం రోజుల్లోగా అవి భూవాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చు అని స్పేస్ఎక్స్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఆ ఉపగ్రహానికి సంబంధించిన శకలాలు అమెరికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వరల్డ్‌వ్యూ3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎలాంటి ముప్పు లేదని స్పేస్ఎక్స్ చెబుతోంది. ప్రస్తుతం అది ఐఎస్ఎస్ కంటే కిందే ఉందని వెల్లడిం చింది. అది లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ఉండటంతో భూగురుత్వాకర్షణ శక్తి దానిని సులువుగా లాగే స్తుందని తెలిపింది. అవి వాతావరణ ఘర్షణతో కాలిపోయే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం స్టార్‌లింక్ ప్రాజెక్టు కింద 9,000 ఉపగ్రహాలను స్పేస్ఎక్స్ అంతరిక్షంలోకి పం పింది. దాంతో భూమిపై మారుమూల ప్రాం తాలకు ఇంటర్నెట్‌ను సరఫరా చేయగలు గుతోంది.

## దీపూదాస్ మతపరమైన ఆరోపణలు చేయలేదు

హిందూ యువకుడి హత్యలో ప్రాథమిక విచారణ

**ఢాకా, డిసెంబరు 21:** బంగ్లాదేశ్‌లో ఇటీవల మత విద్వేషం ముసుగులో జరిగిన హిందూ యువకుడి దారుణ హత్య ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ హత్యకు కారణమని చెబుతున్న మత దూషణ ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని ప్రాథమిక విచారణలో తేలింది. ఈనెల 18 రాత్రి మైమెన్‌సింగ్‌లో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని ఒక ఉన్మాద మూక అత్యంత క్రూరంగా కొట్టి చంపింది. ఇస్లాం మతాన్ని కించపరిచాడంటూ తన ఫ్యాక్టరీలోని ఒక సహోద్యోగి చేసిన ఆరోపణలతో ఈ హింస మొదలైంది. ఆవేశంతో వచ్చిన మూక దీపును చంపి, మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి నిప్పుపెట్టింది. ఈ ఘటనపై బంగ్లాదేశ్ పత్రిక ది డైలీ స్టార్ తో మాట్లాడిన రాబ్14 కంపెనీ కమాండర్ మహ్మద్ సంసుజ్జమాన్ సంచలన విషయాలు వెల్లడించారు. దీపు చంద్రదాస్ తన సోషల్ మీడియాలో మతపరమైన భావాలను దెబ్బతీసేలా ఎలాంటి పోస్టులు చేయలేదని స్పష్టం చేశారు. దీపు మతాన్ని విమర్శించడం మేము స్వయంగా విన్నామని చెప్పే ఒక్క వ్యక్తి కూడా అక్కడ లేరని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీలో గొడవ జరుగుతున్నప్పుడు, ఫ్యాక్టరీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో అతడిని బలవంతంగా బయటకు నెట్టేశారని, ఆ తర్వాతే ఈ ఘోరం జరిగిందని అధికారి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇప్పటివరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వచ్చిన సమాచారంతో మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం 10 మందిని పోలీసులు విచారిస్తున్నట్లు ఏఎస్పీ మహ్మద్ అబ్దుల్లా అల్ మామున్ తెలిపారు. ఈ దారుణ హత్యపై ఉత్తర అమెరికా హిందూ కూటమి తీవ్రంగా స్పందించింది. బంగ్లాదేశ్ ఆటవిక రాజ్యం వైపు వెళ్తోంది. హిందువులపై ఇంతటి హింస జరుగుతున్నా అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాలు మౌనంగా ఉండటం శోచనీయమని ఆ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది.



## పాక్‌కు 700 మిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు సాయం




అప్రమత్తమైన భారత్!

**వాషింగ్టన్, డిసెంబరు 21:** పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు భారీ సాయాన్ని ఆమోదించింది. 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లోని ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టేందుకు, అలాగే సేవారంగాన్ని పెంపొందించేందుకు వరల్డ్ బ్యాంక్ రుణ సదుపాయాన్ని కల్పించినట్లు సమాచారం. పబ్లిక్ రీసోర్స్ ఫర్ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ మల్టీఫేజ్ ప్రోగ్రామాటిక్ అప్రోచ్ (పిఆర్ఐడి-ఎంపిఎ)లో భాగంగా మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయాన్ని వరల్డ్ బ్యాంకు అప్రూవల్ చేసినట్లు డాన్ ప్రతిక కథనం ద్వారా వెల్లడవుతోంది. ఇందులో 600 మిలియన్ డాలర్లకు ఫెడరల్ లెవెల్ ప్రోగ్రామ్స్‌కు అలాగే 100 మిలియన్ డాలర్లు సింధ్ రాష్ట్రంలోని అభివృద్ధి పనులకు కేటాయించింది.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ధాటికి పాకిస్థాన్ అతలాకుతలం అయిన విషయం తెలిసిందే. అలాగే పాక్‌పై భారత్ అనేక కఠిన ఆంక్షలు విధించింది. సింధూ జలాల నిలిపివేతతోపాటు ఇరు దేశాల మధ్య వాణిజ్యం నిలిచిపోయింది. అలాగే పలు ఇతర కారణాలతో పాకిస్థాన్ ఆర్థిక రంగం దెబ్బతిన్నది. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు వరల్డ్ బ్యాంకు మొత్తం 1.35 బిలియన్ డాలర్ల సాయాన్ని ప్రకటించింది. దానిలో భాగంగా తాజాగా 700 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆమోదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఇక ఇటీవల పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం ఈ యేడాది ఆగస్టులో 47.9 మిలియన్ డాలర్లు సాయం చేసింది. తాజాగా వరల్డ్ బ్యాంక్ మరో 700 మిలియన్ డాలర్లు ఆమోదించింది. ఈ విషయాన్ని పాకిస్థాన్‌లోని వరల్డ్ బ్యాంకు ఆఫీసర్ బోలోర్మా అంగాబజార్ ధ్రువీకరించారు. పాకిస్థాన్‌లో సమీకృత, సుస్థిర అభివృద్ధి కోసం దేశీయంగా ఉన్న రీసోర్స్‌లను సమర్థవంతంగా వినియోగించి మెరుగైన ఫలితాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 'స్మార్ట్' కళ్లజోడుతో అనంతపద్మనాభుని ఆలయంలోకి!

విడియో షూట్‌కు యత్నించడంతో అదుపులోకి తీసుకొన్న పోలీసులు



**తిరువనంతపురం, డిసెంబరు 21:** కేరళలోని తిరువనంతపురం శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో కలకలం రేగింది. స్మార్ట్ కళ్లజోడు పెట్టుకుని ఆలయంలోకి ప్రవేశించిన విదేశీ భక్తుడు దాని సాయంతో లోపలి రికార్డు చేసేందుకు ప్రయత్నించాడు. దీన్ని గమనించిన భద్రతా సిబ్బంది అప్రమత్తమై అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న శనివారం ఉదయం జరిగిన ఈఘటనలో నిందితుడిని సింగపూంలోని నార్త్‌షోర్ డ్రైవ్‌కు చెందిన తిరునీపనార్ (49)గా గుర్తించారు. తిరునీపనార్‌ను శ్రీలంక సంతతికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయంలోకి శనివారం ఉదయం 9.25 గంటల సమయంలో తిరునీపనార్ కెమెరా అమర్చిన స్మార్ట్ కళ్లజోడు ధరించి ప్రవేశించాడు. తర్వాత లోపల విడియో రికార్డు చేయడం మొదలుపెట్టాడు. ఆలయ ఉత్తరంవైపు, తులాభారం మండపం సహా ఇతర ప్రదేశాలను విడియోలో బంధించాడు. అతడి చర్యలను గుర్తించిన సెక్యూరిటీ వెంటనే అప్రమత్తమై అదుపులోకి తీసుకుంది. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఆలయ అధికారుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి వదిలిపెట్టిన పోలీసులు ఈ నెల 21న విచారణకు రావాలని ఆదేశించారు. శ్రీలంక సంతతికి చెందిన తిరునీపనార్ కేరళలోని పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే, పద్మనాభస్వామి ఆలయంలో ఇలాంటి సంఘటన జరగడం ఇదే మొదటిసారి కాదు. ఈ యేడాది జూలైలో గుజరాత్‌కు చెందిన సురేంద్ర షా అనే వ్యక్తి ఆలయం లోపలి విడియో తీయడానికి ప్రయత్నించడంతో భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. కుటుంబంతో కలిసి ఆలయ సందర్శనకు వచ్చిన అతడు స్మార్ట్ కళ్లజోడు పెట్టుకుని ప్రవేశించాడు. కాగా, 8వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో టన్నులకొద్దీ బంగారం, వజ్రాలు, విగ్రహాలు 2011లో బయట పడటంతో ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆలయ నేలమాళిగలోని ఆరు గదుల్లో అపార సంపదలు బయటపడ్డాయి. అయితే, ఐదు గదులను తెరవగా ఆరో గది మాత్రం తెరవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ గది తలుపులపై నాగబంధనం ఉందని, తెరిస్తే అరిష్టమనే ప్రచారం కూడా జరిగింది.

## సంక్షిప్తంగా..

### హోంగార్డ్ ఉద్యోగాలకు ఎంబిఎ, ఎంసిఎ పట్టభద్రులు



**భువనేశ్వర్, డిసెంబరు 21:** ఒడిశా పోలీసుశాఖ 187 హోంగార్డ్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నిర్వహించిన రాత పరీక్షకు ఎంబిఎ, ఎంసిఎ పట్టభద్రులు కూడా హాజరయ్యారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. బిజెపిపాలిత రాష్ట్రంలో నిరుద్యోగు దుస్థితి ఇలా ఉందని దుయ్యబట్టింది. చేతిలో డిగ్రీలు ఉన్నా, కొలువులు మాత్రం లేవంటూ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేసింది. డబుల్ ఇంజిన్ సర్కారు తీరు ఇలా ఉందని వ్యాఖ్యానించింది. సంభల్‌పూర్‌లో ఈ నెల 16న జరిగిన ఈ పరీక్షకు సుమారు 8,000 మంది హాజరయ్యారు. అభ్యర్థులను అదుపు చేసేందుకు ప్రత్యేక బలగాలను రప్పించాల్సి వచ్చింది. సంభల్‌పూర్‌లోని ఒక ఎయిర్‌బేస్ రన్‌వేపై వారికి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది.

### పబ్‌పై సాయుధ దుండగుల దాడి: 9 మంది మృతి



**జోహాన్స్‌బర్గ్, డిసెంబరు 21:** అర్ధరాత్రి సమయంలో సాయుధులైన 12 మంది దుండగులు రెండు వాహ నాల్లో వచ్చి బీభత్సం సృష్టించారు. ఓ పబ్ లో చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 9 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 10 మంది గాయపడ్డారు. దక్షిణాఫ్రికా లోని జొహాన్స్‌బర్గ్ వెస్ట్ ప్రాంతంలోగల బెకర్స్‌డాల్ టౌన్‌షిప్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దుండగులు పబ్‌లో చొరబడి ఒక్కసారి కాల్పులు మొదలు పెట్టడంతో భయాందోళనకు గురైన జనం పరుగులు తీశారు. పబ్‌లో కాల్పుల అనంతరం దుండగులు పారిపోతూ కూడా కనిపించిన వారిపై కాల్పులు జరిపారు. వీధుల్లో కూడా కాల్పులు జరుపుతూ పారి పోయారు. ఈ కాల్పుల్లో మరణించిన 9 మందిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు.

### పాస్‌పోర్టు వ్యక్తిగత స్వేచ్ఛలో ఒక భాగం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబరు 21:** విదేశీయానం,పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండటం అనేవి భారత రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులో భాగమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ హక్కులపై ఏమైనా ఆంక్షలను విధించాలంటే, అవి తప్పనిసరిగా న్యాయంగా, నిష్పక్షపాతంగా, సహేతుకంగా ఉండాలని చెప్పింది. చట్టబద్ధంగా ఆమోదయోగ్యమైన కారణం ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 19న ఈ తీర్పునిచ్చింది. చట్టానికి లోబడి ఒక చోటు నుంచి మరొక చోటుకు ప్రయాణించేందుకు, జీవనోపాధి, అవకాశాలను పొందేందుకు పౌరునికి గల స్వేచ్ఛ అధికరణ 21ప్రకారం ఇచ్చిన హామీలో ముఖ్యమైన భాగమని వివరించింది. పారిశ్రామికవేత్త మహేశ్ కుమార్ అగర్వాల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ తీర్పునిచ్చింది. 2023 ఆగస్ట్ 28న తన పాస్‌పోర్ట్ గడువు ముగిసిందని, దానిని రెన్యువల్ చేయాలని పిటిషనర్ కోరారు. ఓ కేసులో దోషిగా ఉన్న ఆయన బెయిల్‌పై ఉన్నారు. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం సంబంధిత కోర్టుల నుంచి ఆయన నిరభ్యంతర పత్రాలను పొందారు. అయినప్పటికీ రెన్యువ ల్‌ను అధికారులు తిరస్కరించారు.

### బంగ్లాలో బిఎన్‌పినేత ఇల్లు దగ్ధం: చిన్నారి సజీవదహనం



**ఢాకా, డిసెంబరు 21:** బంగ్లాదేశ్‌లో అరాచకం హద్దులు దాటుతోంది. రాజకీయ కక్షల వల్ల ఒక పసి ప్రాణం బలవగా, ఒక కుటుంబం మొత్తం ప్రాణాపాయ స్థితిలో ఉంది. లక్ష్మీపూర్ సదర్ ఉపజిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన సంచలనం సృష్టిస్తోంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత, వ్యాపారవేత్త బేలాల్ హుస్సేన్ నివాసమేలక్ష్యంగా దుండగులు ఈ దాడికి పాల్పడ్డారు. తెల్లవారు జామున అందరూ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘాతుకం జరిగింది. దుండగులు పథకం ప్రకారం ఇంటికి ఉన్న రెండు తలుపులకు బయట నుంచి తాళం వేశారు. అనంతరం ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీనివల్ల లోపల ఉన్న వారు బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. ఈ అగ్నిప్రమాదంలో బేలాల్ హుస్సేన్ ఏడేళ్ల కుమార్తె అయేషా అక్తర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైంది.

### పనికంటే తిండిపైనే శ్రద్ధ పెడుతోందని కోర్టుకెక్కిన యువకుడు

**బీజింగ్, డిసెంబరు 21:** చైనాలో ఓ యువకుడు తన మాజీ ప్రియురాలు, ఫియాన్సీని కోర్టుకీడ్చాడు. తనతో కలిసి ఉన్నప్పుడు ఆమె తిండి కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశానని, ఆ సొమ్మంతా తిరిగిప్పించాలని కోరాడు. ఈ మేరకు కోర్టులో దావా వేశాడు. రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలో పెట్టిన ఖర్చు, కొనిచ్చిన వస్తువులతో ఇరువురూ భావోద్వేగ బంధాన్ని కలిగి ఉంటారని గుర్తుచేస్తూ, ఆ సొమ్ము తిరిగివ్వమనడం సరికాదని పేర్కొంటూ పిటిషన్ కొట్టేసింది. బ్రైడ్ ప్రైస్ కింద యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్ములో సగం తిరిగివ్వాలని మాజీ ప్రియురాలిని కోర్టు ఆదేశించింది.

# ఎస్వీ మెడికల్ కళాశాల భూ బదలాయింపులు

# మెడికల్ సీట్లు పెరిగితే పరిస్థితి ఏంటి?




చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి భవన సముదాయము

● కాలేజీ అధికారులు అందోళన ● తక్షణమే భూ బదలాయింపు ఆపండి ● తహసీల్దార్‌కు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశం

చంద్రగిరి, డిసెంబరు 21 ప్రభాతవార్త: తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు చెందిన భూమిని అధికార బలంతో అంచెలంచెలుగా ఇతర విభాగాలకు కేటాయించి కళాశాలకు మొండిచేయి మిగల్చడం ద్వారా ప్రభుత్వమే నిర్వీర్యం చేస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 1960లో పురుడు పోసుకున్న ఎస్వీ మెడికల్ కళాశాల డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అనుబంధంగా నిర్వహించబడుతున్నది. మెడికల్ కళాశాల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా చంద్రగిరిలో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన భూమిలో ఆసుపత్రి భవనాలను నిర్మించి పేదలకు వైద్య సేవలందించారు. కాలక్రమంలో భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణాలపై ఏ ప్రభుత్వం గానీ, పార్టీలు పట్టించుకున్న దాఖలాలులేవు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఆచరణలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో డొల్లతనం వెళ్ళడవుతున్నది.

చంద్రగిరిలోని గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రం (ఆర్‌హెచ్‌టిసి) ప్రాధాన్యతను పరిశీలిస్తే.. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలోని మెడిసిన్ విద్యార్థులు ఫీల్డ్ వర్క్ (గ్రామీణ ప్రాంతాలలో క్షేత్ర స్థాయి పరిశీలన) కొరకు ఇక్కడికి వస్తారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రయోగాత్మక పరిశీలనకు ఈ కేంద్రం దోహదపడుతుంది. ఇక్కడి మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది ద్వారా అనేక విషయాలపై వైద్య విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఈ శిక్షణా కాలంలో ఇక్కడ వారికి భోజన వసతి సౌకర్యాలు కల్పించాల్సి వుంటుంది. ఆ మేరకు వైద్య విద్యార్థులకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించిన తీరును పరిశీలించేందుకు ఢిల్లీ నుండి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) బృందం ఇక్కడికి చేరుకుని పరిశీలించి సంతృప్తి చెందినట్లయితేనే ఎస్వీ మెడికల్ కళాశాలకు సీట్ల పెంపు సాధ్యపడుతుంది. ఆ మేరకు గత 7 ఏళ్ళ క్రితం ఎంసిఐ బృందం పరిశీలన అనంతరం 50 సీట్లను పెంచినట్లు సమాచారం. సుధీర్ఘ చరిత్ర కలిగిన ఆసుపత్రి భూమికి ఇంతటి ప్రాధాన్యత కలిగినప్పటికీ రూరల్ హెల్త్ సెంటర్‌కు కనీసం సొంత భవనం లేకపోవడం పాలకుల వైఫల్యం గాక మరేమిటనే ప్రశ్న తలెత్తుతున్నది. సొంత భవనం లేకపోవడంతో ఏరియా ఆసుపత్రిలోనే ఒక విభాగంలో ఆర్‌హెచ్‌టిసి ఏర్పాటు చేసుకుని రోగులకు సేవలందిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే పులివర్తి నాని కోరిక మేరకు 50 పడకలను మంజూరు చేసిన చంద్రబాబు ప్రభుత్వం భవిష్యత్తులో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లయితే రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ (ఖాళీ చేయాల్సిందే) పరిస్థితి ఏమిటనేది డాలర్ల ప్రశ్న. అప్పుడు మెడికల్ కళాశాలకు సీట్లు పెంచుకోవడం ప్రక్కనబెడితే దాదాపు మూడు దశాబ్దాలకు పైగా సొంత భవనానికి నోచుకోని ఆర్‌హెచ్‌టిసి ఎక్కడికి వెళుతుందనే ప్రశ్న తలెత్తకమానదు. కోట్లాది రూపాయల భూమిని ఎస్వీ హాస్టల్‌కు కట్టబెట్టి కళాశాలకు మరెక్కడో గుట్ట పొరంబోకు భూమిని కేటాయిస్తామంటే ఎస్వీ మెడికల్ కళాశాల యాజమాన్యం మౌనంగా వుండటం ఏమిటనే విమర్శలు లేకపోలేదు. తమ హక్కుగా కలిగిన భూమిని ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా వేరొక విభాగానికి కేటాయిస్తున్నప్పుడు సంబంధిత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడమా, కోర్టును ఆశ్రయించి కాపాడుకోవడంపై ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారో అర్థం కావడంలేదు. ముఖ్యమంత్రి సొంత మండల కేంద్రంలో జరుగుతున్న భూ బదలాయింపును పరిశీలించి ఎస్వీ మెడికల్ కళాశాల అనుబంధ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ భవిష్యత్తును, మెడిసిన్ విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరుతున్నారు.

### ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందన

"ఆక్రమణకు కట్టుబడి ... అధికారమే పెట్టుబడి పేరిట ప్రభాతవార్తలో ప్రచురితమైన వార్త కథనంపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించారు. మెడికల్ కళాశాల భూమిని పరిశీలించి బదలాయింపు ప్రక్రియను ఆపవలసినదిగా తహశీల్దార్ శివరామ సుబ్బయ్యను ఆదేశించినట్లు తెలిపారు. చంద్రగిరి మండల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రానీయక మెడికల్ కళాశాల తమ సొంత భూమిలోనే ఆర్‌హెచ్‌టిసి భవనం నిర్మించుకోవడానికి ప్రభుత్వం ద్వారా తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణానికి స్థల కేటాయింపుకు సైతం భూమిని మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. ఎస్సీ హాస్టల్ నిర్మాణం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటానని అన్నారు.



# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు

బొండపల్లి, (విజయనగరం జిల్లా), డిసెంబరు 21 ప్రభాతవార్త: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన మరియు ఎన్నారై సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆయన విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆయన స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కల వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి అన్నారు. ఇప్పటికే పోలియో దాదాపు నిర్మూలింపబడినప్పటికీ, ముందు జాగ్రత్తగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. జిల్లాలో సుమారు 2 లక్షల మందికి పోలియో చుక్కలను వేసేందుకు 1172 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తును సురక్షితం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా ఈ చుక్కల కార్యక్రమానికి దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో అధికారులు మరియు ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి శతశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రేపటినుంచి ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేయాలని మంత్రి కోరారు.




## పలమనేరు బాలాజీకి అపూర్వగౌరవం

### హైదరాబాద్‌లో సాహిత్యమే సత్యాన్వేషణ పుస్తకావిష్కరణ

పలమనేరు, డిసెంబరు 21 ప్రభాతవార్త: ప్రముఖ కవి, రచయిత పలమనేరు బాలాజీకి అపూర్వ గౌరవం లభించింది. ఆయన రచించిన సాహిత్యమే సత్యాన్వేషణ పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ప్రముఖ సాహితీ వేత్త కాత్యాయనీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాహిత్యం శ్రద్ధగా అధ్యయనం చేసిన రచయిత పలమనేరు బాలాజీ అని కొనియాడారు. రెండున్నర దశాబ్దాల పాటు సాగించిన కృషి ఫలితమే ఈ పుస్తకమని తెలిపారు. సుప్రసిద్ధ సాహితీ వేత్తలు ఎస్, వేణుగోపాల్, ఎకె ప్రభాకర్, కెఎ మునిసురేష్ పిళ్లై, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి పుస్తకాన్ని సమీకించారు. నేటి సాహిత్యానికి ఈ పుస్తకం అవసరం ఎంతైన ఉందని, ఇలాంటి విలువైన వ్యాసాలు పలమనేరు బాలాజీ ఇంకా కొనసాగించాలని కోరారు. కథావరణ, కవితా వరణం పేరిట ఈయన రాసిన వ్యాసాలకు సాహిత్య రంగంలో చాలా విలువ గుర్తింపు ఉన్నాయని కొనియాడారు.ప్రముఖ రచయితలు కవులు జూపాక సుభద్ర, కృపాకర్ పొనుగోటి, రోహిణీవంజారి, రమణ మూర్తి, తాయమ్మ కరుణ, రాంకీ, జ్వలిత, గండికోట వారిజ, డా.కెబి పవిత్ర, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంకు తూట్లు పొడుస్తున్న కేంద్రం

### రైతు కూలీ సంఘంనాయకుడు వివి రమణయ్య

వెంకటగిరి, డిసెంబరు 21 ప్రభాతవార్త: డిసెంబర్ 23న మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య తెలిపారు. ఈ నెల 18న కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంట్లో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్ ) వీబీ జి రాంజీ పేరుతో చట్టం చేసిందని ఈ చట్టం అమల్లోకి వస్తే ఉపాధి హామీ నీరుగారుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక పల్లె వీధిలోని కాళహస్తి శేషయ్య స్మారక భవనం నందు రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ గతంలో కరువు పని కల్పించమని డిమాండ్ చేస్తే 15 రోజుల్లో పని కల్పించే వెసులుబాటు ఉన్నదని, అలా కల్పించని ఎడల నిరుద్యోగ భృతి డిమాండ్ చేసే సౌకర్యం ఉండగా కొత్తగా తెచ్చిన చట్టంలో అవి తొలగించారని, పని హక్కుని డిమాండ్ చేయలేని పరిస్థితి ఏర్పడిందని పనిహక్కుని పథకంగా కుదించారని విమర్శించారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో కేంద్రం 90 శాతం నిధులు మం జూరు చేస్తే రాష్ట్రాలు కేవలం 10శాతమే ఖర్చు భరించాయని ఇప్పుడు 40శాతం రాష్ట్రాలు భరించుకోవాలన్న షరతు పెట్టడంతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడి ఉపాధి హామీని నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. మహాత్మా గాంధీ పేరుని తొలగించడమే గాక కేంద్రం ఉపాధి పనికి కేటాయించే నిధుల్లో కూడా కోత పెట్టిందన్నారు.



విజేతలకు బహుమతులందిస్తున్న మహాలింగం

### నాడు పరిమిత అవకాశాలు...

## నేడు అంతులేని సదుపాయాలు

### చెన్నై ఐఐటి డీన్ అశ్విన్ మహాలింగం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 ప్రభాతవార్త: ఒక నాడు ఐఐటిలో పరిమిత అవకాశాలు ఉండేవని నేడు అంతులేని సదుపాయాలతో సాగుతున్నాయని చెన్నై ఐఐటి డీన్ ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం అన్నారు. ఆదివారం రాత్రి తిరుపతి ఐఐటిలో 58 ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్ 2025 ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమాలను స్పోర్ట్స్ మీట్ చైర్‌పర్సన్, డీన్ నేతి వి.ఎల్.నరసింహామూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా వచ్చిన అశ్విన్ మహాలింగం మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ధృఢత్వం, భావోద్వేగ సమతుల్యత, నాయకత్వం పెంపొందిస్తుందన్నారు. ఆయన చదివిన కళాశాలలో పూర్వ సౌకర్యాలు నేడు ప్రభుత్వాలు కల్పించిన సదుపాయాలను బేరిజు వేసుకుంటూ విద్యార్థులకు దిశానిర్దేశం చేసారు.

### విజేతల సంబరాలు

చదరంగం పోటీల్లో ముంబై ఐఐటి విద్యార్థులు విజేతయ్యారు. రెండవ స్థానంలో ఖరగ్‌పూర్, మూడవ స్థానంలో మద్రాస్‌లు నిలిచాయి. అలాగే కదం ఓం మనీష్, షోమ్ శివ్, చంద్రత్రయ ప్రచితి మూడు స్థానాల్లో వారి ప్రదర్శనకు వ్యక్తిగత బోర్డు బహుమతులను పొందారు. కాగా టెన్నిస్ పోటీల్లో మహిళ పోటీల్లో రోపర్ ఐఐటి మొదటి స్థానంలో నిలవగా రెండవ స్థానంలో ఐఐటి ఖరగ్‌పూర్, మూడవ స్థానంలో ముంబై ఐఐటీలు నిలిచాయి. అయితే ఛాంపియన్ టైటిల్‌ను చెన్నై ఐఐటి దక్కించుకుంది. ఐఐటి మద్రాస్‌కు చెందిన ప్రద్యుమ్న సింగ్ తోమర్ వరుస పోటీ లీగ్ నాకౌట్ మ్యాచ్‌ల తరువాత టెన్నిస్ (పురుషులు) ఉత్తమ ఆటగాడి అవార్డును అందుకున్నారు.

## అలల తాకిడికి విద్యార్థి మృతి



కోట, డిసెంబరు 21 ప్రభాతవార్త: కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని శ్రీనివాససత్రం వద్ద బీచ్‌లో ఓ ఇంజినీరింగ్ మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న యుగంధర్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు ఆదివారం శ్రీనివాసత్రం వద్ద బీచ్‌కు వచ్చారు. సముద్ర స్నానం చేసేందుకు వచ్చారు. అయితే యుగంధర్ అలల తాకిడికి గురై మృతిచెందాడు. యుగంధర్ నెల్లూరు రూరల్ మండలం పాత ఎల్లంటి గ్రామమని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం తండ్రి సురేష్‌కు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల సహకారంతో ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

● గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలనే ఉచిత వైద్య పరీక్షలు

● రంపచోడవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రారంభ కార్యక్రమంలో నారా భువనేశ్వరి ● ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

జీఎస్ఎల్ జీఎస్ఆర్ హాస్పిటల్స్ సహకారంతో వైద్య శిబిరం



రంపచోడవరం, డిసెంబరు 21 ప్రభాతవార్త: సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో 29 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో పేద ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నామని నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ - జీఎస్ఆర్ హాస్పిటల్స్ సహకారంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం యూత్ సెంటర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ముందుగా సీతపల్లిలో శ్రీగడి బాపనమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి రంపచోడవరం చేరుకున్న భువనేశ్వరికి కొమ్ము నృత్యంతో ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే శిరీషా దేవితో కలిసి ప్రారంభించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారి వద్దకెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వేదికపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ... ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు చేయూత అందిస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు రంపచోడవరంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ఈ వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం అత్యవసర సేవలు అందించాల్సి వస్తే కార్పొరేట్ ఆసుపత్రులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫారసు చేస్తామన్నారు. ప్రజలు సహకారం, దాతల సహకారంతోనే ఇదంతా చేస్తున్నామని, ట్రస్ట్ తరపున ఏ కార్యక్రమం చేపట్టినా దాతలు ముందుకొస్తున్నారని భువనేశ్వరి తెలిపారు.

### ఆదివాసీలకు ఎన్టీఆర్ బతుకుదెరువు చూపించారు : ఎమ్మెల్యే శిరీషాదేవి

వెనకబడ్డ తమ ప్రాంతంలో ఇన్ని రకాల ఉచిత సేవలు అందించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సికెల్ సెల్ వ్యాధి ఎక్కువగా ఉందని, ఈ వ్యాధికి రక్తం ఎక్కిస్తూనే ఉండాలని తెలిపారు. ఈ నేపథ్యంలో రంపచోడవరంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని భువనేశ్వరిని కోరగానే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎన్టీఆర్ ఒకప్పుడు ఈ ప్రాంతంలోనే బస చేశారు. గిరిజనుల జీవన పరిస్థితులు చూసి జీడి మామిడి మొక్కలు అందించి ప్రోత్సహించారు. అరకులో కాఫీ పంటలు ఎలాగో ఇక్కడ జీడి ఫేమస్. ఉండటానికి ఇళ్లు, తినడానికి తండి, కట్టుకోవడానికి బట్ట అందించారు. కిలో బియ్యం రెండు రూపాయలకు పేదలను దృష్టిలో పెట్టుకుని చేసిన కార్యక్రమమే. ఆదివాసీలకు ఎన్టీఆర్ బతుకుదెరువు చూపించారు అని ఎమ్మెల్యే మిరియాల శిరిషా అన్నారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ... ఏజెన్సీలో ఉచిత వైద్య క్యాంప్ ద్వారా సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. వరదల సమయంలో భువనేశ్వరి తల్లిలా మనల్ని ఆదుకున్నారని, మెడిసిన్, దుప్పట్లు, కూరగాయలు, నిత్యావసరాలు ట్రస్ట్ తరపున అందించారని తెలిపారు.



## ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

### - జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

### - దుబాయ్‌లో ఎన్టీఆర్ సజీవ చరిత్ర ఆవిష్కరణ

పాలకొల్లు, డిసెంబరు 21 ప్రభాతవార్త: తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత అన్న ఎన్టీఆర్ అని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. తెలుగు వారి ఆత్మీయ సమ్మేళనానికి దుబాయ్ వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి, ప్రజా నాయకుడు అన్న ఎన్టీఆర్ జీవన ప్రయాణాన్ని ప్రతిబింబించే ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకంతో పాటు దాని ఆడియో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి నిమ్మల రామానాయుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టి.డి. జనార్దన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. 1984లో జరిగిన చారిత్రాత్మక రాజకీయ పరిణామాలు, ప్రజల మద్దతుతో ఎన్టీఆర్ సాధించిన విజయం రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయాలు, పోరాట పటిమ నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. అలాగే టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టి.డి. జనార్దన్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్టీఆర్ చేసిన కృషి అనిర్వచనీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన స్ఫూర్తితో యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లభించిన వ్యాపార సంస్కర్త - 2025 అవార్డు సందర్భంగా కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సభలో ప్రవాసాంధ్ర వ్యాపారవేత్తలు పి.వి. రమణ మూర్తి, నల్లూరి శేషయ్య, రవి గుత్తా, శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు విశ్వేశ్వరరావు, నిరంజన్, వాసుదేవ రెడ్డి, రాజా రవి, హరి కల్లూరి, ప్రసాద్ దారపనేని, సింగయ్య రామినేని, సురేంద్ర బెజవాడ, మధుసూధన్ కల్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మొత్తం ప్రవాస తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత పెంచింది

## బ్రాహ్మణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లోకేష్



విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ మంత్రి, తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ నారా లోకేష్ తన భార్య నారా బ్రాహ్మణికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నారా బ్రాహ్మణి బర్త్ డే. ఈ సందర్భంగా తన ఎక్స్ ఖాతాలో నారా లోకేష్ ఆసక్తికర పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే బ్రాహ్మణి! కష్టాల్లోనూ, సుఖాల్లోనూ, ప్రశాంతతలోనూ, గందరగోళంలోనూ నువ్వు నాకు ఎప్పుడూ అండగా ఉన్నావ్. దేవాన్ష్‌కు ప్రేమమయమైన తల్లివి, ఒక రాక్‌స్టార్ సిఇఓవి, ప్రతి అడుగులో నాతో నడిచావు. ఎప్పటికీ కృతజ్ఞుడిని అంటూ తన ప్రేమపూర్వక సందేశాన్ని బ్రాహ్మణికి ఇచ్చారు నారా లోకేష్. ఈ సందేశం ద్వారా లోకేష్.. భార్యపై ఉన్న ప్రేమ, కృతజ్ఞతను చాటిచెప్పారు. ఈ పోస్ట్‌తో పాటు సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న వారి ఫొటోను జతచేశారు లోకేష్. నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, మంగళగిరి ఎమ్మెల్యే, ఏపీ మంత్రి. బ్రాహ్మణి నారా హెరిటేజ్ ఫుడ్స్ సీఈఓగా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు దేవాన్ష్. బ్రాహ్మణి బర్త్ డే వేళ అభిమానులు, రాజకీయ కార్యకర్తలు బ్రాహ్మణికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు, పుట్టిన రోజు శుభాకాంక్షలు వదినమ్మ వంటి కామెంట్లు చేస్తున్నారు. బ్రాహ్మణికి మరిన్ని విజయాలు, సంతోషాలు కలగాలని వారి అభిమానులు కోరుకుంటున్నారు.

## జగనన్న జన్మదిన వేడుకల సంబరాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి వైకాపా పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ శ్రీనివాసులు, మైనారిటి నాయకుడు పఠాన్ ఫరీద్ ఖాన్ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. మైనారిటి నాయకుడు పఠాన్ ఫరీద్ ఖాన్ సుమారు 300 మంది మహిళలతో పట్టణంలో ఊరేగింపు జరిపారు. జగన్ చారిటబుల్ ట్రస్టు సారథ్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా వేలాది మందికి అన్నదానం చేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని యువతకు మార్గదర్శకంగా వారికి రక్షణ కల్పించుటకు బైక్ నడిపే ప్రతి యువకుడు తన కుటుంబాన్ని గుర్తుపెట్టుకోవాలని మాజీ శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి సూచించారు. ఇందుకు తమ వంతు కర్తవ్యంగా వాహనం నడిపే ప్రతి ఒక యువకుడు తలకు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ 600 మంది యువతకు ఉచితంగా హెల్మెట్స్‌ను అందించారు. అలాగే డప్పు కళాకారులు 400 మందికి డప్పులను అందించారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. జగనన్న మళ్ళీ ముఖ్యమంత్రి కావాలంటూ నివాదాలు చేసారు. ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, వయ్యాల కృష్ణంరెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, సుధాకర్‌రెడ్డి, జడ్‌పిటిసి సంధ్యారాణి, పగడాల రాజు, బర్రె సుదర్శనం రెడ్డి, చెవిరెడ్డి మధుసూదనం రెడ్డి, గంగారి రమేష్, ఎంపిపి హరిప్రసాద్‌రెడ్డి, మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్ రాయల్ తదితరులు హాజరయ్యారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తజనం



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వాతావరణం చల్లగా మారింది. ఉదయం 9గంటలకు కానీ సూర్యుడు దర్శనం ఇవ్వటం లేదు. పొగమంచుతో పుణ్యక్షేత్రం కప్పివేయబడింది. అంతేకాక చలి వణికిస్తున్నా శివయ్య సేవకు భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామస్మరణ చేస్తూ పునీతం పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 6వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళే భక్తులు అతిథులు సుమారు 8వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు.

22-12P g7exHMNWJQE 11_22-12P g7exHMNWJQE.qxd 21/Dec/25 11:14 PM Page 1



# స్త్రీ శక్తి పథకం సమస్యలు పరిష్కరించాలి

**● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నేత పలిశెట్టి**

విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ, కండక్టర్లు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తీవ్రమైన పనిఒత్తిడిని ప్రభుత్వం గానీ, ఆర్టీసీ యాజమాన్యం గానీ పట్టించుకోవడం లేదని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో జరిగే చిన్నచిన్న పొరపాట్లకే ఆర్టీసీ తనిఖీ అధికారులు కండక్టర్లపై కేసులు నమోదు చేస్తున్నారని, డిపో మేనేజర్లు వాస్తవాలను పరిశీలించకుండానే వాటి ఆధారంగా సస్పెన్షన్లు, తీవ్ర శిక్షలు విధిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో కండక్టర్లు, డ్రైవర్లు విధులు నిర్వహించడం చాలా కష్టమవుతుందని పేర్కొన్నారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా విద్యాధరపురం డిపో యూనియన్ నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఉమ్మడి జిల్లాల్లోని 15 డివిజన్లలో న్యాయపరమైన కారణాలతో నిలిచిపోయిన పదోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన ట్రాఫిక్, మెయింటెనెన్స్ ఉద్యోగులతో పాటు ఇతర అన్ని కేటగిరీల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.డి. ప్రసాద్ మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం అమలుతో ఉద్యోగులపై పెరిగిన పని భారాన్ని తగ్గించాలంటే కనీసం 3వేల అదనపు బస్సులు ప్రవేశపెట్టడంతో పాటు, అన్ని కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కనీసం పది వేల నియామకాలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు, కొత్త నియామకాలు లేకుండా ఇదే సిబ్బందితో పథకాన్ని నడపడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.



## మేడారం జాతరకు రావాలంటూ రాష్ట్రపతి ముర్ముకు ఆహ్వానం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 21: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మేడారం మహా జాతరకు రావాలంటూ ఆమెకు మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానం పలికారు. రాష్ట్రపతికి సమ్మక్క తల్లి చీరను, కంకణం, కండువా బంగారాన్ని మంత్రులు అందజేశారు. ఈ మహా జాతరకు వచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. అనంతరం మంత్రులకు ఆప్యాయంగా నూతనయ వస్త్రాలను ఆమె బహూకరించారు. కాగా అంతకు ముందు ఉదయం మేడారం మహాజాతర-2026 పోస్టర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

# టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు బిసికే

## అనంతపురం టిడిపిలో ఊహించని పరిణామం

**● టిడిపి జిల్లా అధ్యక్షునిగా పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌చౌదరి నియామకం ● జిల్లా అధ్యక్ష పదవి వద్దని నిరాకరించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

అనంతపురం, డిసెంబరు 21 ప్రభాతవార్త బ్యూరో: నిన్న మొన్నటి వరకు అనంతపురం జిల్లా అధ్యక్ష బాధ్యతలను మాజీ మంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అప్పగిస్తున్నారని జోరుగా ప్రచారం జరిగినప్పటికీ ఎవరూ ఊహించని విధంగా ఆర్టిసి రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు పేరును పార్టీ అధిష్టాన వర్గం అధికారికంగా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి తనకు వద్దని మొరాయించడంతోనే అదే బోయ సామాజిక వర్గానికి చెందిన పూల నాగరాజుకు అవకాశం దక్కిందని చెప్పవచ్చు. అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షునిగా పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ చౌదరిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర శాఖ అధికారికంగా ప్రకటించింది. రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట జడ్పిటిసిగా పనిచేసి పార్టీలో అంచలంచలుగా ఎదిగారు. గతంలలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం ఆర్టిసి అనంతపురం రీజనల్ ఛైర్మన్‌గా ఉన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో సాన్నిహిత్యం, ప్రోత్సాహం వల్ల పార్టీలో బోయ నాగరాజు కీలకంగా ఎదిగాడని అభిప్రాయం ఉంది. అయితే కొన్నేళ్లుగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, పూల నాగరాజు మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్న అభిప్రాయం ఉంది. ఆర్టిసి రీజనల్ ఛైర్మన్ పదవిని కాలవ ప్రత్యర్థి వర్గం ప్రతిపాదించిందనే అభిప్రాయం లేకపోలేదు. ఏది ఏమైనా టిడిపి జిల్లా అధ్యక్షునిగా పూల నాగరాజు నియామకం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను కలుపుకుని ముందుకు సాగడం కత్తి మీద సాములాంటిదే. టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఉండాలని గతంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్లు బలంగా వినిపించాయి. ఇప్పటికి నియోజకవర్గ పనులతోపాటు సొంత నిర్మాణ సంస్థ పనులు కూడా ఉండటంతో పార్టీ జిల్లా అధ్యక్ష పదవి వద్దని ఎమ్మెల్యే సురేంద్రబాబు పార్టీ ముఖ్యులకు నచ్చజెప్పినట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో టిడిపి జిల్లా అధ్యక్షునిగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేరు దాదాపు ఖరారు చేశారు. అయితే రాయదుర్గం నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా పని చేయాలన్న ఆలోచనలో ఉన్నానని తనకు పార్టీ అధ్యక్ష పదవి వద్దని పార్టీ ముఖ్యులకు విజ్ఞప్తి చేసినట్లు తెలియవచ్చింది. అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేలు సరైన సహకారం ఉండదని అనవసరంగా రిస్క్ ఎందుకన్నన అభిప్రాయం కూడా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులో ఉన్నట్లు సమాచారం. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి వద్దని ఎమ్మెల్యే కాలవ మొరాయించడంతో ఊహించని విధంగా అనంతపురం ఆర్టిసి రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజుకు దక్కినట్లైంది. టిడిపి జిల్లా అధ్యక్ష పదవికి నరసనాయుడు, గడ్డం సుబ్రహ్మణ్యం, కంబదూరు రామ్మోహన్ చౌదరి పేర్లు కూడా బలంగా వినిపించినప్పటికీ పార్టీ రాష్ట్ర శాఖ సామాజిక సమీకరణలో భాగంగా వారికి అవకాశం ఇవ్వకుండా పూల నాగరాజుకు ప్రాధాన్యత ఇచ్చినట్లైంది.




### జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ చౌదరి

ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలానికి చెందిన జి.శ్రీధర్‌చౌదరిని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టాన వర్గం నియమించింది. పార్టీలో సీనియర్ నేతగా శ్రీధర్ చౌదరికి గుర్తింపు ఉంది. తెలుగు యువతలో ఎన్నో ఏళ్లు పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మొన్నటి వరకు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ చౌదరి పని చేసి పార్టీలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ నాయకులు, శాసనసభ్యులు, మంత్రి పయ్యావుల కేశవ్‌తో కూడా శ్రీధర్ చౌదరికి మంచి సంబంధాలు ఉన్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ చౌదరి నియామకం టిడిపి వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇదే సమయంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి కోసం వివిధ సామాజిక వర్గాల వారు ప్రయత్నాలు చేశారు. వారి ఆశలు ఫలించ లేదు. ఇది టిడిపి జిల్లా కమిటీలోకానీ ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ఆశించిన వారికి అవకాశం కల్పించాల్సిన అవసరం కల్పించాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానం పై ఉంది.



కలిమిశ్రీకి రవ్వా శ్రీహరి పేరిట అవార్డు ప్రధానం చేస్తున్న దృశ్యం

## చీరలకు ఆత్మ వుంటుంది

**వాటి వెనుకా ఒక నేత కార్మికుడి ఆత్మనివేదన ఉంటుంది**


**● విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి**

**● ప్రగడ కోటయ్య, రవ్వా శ్రీహరి పేరిట అవార్డుల ప్రదానం**


విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: చీరలకు ఆత్మ వుంటుందని, ప్రతి చీర వెనుకా ఒక నేత కార్మికుడి ఆత్మనివేదన వుంటుందని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ చీరల దినోత్సవం సందర్భంగా స్థానిక బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమం, కవి సమ్మేళనం, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తుమ్మా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చేనేతల జీవితాల్లో వెలుగులు నింపడానికి నేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత ఉద్యమ సూరీడు ప్రగడ కోటయ్య ఆధునిక తెలుగు నిఘంటుకర్తగా పలు గ్రంథాలు రాసి భాషోద్యమ సూరీడుగా రవ్వా శ్రీహరి చరిత్రలో నిలిచిపోతారన్నారు. సుప్రసిద్ధ రచయిత డా. యం.ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగుహిందీ ఉభయభాషల్లోనూ విలువైన గ్రంథాలను రాసిన ఉభయ భాషా ప్రవీణుడు రవ్వా శ్రీహరి తెలుగును వెలిగించిన మహామహోపాధ్యాడని అన్నారు. ప్రగడ కోటయ్య, రవ్వా శ్రీహరి వంటి చేనేత వర్గ మహనీయుల్ని గుర్తు చేసుకుంటూ వారి పేరుతో అవార్డులు ఇవ్వడం ఎంతో శుభపరిణామమన్నారు. తితిదే ట్రస్టు బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం ప్రపంచ చీరల దినోత్సవం జరపడం, చేనేత మహనీయుల పేరుతో అవార్డులు ఇవ్వటం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా ప్రగడ కోటయ్య నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్సెలెన్స్ అవార్డును ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, జామ్దాని పట్టుచీరల నిర్మాత లొల్లా వీర వెంకట సత్యనారాయణలకు, ఆచార్య రవ్వా శ్రీహరి సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి మహిళా అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, ఆధ్యాత్మిక రచయిత ఉపేంద్రగుప్తా, అగ్రికల్చర్ మాజీ ఏడీ జె.ఎన్.వి.ప్రసాద్, గోలి భాస్కరరావు, దివి మురళీకృష్ణ, నీలి కనకదుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అఖిలభారత పద్మశాలీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సూరేపల్లి రవికుమార్ పర్యవేక్షించారు.

## 3 వేల మందితో నేడు జనసేన 'పదవి బాధ్యత కార్యక్రమం'

**● దిశానిర్దేశం చేయనున్న అధినేత పవన్‌కల్యాణ్**



విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన నుంచి నామినేటెడ్ పదవులు పొందిన వారికి అధ్యక్షులు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తారని ఆపార్టీ పిఎసి ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన పక్షాన నామినేటెడ్ పదవులు పొందిన వారితో పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం సమావేశం అవుతున్నారని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నాదెండ్ల మనోహర్ వివరించారు. మూడు వేల మందితో "పదవి బాధ్యత' అని పేరిట నిర్వహించే ఈ సమావేశం ద్వారా పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమం గురించి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులతో ఆదివారం ఉదయం మనోహర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమం వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ తరఫున రేపు నిర్వహిస్తున్న పదవి బాధ్యత" కార్యక్రమం చాలా కీలకమైన సమావేశం. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఇవ్వబోయే ప్రసంగం మనందరికీ మార్గదర్శకంగా ఉండబోతుంది" అన్నారు.

## అశోక్ గజపతిరాజుకు నారాయణ అభినందనలు

విజయవాడ, డిసెంబరు 21 ప్రభాతవార్త ప్రతినిధి: గోవా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె. నారాయణ అభినందనలు తెలిపారు. అశోక గజపతిరాజు రాజకీయాల్లో ఉంటూ కూడా ఆదాయాన్ని సమకూర్చుకోకపోగా, తనకున్న సొంత ఆస్తి నుంచి రూ.1000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారని ప్రశంసించారు. ఆ భూమిలో ఏవియేషన్‌కి సంబంధించినవి ఏర్పాటు చేయమని ప్రభుత్వానికి సూచించారని వివరించారు. ఈతరం రాజకీయాల్లో రూపాయి పెట్టుబడి పెట్టి రూ.100 కోట్లు సంపాదించే పరిస్థితి ఉందని.. కానీ అశోక గజపతిరాజు రూ.1000 కోట్ల విలువైన తన సొంత భూమిని ఇవ్వటం ద్వారా రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నేడు సమాజంలో విలువలు దిగజారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి పరాకాష్టకు చేరిందని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే రాజకీయ నాయకులు ఆయన సేవలను చూసి సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ఈ విషయంలో సమాజం అశోక గజపతి రాజును తప్పనిసరిగా అభినందించాలని నారాయణ పేర్కొన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా సూర్యఉపాసన

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 21 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా ఆదివారం సూర్యఉపాసన సేవను నిర్వహించారు. వేదపండితులు సూర్యాష్టకం, ఆదిత్యహృదయం, ద్వాదశ ఆదిత్యుల ఉపాసనా మంత్రాలను పఠిస్తూ పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. శ్రీ దుర్గమ్మవారిని ఆదివారం ఉయ్యూరుకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దర్శించుకున్నారు. వారికి పాలకమండలి సభ్యులు ప్రసాదాలు అందించారు.

### వైభవంగా శ్రీ సీతారామకల్యాణోత్సవం

భక్తులను శ్రీ సీతారామకల్యాణోత్సవం భక్తితన్మయత్వంలో ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. పూర్ణానందంపేటలోని శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవాన్ని అర్చకస్వాములు గోపికృష్ణమాచార్యులు, నారాయణ, బాబు నేతృత్వంలో నిర్వహించారు. మాంగల్యదారణ జరిగిన అనంతరం తలంబ్రాలు సమర్పించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

### దుర్గమ్మను దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

శ్రీ అమ్మవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత కుమార్ మిశ్రా సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### భక్తులు విరాళాలు

శ్రీ అమ్మవారి ఆలయంలో జరిగే ఉచిత అన్నప్రసాద వితరణ నిమిత్తం రు.1 లక్షను విరాళంగా విజయవాడకు చెందిన ఎం రవీంద్రనాథ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం విరాళంగా అందించారు. తిరువూరుకు చెందిన అనుమోలు వెంకట ముత్తారావు తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1లక్ష విరాళం అన్నప్రసాద వితరణకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### చిన్నారులకు పోలియో చుక్కలు

దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నాడు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇఓ వికె శీనా నాయక్ మాట్లాడుతూ దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.



పోలియోచుక్కలు వేసే కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్

# భారత్‌కు పునర్వైభవం సాధించాలి

**● పౌరుల్లో నైతికత శిరోధార్యం కావాలి ● సద్గురు శ్రీకందుకూరి శివానందమూర్తి జన్మదినోత్సవ వేడుకల్లో వక్తలు ● సామాజిక సేవా పురస్కార అవార్డు ప్రదానం ● తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కు సన్మానం**

జగ్గయ్యపేట, డిసెంబరు 21 ప్రభాతవార్త: భారతదేశం మహోన్నతంగా ఎదగాలన్నా పునర్వైభవం సాధించాలన్నా పౌరుల్లో నైతికత శిరోధార్యం కావాలని, రేపటి పౌరులకు ఉత్తమ మార్గదర్శనం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని పలువురు వక్తలు ఉద్బోధించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో ఆదివారం సద్గురు శ్రీకందుకూరి శివానందమూర్తి భగవాన్ల 97వ జన్మదినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మి గురు దంపతులు ఆధ్వర్యంలో శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్టు ఆర్గనైజర్ చిట్టినేని వెంకటేశ్వరరావు- మాధవి దంపతులు, శ్రీగురుధామ్ భక్తబృందం కన్నుల పండువగా వేడుకను శోభాయమానం చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిధిగా తెలంగాణా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. శ్రీశివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డు-2025ను ఇరువురు ఆధ్యాత్మికవాదులు, ముగ్గురు సీనియర్ వైద్యనిపుణులకు ప్రదానం చేశారు. ఢిల్లీ నుండి విచ్చేసిన సద్గురు శ్రీశివానందమూర్తి అనుయాయులు రాఘవేంద్రన్, ఆధ్యాత్మికవేత్త రాధాకుమారిలకు వెంకటరమణ దంపతులు ఆత్మీయ సన్మానంచేశారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ సికె నాయుడు, విజయవాడ ఆర్‌కె ఆసుప త్రి డాక్టర్ ఆర్ ఈశ్వర్, జగ్గయ్యపేట శ్రీరామ హాస్పటల్ శస్త్రచికిత్సల నిపుణులు డాక్టర్ బి యోగీరామ్‌లకు అవార్డులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రసంగిస్తూ తమ వివాహానికి సద్గురు శ్రీశివానంద భగవాన్లు ఆశీస్సులిచ్చారన్నారు. శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శవంతంగా నిలుస్తున్నాయని హర్షం వ్యక్తంచేస్తూ తాత్వికులు వెంకటరమణ దంపతులకు నమస్సులు తెలిపారు. వెంకటరమణ అనుగ్రహభాషణ చేస్తూ సమాజంలో మంచిని విస్తరింపజేస్తూ ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో స్ఫూర్తిని పాదుకొల్పేవారికి సద్గురు శ్రీశివానంద గురుదేవుల పేరుతో పురస్కార ప్రదానోత్సవాన్ని చేపట్టామన్నారు.



ఆధ్యాత్మికవేత్త రాఘవన్ మాట్లాడుతూ శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం ముక్తికి, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ మంచిని, మానవత్వాన్ని, నైతిక విలువలను వృద్ధిచేసే ఈక్షేత్రం ఆదర్శాన్ని అందిస్తుందన్నారు. అవార్డు గ్రహీతలు డాక్టర్ సికె నాయుడు, డాక్టర్ ఆర్ ఈశ్వర్, డాక్టర్ బి యోగీరామ్ తమ స్పందనను సరళంగా వ్యక్తపర్చారు. సభలో దివంగత పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన కవితలను గానంగా స్వరపర్చిన ఆయన తనయుడు యోగేశ్వర్ సిడి రూపంలో పెద్దల చేతుల మీదుగా ఆవిష్కరించారు. సిరివెన్నెల సతీమణి పద్మావతిని కూడా వెంకటరమణ దంపతులు సభలో సన్మానించారు. సభలో శ్రీశివానందగురు ట్రస్టు ఆర్గనైజర్ చిట్టినేని వెంకటేశ్వరరావు-మాధవి దంపతులు, నిర్వాహక ప్రతినిధులు ఆనంద శంకర్-డాక్టర్ హర్షిత దంపతులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది గెంటేల అశోక చక్రవర్తి తదితర జగ్గయ్యపేట ప్రాంత ప్రముఖులు, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు. సభకు అధ్యాపకులు డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు అనుసంధానకర్తగా వ్యవహరించారు..



## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ (గన్నవరం), డిసెంబరు 21 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపిఎన్‌జిఓ సంఘం రాష్ట్రఅధ్యక్షులు ఏ.విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్రకార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలోని ఎన్‌జిఓహోంలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించటంతోపాటు, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును యాధాతధంగా అమలు చేయాలని ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేసారు. 2017 ఎన్‌జిఓ సంఘం చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వమే 50శాతం జీతాలు పెంచిందని, బడ్జెట్‌తో సంబందం లేకుండా ప్రతినెలా ఒకటవతేదీన జీతాలు ఇచ్చేలా జిఓ జారీచేసిన సంగతి గుర్తు చేసారు. రెగ్యులర్ ఉద్యోగుల భర్తీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజి ఇవ్వాలని, చనిపోయిన ఉద్యోగులకు ఇచ్చే మట్టిఖర్చులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై త్వరలో మంత్రులను కలిసి సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాణ్యం వేణు, ప్రధానకార్యదర్శి అల్లం సురేష్‌బాబు, కోశాధికారి పిబి.బాలసుబ్రమణ్యం, కృష్ణా జిల్లా అధ్యక్షులు సత్యవాడ సంతోష్‌కుమార్, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు సివిఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే లక్ష్యం: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా



విజయవాడ (గన్నవరం), డిసెంబరు 21 ప్రభాతవార్త: పోలియో మహమ్మారిని అంతమొందించినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలియో నివారణకు సహకరించా లని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్నా కలెక్టర్ విజయవాడలోని చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పోలియో బూత్ వద్ద చిన్నారులకు పోలియో నివారణ చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పోలియో చుక్కలు ఆరోగ్య కరమైన భవిష్యత్‌కు బాటలు వేస్తాయన్నారు. తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకుండా ఐదేళ్ళలోపు చిన్నారులందరికి పోలియో నివారణా చుక్కల మందు వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్, వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో పోలియో నివారణ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చుక్కలమందు వేస్తారని తెలిపారు. వైద్యఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ రోటరీనగర్, హెచ్‌బి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో జెసి ఎస్. ఇలక్కియ, డియంహెచ్‌ఓ డాక్టర్ యం. సుహాసిని, డిఐఓ డాక్టర్ శరత్‌బాబు, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీఓ కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.



## టాటా స్టీల్ వరల్డ్..
# గుల్వీర్, సీమాకు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ వరల్డ్ టోర్నమెంట్‌లో గుల్వీర్ సింగ్, సీమా భారత టైటిళ్లను గెలుచుకుని జాతీయ రికార్డులు. ఆదివారం జరిగిన 2025 టాటా స్టీల్ వరల్డ్ 25రీ కోల్‌కతాలో భారత దిగ్గజ లాంగ్ డిస్టెన్స్ రన్నర్లు గుల్వీర్ సింగ్ మరియు సీమా కొత్త జాతీయ రికార్డులను సృష్టించి ఈ సంవత్సరం కూడా తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. బహుళ జాతీయ రికార్డు కలిగిన గుల్వీర్ (1:12:06) కోల్‌కతాలో అద్భుతమైన పరుగును సాధించాడు. గత ఎడిషన్ నుండి తన జాతీయ రికార్డును 2 నిమిషాలు మెరుగుపరుచుకున్నాడు. ఎలైట్ అంతర్జాతీయ అథ్లెట్లలో ఐదవ స్థానంలో నిలిచాడు. ఇంతలో, సీమా తన తొలి 25 కి.మీ రోడ్ రేసులో 1:26:04 సమయంలో గమ్యాన్ని చేరుకుని భారత ఎలైట్ టైటిల్‌ను గెలుచుకుంది. సంజీవని జాదవ్‌ను 1:30:34 సమయంలో రెండవ స్థానంలో నిలిపింది. భారత అథ్లెట్లకు ఈ సంవత్సరం చివరి అథ్లెటిక్స్ ఈవెంట్ ఇది. గుల్వీర్ తదుపరి ప్రధాన లక్ష్యం స్కాట్లాండ్‌లో 2026లో జరిగే కామన్వెల్త్ క్రీడలు. ఆ తర్వాత ఆ సంవత్సరం చివర్లో జపాన్‌లో జరిగే ఆసియా క్రీడలు. మరోవైపు, ఇథియోపియాకు చెందిన డెగిటు అజిమెరా 1:19:36 సమయంతో మహిళల ఎలైట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు మరియు ఉగాండాకు చెందిన అనుభవజ్ఞుడైన మారథాన్ రన్నర్ జాషువా చెప్టెగీ 1:11:49 సమయంతో పురుషుల ఎలైట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.




## ప్రో బాక్సింగ్‌లో వరుస విజయాలు

**న్యూఢిల్లీ:** ప్రో బాక్సింగ్-2025లో భారత స్టార్ బాక్సర్ నిశాంత్ దేవ్ వరుస విజయాన్ని సాధించాడు. నిశాంత్ ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అరంగేట్ర సంవత్సరంలో అజేయంగా నిలిచాడు, ఘనాలో వరుసగా ఐదవ బౌట్‌ను గెలుచుకున్నాడు. క్రెయిగ్ రిచర్డ్స్‌కు డాన్ అజీజ్‌కు మధ్య ప్రధాన పోరాటం సందర్భంగా ఆరు రౌండ్ల వెల్టర్‌వెయిట్ బౌట్‌లో అతను టాంజానియాకు చెందిన అల్లీ మ్బుక్వాపై 4వ రౌండ్ నాకౌట్ విజయాన్ని సాధించాడు. ఈ ఏడాది ఐదవ మ్యాచ్‌లో నిషాంత్‌కు ఇది మూడవ నాకౌట్ విజయం, ఇది అతని సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు, అగ్రశ్రేణి బాక్సర్లలో ఒకరిగా ర్యాంకులను ఎదగడానికి దారితీసింది. ఇక ఇది నిశాంత్ కు అమెరికా వెలుపల జరిగిన మొదటి బౌట్. అదే ఖండానికి చెందిన ప్రత్యర్థితో ఆడి అతనికి భిన్నమైన సవాలును అందించింది. ఈ సంవత్సరం రెండు ఏకగ్రీవ విజయాలు మరియు ఇప్పుడు మూడు నాకౌట్ విజయాలు సాధించాడు.

## స్పోర్ట్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..
# వీర్ గప్రోత్రాకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** పురుషుల ఏరియల్ సిల్క్‌లో భారత్ అథ్లెట్ వీర్ గప్రోత్రా స్వర్ణం సాధించాడు. ఈ సంవత్సరం పోల్ అండ్ ఏరియల్ స్పోర్ట్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ఏరియల్ సిల్క్ విభాగంలో భారతదేశం బంగారు పతకంతో అరంగేట్రం చేసింది, ఈ ప్రపంచ ఈవెంట్‌లో దేశం తొలిసారిగా పోడియం ఫినిషింగ్‌ను సాధించింది. జూనియర్ బి అమెచ్యూర్ మెన్ (15-17 సంవత్సరాలు) ఏరియల్ సిల్క్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ముంబైకి చెందిన 16 ఏళ్ల అథ్లెట్ వీర్ గప్రోత్రా ఈ స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. ఉక్రెయిన్, హంగేరీ మరియు చెక్ రిపబ్లిక్ వంటి స్థిరపడిన ఏరియల్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌లు ఉన్న దేశాల అథ్లెట్లతో పోటీపడి, సాంకేతికంగా డిమాండ్ ఉన్న రంగంలో గప్రోత్రా విజయవంతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఏరియల్ సిల్క్ అనేది పనితీరు ఆధారిత వైమానిక జిమ్నాస్టిక్స్ విభాగం. దీనికి గణనీయమైన పై శరీర బలం, ఓర్పు, వశ్యత మరియు కళాత్మక నియంత్రణ అవసరం. ఇది జిమ్నాస్టిక్స్ మరియు సాంప్రదాయ భారతీయ తాడు మల్లఖాంబ్‌తో సారూప్యతలను పంచుకున్నప్పటికీ, ఈ క్రీడ ప్రస్తుతం భారతదేశంలో ప్రధాన స్రవంతి. ఛాంపియన్‌షిప్ స్థాయిలో, రొటీన్‌లను కేవలం కష్టాన్ని బట్టి కాకుండా సాంకేతిక ఖచ్చితత్వం, కళాత్మకత ఆధారంగా నిర్ణయిస్తారు. గప్రోత్రా నియంత్రణ, స్థిరత్వం ప్రత్యేకంగా న్యాయనిర్ణేతల నుండి అత్యధిక మార్కులను సంపాదించాయి.




# ఆసియా కప్ విజేతగా పాకిస్థాన్
## టీమిండియాకు ఘోర పరాభవం

**న్యూఢిల్లీ:** మెన్స్ అండర్ 19, ఆసియా కప్-2025 విజేతగా పాకిస్తాన్ నిలిచి ట్రోఫీని తన్నుకుపోయింది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్‌ను 191 పరుగుల భారీ తేడాతో పాక్ చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ ఓపెనర్ సమీర్ మిన్హాస్ (172) భారీ శతకంతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 347 పరుగులు చేసింది.

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో భారత్ తొలి నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ ఓటమిని కొనితెచ్చుకుంది. 26.2 ఓవర్లలో భారత్ 156 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. పాక్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయగా, అలీ రజా 4, మొహమ్మద్ సయ్యమ్, అబ్దుల్ సుభాన్, సుజైఫా ఎహసాన్ తలో 2 వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టారు. భారత్ తరపున వైభవ్ సూర్యవంశీ 26 పరుగులకే వైఫల్యం చెందగా, కెప్టెన్ ఆయుష్ మాత్రే (2) స్టార్ ప్లేయర్ అరోన్ జార్జ్ (16) పెవిలియన్‌కు చేరారు. కేవలం 86 పరుగులకే 6 వికెట్లు కోల్పోవడంతో ఆదిలోనే భారత్ ఓటమి ఖరారైంది. చివర్లో దీపేశ్ దేవేంద్రన్ (36) బ్యాట్ ఝుళిపించి భారత్ స్కోర్‌ను పెంచాడు.

భారత్ ఇన్నింగ్స్‌లో ఇతనే టాప్ స్కోరర్. మిగిలిన ఆటగాళ్లలో విహాన్ మల్హోత్రా 7, వేదాంత్ త్రివేది 9, అభిగ్యాన్ కుందు 13, కనిష్క్ చౌహాన్ 9, జలన్ పటేల్ 19, హెనిల్ పటేల్ 6 పరుగులు చేసి ఔటయ్యారు. అంతకు ముందు పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో సమీర్ మిన్హాస్ మినహా మిగలిన వారు ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. అహ్మద్ హుసేన్ (56), ఉస్మాన్ ఖాన్ (35) ఫర్వాలేదనిపించారు.

ఓ దశలో పాక్ 400 పరుగుల మార్కు దాటుతుందని అనిపించింది. అయితే భారత్ బౌలర్లు చివర్లో పుంజుకోవడంతో పాక్ 347 పరుగులతో సరిపెట్టుకుంది. భారత్ బౌలర్లలో దీపేష్ దేవేంద్రన్ 3, హె నిల్ పటేల్, జలన్ పటేల్ రెండేసి, కనిష్క్ చౌహాన్ ఒక వికెట్ తీశారు.

# ఆస్ట్రేలియాదే యాషెస్ సిరీస్
## 82 రన్స్ తేడాతో ఇంగ్లండ్ మూడో ఓటమి

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్-2025లో ఆతిథ్య ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వరుసగా మూడో టెస్టులోనూ విజయం సాధించింది. అడిలైడ్ వేదికగా ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ 82 పరుగుల తేడాతో నెగ్గింది. 435 పరుగుల భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 352 పరుగులకే ఆలౌటైంది. జాక్ క్రాలీ (85), జెమీ స్మిత్ (60) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో విల్ జాక్స్ (41), బ్రెండన్ కార్స్ (39) పోరాడినా ఫలితం దక్కలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్ తలో 3, స్కాట్ బోలాండ్ ఒక వికెట్ పడగొట్టారు. కాగా 435 పరుగుల భారీ లక్ష్యంతో దిగిన ఇంగ్లాండ్ ప్రారంభంలోనే బెన్ డకెట్ (4) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఒలీ పోప్ (17) కూడా నిరాశ పర్చాడు. అయితే జో రూట్ (39) కాస్త కుదురుకున్నట్లే కనిపించినా, అతడిని కమిన్స్ పెవిలియన్‌కు పంపాడు. హ్యారీ బ్రూక్ (30), బెన్ స్టోక్స్ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో ఇంగ్లాండ్ కష్టాల్లో పడింది. ఈ సమయంలో జెమీ స్మిత్, విల్ జాక్స్ క్రీజులో నిలబడినా, చివర్లో మళ్లీ పట్టు బిగించిన ఆసీస్ వరుస వికెట్లు కూల్చి విజయం సాధించింది. ఇక తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (107), రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ (72)తో రాణించగా, రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (170) భారీ సెంచరీతో ఆస్ట్రేలియా ప్రత్యర్థి ముంగిట భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. తాజా విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది.







Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14